# జాతీయ స్ఫూర్తి

పక్షపత్రిక

2019, డిసెంబరు 1-15

వెల : రూ.15/-

మానవ హక్కుల మహానేత అంబేద్కర్

అంబేద్కర్ పోరాట వెలుగులో సామాజిక న్యాయం

హిందూ రాజ్యాన్ని అంబేడ్కర్ అతి పెద్ద ప్రమాదంగా ఎందుకు భావించారు?

అధోజగత్ సహోదరుడు - అంబేద్కర్

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ దృక్పథంలో 'స్త్రీ'

అంబేద్కర్ - అంబేద్కరిజం

అంబేద్కర్‌పై "పరివార్" అభూతకల్పనలు

2019 - అంతానికి ఆరంభం!

శ్రామిక వర్గ మహోపాధ్యాయుడు ఫ్రెడరిక్ ఎంగెల్స్

మార్క్సిజాన్ని సుసంపన్నం చేసిన ఎంగెల్స్

5

జాతీయ **స్ఫూర్తి** పక్షపత్రిక

వ్యవస్థాపక సంపాదకులు, ప్రచురణకర్త
నిడదవోలు వెంకటేశ్వరరావు

2019 డిసెంబర్ 1-15 సంపుటి : 28 సంచిక : 5

డి.వి.వి.యస్. వర్మ, ప్రధాన సంపాదకులు
సంపాదక వర్గం
డా॥ బి. రమేష్‌చంద్రబాబు
కొప్పర్తి వెంకట రమణమూర్తి
డి. సోమసుందర్
మందలపర్తి కిషోర్

వెల : 15/- రూపాయలు


## ఈ సంచికలో...


4 మానవ హక్కుల మహానేత
- గెయిల్ ఆంవెట్
6 అంబేద్కర్ పోరాట వెలుగులో..
- జస్టిస్ వి.ఆర్. కృష్ణయ్యర్
9 హిందూ రాజ్యాన్ని అంబేద్కర్ అతి పెద్ద ప్రమాదంగా ఎందుకు భావించారు?
- డాక్టర్ సిద్ధార్థ
10 అంబేద్కర్ - నేతల ప్రతాప్‌కుమార్
11 అంబేద్కర్ దృక్పథంలో స్త్రీ
- ప్రొ. జి. హరగోపాల్
18 అంబేద్కర్ - అంబేద్కరిజం
- అవిజిత్ పాథక్
21 పరివార్ అభూతకల్పనలు
- ఆర్వీ రామారావు
23 2019 అంతానికి ఆరంభం
- మందలపర్తి కిషోర్
24 శ్రామికవర్గ మహోపాధ్యాయుడు
- వి.ఐ.లెనిన్
30 మార్క్సిజాన్ని సుసంపన్నం చేసిన ఎంగెల్స్ - డి.వి.వి.యస్. వర్మ



**చందా వివరాలు**

| | |
|---|---|
| విడి ప్రతి | రూ. 15-00 |
| చందా వివరాలు : | |
| 2 సంవత్సరాలకు | రూ. 500-00 |
| 1 సంవత్సరానికి | రూ. 300-00 |
| విద్యార్థులకు | రూ. 150-00 |

*చందా డి.డి. లేదా మనియార్డరు ద్వారానే పంపండి. చెక్కులు పంపరాదు*

***NEFT లేదా RTGS పంపడానికి***
JAATEEYA SPURTHI
A/c No.3620 101 0000 380
Syndicate Bank, Eluru Main Branch
IFSC Code : SYNB0003620

*పంపవలసిన చిరునామా :*
**డా॥ బి. రమేష్‌చంద్రబాబు**
క్రాంతి నర్సింగ్ హోమ్, నన్నయ్య విగ్రహం వద్ద
మెయిన్‌రోడ్, తణుకు - 534 211
✆ 08819 222265, 93971 14495


# ఫ్రెడరిక్ ఎంగెల్స్

## ద్విశత జయంతి ప్రత్యేక సంచిక

### వ్యాసాలకు విజ్ఞప్తి



ఇది ఫ్రెడరిక్ ఎంగెల్స్ ద్విశత జయంతి సంవత్సరం. మార్క్సిజం, మార్క్స్ రచనలు, మార్క్స్-ఎంగెల్స్‌ల సంయుక్త రచనలు, ఎంగెల్స్ రచనల సమాహారం. ప్రపంచాన్ని దోపిడీ నుండి విముక్తి చేసే ఒక కొత్త తాత్విక, ఆర్థిక, చారిత్రక దృక్పధాన్ని అది వివరిస్తుంది.

జాతీయ స్ఫూర్తి 2020 ఫిబ్రవరి సంచికను "ఫ్రెడరిక్ ఎంగెల్స్ ద్విశత జయంతి ప్రత్యేక సంచిక"గా రూపొందిస్తున్నది. ఎంగెల్స్ జీవితము, సాగించిన సిద్ధాంత కృషి ప్రతిబింబించేలా ఈ సంచికకు వ్యాసాలను పంపించవలసినదిగా కోరుతున్నాం.

ఎంగెల్స్ రచనల మీద, మార్క్స్ - ఎంగెల్స్‌ల సంయుక్త రచనల మీద విశ్లేషణలు, పుస్తక పరిచయ వ్యాసాలను టైపులో నాలుగు, అయిదు పేజీలకు మించకుండా ఏదో ఒక అంశం మీద 2020 జనవరి 30 లోగా అందేలా పంపండి.

email : dvvsvarma1946@gmail.com

# అందరివాడు అంబేద్కర్

వర్తమాన భారతదేశంలో అత్యంత ప్రాసంగిత సంతరించుకున్న వ్యక్తి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్. ఆధునిక భారతదేశ మేధావుల్లో అంబేద్కర్ స్థానం అంతకు ముందెవ్వరూ సాధించనిది. విస్మరణకు గురైన జాతిలో జన్మించి సదా స్మరింపబడుతున్న వ్యక్తి ఆయన.

అంటరానిదిగా ముద్ర వేయబడిన కులంలో జన్మించిన అంబేద్కర్ ఉన్నత చదువులు చదువుకోవడం ద్వారా సామాజిక అసమానత మీద పోరాటానికి కొత్త తలుపులు తెరిచాడు. ఒక వైపు వలస పాలనకు వ్యతిరేకంగా స్వేచ్ఛ కోసం స్వాతంత్ర్యం కోసం పోరాటం సాగుతున్న దశలోనే ఆయన కులం సంకెళ్ళనుంచి తన జాతి విముక్తి కోసం సమాంతర పోరాటం చేశాడు. తద్వారా జాతి భావనకీ జాతీయోద్యమానికి విస్తృతమైన అర్థానిచ్చాడు. ఈ లక్ష్య సాధనకు నాటికి దేశ రాజకీయ సాంస్కృతిక రంగాల్లో నెలకొన్న బలీయమైన వ్యవస్థలనూ వ్యక్తులను ఎదుర్కొన్నాడు. తన పోరాటం బ్రాహ్మణుల మీద కాదనీ, బ్రాహ్మణీయ భావజాలం మీద మాత్రమేనని స్పష్టం చేయడంలోనే అంబేద్కర్ లక్ష్యశుద్ధి కనిపిస్తుంది.

సంపాదకీయం

హిందూ భావన సామాజిక సమానత్వానికీ ప్రజాస్వామికీకరణకీ ప్రధాన అడ్డంకుగా అంబేద్కర్ గుర్తించాడు. హిందూ సమాజంలో దళితులకు గౌరవప్రదమైన స్థానం దక్కే అవకాశం లేదని భావించినందువల్లే వారిని సమాంతర శ్రేణిగా గుర్తించాలని వాదించాడు. హిందువుగా మరణించను అని ప్రకటించిన అంబేద్కర్ బౌద్ధాన్ని స్వీకరించడంలోనూ, తనకు మాతృభూమి లేదని నిష్ఠూరపడినా చివరకు వాడ నుండి ఊళ్ళోకి, అక్కణ్ణించి పార్లమెంటుకు ప్రయాణించడంలోనూ ఆయన దేశీయత ఉంది.

అంబేద్కర్ ఆలోచనలు సామాజిక రంగానికే పరిమితం కాలేదు. సమకాలీన రాజకీయ ఆర్థిక, మత, సాంస్కృతిక రంగాలన్నిటికీ విస్తరించాయి. ప్రాథమికంగా అర్థశాస్త్ర నిపుణుడైన అంబేద్కర్ బ్రిటీష్ ఫైనాన్స్ మీద, రూపాయి సమస్య మీద మౌలికమైన ఆలోచనలు చేశాడు. దేశ విభజన మీద, చిన్న రాష్ట్రాల మీద, కాశ్మీరు మీద, కామన్ సివిల్ కోడ్ మీద ఆయన ఆలోచనలు ఇప్పటికీ మార్గదర్శకంగానే ఉన్నాయి.

భారత రాజ్యాంగ నిర్మాతగా కీలక భావనలైన స్వేచ్ఛ, సమనత్వం, సోదర భావాలనే కాక లౌకికత్వం రాజ్యాంగానికి ప్రాతిపదిక కావడంలో అంబేద్కర్ పాత్ర గుణాత్మకమైనది. ఈ దేశం హిందూ రాజ్యంగా అవతరించకుండా చేయడంలో ఆయన పాత్ర ఉంది.

భారతీయ లౌకికత్వం పెనుసవాళ్ళను ఎదుర్కొంటున్న తరుణం ఇది.

గోరక్షణ పేరుతో గోమాంస భక్షణ మూకదాడుల్ని ఎదుర్కొంటున్న సందర్భంలో, సామాజిక ఆర్థిక సమానత్వం కోసం ప్రతిపాదించబడిన రిజర్వేషన్‌లను పునస్సమీక్షించాలనే డిమాండు పెరుగుతున్న సందర్భంలో, రాజ్యాంగమే రద్దయ్యి అధ్యక్ష తరహా పాలనకో, నియంతృత్వానికో అడుగులు పడుతున్నాయని భావిస్తున్న సందర్భంలో ఈ ప్రశ్నలన్నిటికీ అంబేద్కర్‌లో సమాధానాలు దొరుకుతున్నాయి.

వేల సంవత్సరాలు వెలికి గురైన ఈ దేశపు ఐదో వంతు ప్రజల్ని ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడానికి కృషి చేసిన అంబేద్కర్ ఆ 'కొందరి'కే పరిమితం కావడం విషాదం. అందుకు జాతి మొత్తం బాధ్యత వహించి ఆయన రచనల్ని ప్రసంగాల్ని అధ్యయనం చెయ్యడం ద్వారా చారిత్రక వర్తమాన సమస్యలకు పరిష్కారాలను కనుగొనాల్సి ఉంది. ❑

**కొప్పర్తి వెంకట రమణమూర్తి**

అంబేద్కర్
63వ వర్ధంతి
ప్రత్యేక వ్యాసాలు


# మానవ హక్కుల మహానేత అంబేద్కర్



- గెయిల్ ఆంవెట్
తెలుగు ఎ.సుబ్రమణ్యం

'దళిత హక్కులు కూడా మానవ హక్కులే' అన్న నినాదం దళిత ఉద్యమానికి ఒక శక్తివంతమైన నినాదంగా మాత్రమే మిగలకుండా, భారతదేశంలోని కుల అణచివేతకు అంతర్జాతీయ స్థాయిలో ఒక గుర్తింపును, మద్దతును కూడగట్టడంలో కూడా సఫలీకృతమైంది'.

వాస్తవానికి బాబాసాహెబ్ అంబేద్కర్‌ను ఈ శతాబ్దంలోనే అత్యంత గొప్ప మానవహక్కుల పోరాటయోధుడుగా గుర్తించాలి. ఆయన పోరాటం చేసింది కేవలం అత్యంత అణచివేతకు గురి అయిన దళిత వర్గాల కోసమే కాక భారతదేశంలోని రైతులు, మహిళలు, కార్మికులు మరియు కులబాధితులందరి కోసం.



అంబేద్కర్ కార్మికుల, రైతుల హక్కుల కోసం కూడా పోరాడారు. 1920వ దశకం చివరన ముఖ్యంగా 1930లలో ఆయన 'ఇండిపెండెంట్ లేబర్ పార్టీ'ని స్థాపించి మహారాష్ట్రలోని కొంకణ ప్రాంతానికి చెందిన మహర్ మరియు కున్బీ కౌలుదారుల ప్రయోజనాల కోసం కూడా పనిచేశాడు. 1938లో ఆయన కాంగ్రెస్‌లోని తీవ్రవాద కాంగ్రెస్ సోషలిస్టు సభ్యుల మద్దతుతో 20,000 మంది రైతులతో నిర్వహించిన ఊరేగింపు, స్వతంత్రం రాక ముందు ఆ ప్రాంతంలో నిర్వహించిన అన్ని కార్యక్రమాల కంటే కూడా పెద్దది. అదే సంవత్సరం బ్రిటీష్ ప్రభుత్వం తీసుకు రావాలని ప్రయత్నిస్తున్న కార్మికుల సమ్మె హక్కును నిషేధించే 'నల్ల చట్టానికి' వ్యతిరేకంగా కమ్యూనిస్టులతో కలిసి బొంబాయి మిల్లు కార్మికులతో బ్రహ్మాండమైన సమ్మె చేయించాడు. అంబేద్కర్ బొంబాయి అసెంబ్లీలో కూడా ఈ బిల్లును వ్యతిరేకిస్తూ 'సమ్మెను నిషేధించడ అంటే స్వేచ్ఛను నిషేధించడమే' అని ప్రకటించాడు. అనంతరం లక్ష మందితో జరిగిన ఊరేగింపులో ప్రసంగిస్తూ కమ్యూనిస్టుల మద్దతును గూర్చి ఇలా అన్నారు – "ఇక్కడ కూర్చున్న కమ్యూనిస్టుల నాయకులందరికంటే ఎక్కువ పుస్తకాలు కమ్యూనిజం పై నేను చదివాను. కమ్యూనిస్టు సిద్ధాంతం ఎంత గొప్పదైనప్పటికీ అది ఆచరణలో ఎంతగా ఉపయోగపడుతుందనేది పరిశీలించ వలసి వున్నది. ఈ దృష్టితో కార్యక్రమాలు నిర్వహించగలిగితే రష్యాలో విప్లవం విజయవంతం కావడానికి పట్టినంత సమయం గాని, శ్రమ గాని భారతదేశంలో అవసరం లేదని నేను భావిస్తున్నాను. శ్రామికుల వర్గ పోరాటానికి సంబంధించి కమ్యూనిస్టుల భావాలు మాకు దగ్గరగా ఉన్నాయి".

ఈ కాలంలో (1935-1945) అంబేద్కర్ మార్క్సిజంచే ప్రభావితుడు అయ్యాడు. బ్రాహ్మణిజం, పెట్టుబడిదారీ విధానాలను దళిత వ్యతిరేక శక్తులుగా ప్రస్తావించారు. మార్క్సిజంలో ఆయనకు ఉన్న అభ్యంతరమంతా కులాన్ని నిర్లక్ష్యం చేయడం గురించే.

అంబేద్కర్ వర్గం, ఆర్థిక విషయాలలో కూడా కమ్యూనిస్టు లతో విభేదించాడు. ఆయన అధ్యయనం అంతా ఆర్థికశాస్త్రంలోనే జరిగింది. 1920లలో భారత ఆర్థికవిధానంపై రెండు ఉద్గ్రంధాలను రచించాడు. వాటిని పరిశీలించిన ఒక ప్రముఖ భారతీయ ఆర్థిక శాస్త్రవేత్త అంబేద్కర్ ఆర్థిక రంగం నుండి రాజకీయ రంగంలోకి మారడం ఒక విషాదంగా అభివర్ణించాడు. వర్గపోరాటాన్ని, అణచివేతను ప్రధానంగా భావిస్తూ వాటికి సమాధానాలను వేరేచోట వెతకటం ప్రారంభించాడు. ఆయన తన జీవితమంతా పరిశోధించి నిర్ధారించుకున్న శాస్త్రీయ, సాంఘిక విలువలు ఫ్రెంచి విప్లవంలో కనిపించాయి. బౌద్ధాన్ని అధ్యయనం చేసిన కొద్దీ ఆసియా ఖండంలో స్వేచ్ఛ, సామాజిక విలువలను బోధించగల్గింది బౌద్ధమేనని ఆయనకు అర్థం అయ్యింది. ఈ విషయాన్ని 'బుద్ధుడు లేక కారల్‌మార్క్స్' అనే వ్యాసంలో ఇలా ప్రస్తావించారు – "ఫ్రెంచి విప్లవంలో విలువలుగా ముందుకు వచ్చిన స్వేచ్ఛ స్వతంత్రం, సహోదరత్వం అనే మూడు విలువల కోసం సమాజం కొత్త ప్రయత్నాలను ప్రారంభించింది. ఈ నినాదం వల్లనే ఫ్రెంచి విప్లవాన్ని అందరూ ఆహ్వానించారు. అయితే అది సమానత్వాన్ని

సాధించడంలో విఫలం అయింది. అదే విధంగా సమానత్వాన్ని లక్ష్యంగా పెట్టుకున్నందువల్లనే రష్యా విప్లవాన్ని కూడా ఆహ్వానించాము. సమానత్వాన్ని సాధించే క్రమంలో స్వేచ్ఛను, సహోదరత్వాన్ని త్యాగం చేయడానికి సమాజం సిద్ధంగా లేదు. స్వేచ్ఛ, సహోదరత్వం లేకుండా సమానత్వానికి విలువ లేదు. ఈ మూడు సహజీవనం చేయాలంటే అది బౌద్ధంలోనే సాధ్యమవుతుంది. కమ్యూనిజం వాటిలో ఒకదానిని మాత్రమే ఇవ్వగల్గుతుంది" (అంబేద్కర్ రచనలు – ప్రసంగాలు 3వ సంపుటి, పే. 462)

అంబేద్కర్ సహోదరత్వం అనే పదాన్ని వాడడంలో ఫ్రెంచి వాళ్ళు ఉపయోగించిన పితృస్వామిక పదాన్నే వాడినప్పటికీ ఆయన దృష్టిలో సహోదరత్వం అంటే మహిళలతో కూడిన విశ్వవ్యాప్తిత సహోదరత్వం అనే అర్థం ఇమిడి ఉంది (పెటర్నటీ అనే పదానికి బదులు కమ్యూనిటీ అనే పదాన్ని నేను ఉపయోగించటానికి ఇష్టపడతాను). స్వాతంత్ర పూర్వ కాలంలో అంబేద్కర్ మహిళల హక్కుల కోసం పోరాడిన మహనీయులలో ఒకడు (ఈ విషయంలో మహారాష్ట్రలో మహిళా విముక్తి ఉద్యమానికి ఆద్యుడుగా పరిగణించబడిన జ్యోతిభాపూలేను అంబేద్కర్ అనుసరించాడు). వాస్తవానికి రాజ్యాంగ రచన తర్వాత కేంద్రమంత్రిగా స్వతంత్ర భారతంలో ఆయన చేపట్టిన ఆఖరి రాజకీయ కార్యక్రమం హిందూకోడ్ బిల్లు ప్రవేశపెట్టడంలో ఆయన కృషి హర్షనీయమైంది. ఈ చర్యను హిందూ తీవ్రవాదులు వ్యతిరేకించారు. ఆశ్చర్యకరంగా నెహ్రూ వంటి ఉదారవాద లౌకికవాద నాయకుడు కూడా అంబేద్కర్‌ను సమర్ధించలేదు. ఫలితంగా అంబేద్కర్ తన మంత్రి పదవికి రాజీనామా చేశాడు. బహుశా స్వతంత్ర భారతంలో ఒక సిద్ధాంతానికి కట్టుబడి మరి ముఖ్యంగా మహిళల హక్కుల కోసం రాజీనామా చేసిన అతి కొద్ది మంది మంత్రులలో అంబేద్కర్ ముఖ్యులు.

ఒక దళిత మానవ హక్కుల కార్యకర్తగాను, మానవ హక్కుల పోరాట యోధుడుగాను అంబేద్కర్ బౌద్ధంలో సమాధానాలు వెతకసాగాడు. ఆయన తన నిబద్ధతతోను, స్వానుభవంతోను, భారతదేశ చరిత్ర అధ్యయనం ద్వారాను హక్కుల ఉల్లంఘనకు కారణం కులమేనన్న విషయాన్ని దానికి మూలం బ్రాహ్మణిజమేనని నిర్ధారించాడు. ఆయన అభిప్రాయంలో బ్రాహ్మణిజమే ఒక మానవ హక్కుల ఉల్లంఘన, స్వేచ్ఛ, స్వతంత్రం, సహోదరత్వాల నిరాకరణ. మరి దీనికి పరిష్కారం ఏమిటి? సిక్కు మతాన్ని గురించి మరికొన్ని ఇతర ప్రత్యామ్నాయాల గురించి పరిశీలించిన తర్వాత ఆయన బౌద్ధం వైపు తన దృష్టిని మళ్ళించారు. అది భారతీయ మతం అయినందువల్లనే కాక

**అంబేద్కర్ 63వ వర్ధంతి ప్రత్యేక వ్యాసాలు**

సమానత్వం, హేతుబద్ధత ప్రాతిపదికగా గల సిద్ధాంతంగా మాత్రమే కాక స్వేచ్ఛ, స్వతంత్రం, సామాజిక సహోదరత్వాలను విలువలుగా ప్రతిపాదించిన మతం బౌద్ధమేనని అంబేద్కర్ అభిప్రాయం. కులం సృష్టించిన కల్లోలం నుండి భారతదేశాన్ని రక్షించగల్గినది బౌద్ధమేనని ఆయన నమ్మాడు. ఆధునిక భారత సమాజానికి తగిన మతం బౌద్ధమేనని అభిప్రాయపడుతూ తన 'బుద్ధుడూ – ఆయన ధమ్మం' అనే గ్రంథంలో ఇలా వాదించాడు. "సమాజం మూడు ప్రత్యామ్నాయాలలో ఒక దానిని ఎంచుకోవలసి వుంది. ప్రభుత్వ సాధనంగా ధమ్మాన్ని కాదనుకోవచ్చు. అనగా ఆ సమాజం అరాచకాన్ని కోరుకోవడమే అవుతుంది. రెండవది నియంతృత్వాన్ని, పోలీసు వ్యవస్థను ఒక సాధనంగా ఎంచుకోవడం. మూడవది ధమ్మం విఫలం అయినపుడు న్యాయ విచక్షణను ఎంచుకోవడం, అరాచకంలోను, నియంతృత్వంలోను స్వేచ్ఛ వుండదు. మూడవ ప్రత్యామ్నాయంలో మాత్రమే స్వేచ్ఛ మిగులుతుంది. అందువల్ల స్వేచ్ఛను కోరుకునే వారు ధమ్మాన్ని ఎంచుకోవలసిందే".

ఆ విధంగా అంబేద్కర్ బౌద్ధదమ్మం వైపు మళ్లడం అంటే దానిని ఒక సామాజిక నైతిక సూత్రంగా అంగీకరించినారన్న మాట. బుద్ధుడు లేక కారల్‌మార్క్స్ అనే వ్యాసంలో పేదరికాన్ని నిర్మూలించడానికి, అనాధలను ఆదరించడానికి చక్రవర్తి తన రాజరికాన్ని వినియోగించే ఉదాహరణను ప్రస్తావించారు. ఈ విషయంలో రాజు విఫలమైతే అరాచకాన్ని, నేరాలను అదుపు చేయడంలో విఫలమవుతాడు. రాజ్యం కష్టాలపాలు అవుతుంది. ఆ విధంగా ఈ వ్యాసంలో అంబేద్కర్ ఒక నిర్ధారణకు వస్తాడు – "ఈ ఉదాహరణ ద్వారా నైతిక శక్తులు విఫలమైతే ఆరాచక శక్తులు విజృంభిస్తాయని, ప్రతి మనిషిని నైతిక శిక్షణకు అవకాశం కల్పించడం ద్వారా న్యాయ సామ్రాజ్యాన్ని నిలబెట్టుకోగల్గుతారు", (అంబేద్కర్, 1987, పే. 459).


అంబేద్కర్ చివరగా ప్రచురించిన పుస్తకం 'బుద్ధుడూ ఆయన ధమ్మం'లో బౌద్ధానికి ఒక సామాజిక నైతిక హేతుబద్ధమైన వివరణను ఇచ్చే ప్రయత్నం చేసాడు. అదే నవయాన బౌద్ధం. ఈ విధానంతోనే నేటి బౌద్ధానికి ఎక్కువ మంది అంగీకారం లభిస్తున్నది. ❑

**(అమెరికాలో జన్మించి భారతదేశంలో స్థిరపడిన గెయిల్‌ఆంవెట్ దళిత సంస్కృతి రాజకీయాలపై సాధికార పరిశోధనలు చేశారు)**

అంబేద్కర్ 63వ వర్ధంతి ప్రత్యేక వ్యాసాలు

# అంబేద్కర్ పోరాట వెలుగులో సామాజిక న్యాయం

- జస్టిస్ వి.ఆర్. కృష్ణయ్యర్
సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి



"శతాబ్దాల బరువును మోసీ మోసీ
అతను తన నాగలి మీదికి ఒరిగిపోయాడు
ఇక కింది చూపేగానీ పై చూపు లేదు
అతని కన్నుల్లో యుగయుగాల ఖాళీ తనం
వీపుపై ప్రపంచ భారం
ఏ ఆశనిపాతం అతన్ని పశుప్రాయుణ్ణి చేసి
నిశ్చేష్టపర్చింది?
అతని పైకి క్రూరపంజాల్ని విసిరి
కనుబొమ్మల్ని విరిచేసిందెవరు?
అతని మస్తిష్కంలోని జ్ఞాన దీపాలనార్పిం దెవరు?
ఈ వికృత ఆకారంలో
మానవత్వం దోచుకోబడి, హక్కుల్ని కోల్పోయి
నిర్లక్షితయై వంచింపబడింది.
ప్రపంచ న్యాయమూర్తుల ముందు
అన్నార్తుల హాహాకారాలు నిరసన తెలుపుతున్నాయి.
ఇప్పుడు నిరసన కూడా ప్రవచనమే..."

– ఎడ్విన్ మార్కం

అంబేద్కర్ శత జయంతి సంవత్సరం నుండీ "సామాజిక న్యాయం" అనే మాటను పదే పదే ఉపయోగిస్తున్నారు. నిజానికి 1950 జనవరి 26 నుండి – రాజ్యాంగంలో ఆ మాట చోటు చేసుకుంది. తమపై అన్యాయాలు, అక్రమాలు, దౌర్జన్యాలు జరుగుతున్న నేపథ్యంలో షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలుగా పిలిచే అణగారిన వర్గాల వారు న్యాయం కోసం గొంతెత్తి అరిచినప్పుడల్లా ఈ ''సామాజిక న్యాయం'' వారితో దాగుడుమూతల దోబూచులాట లాడుతూనే వుంది. సామాజికంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా, విద్యాపరంగా అణచివేతకు గురవుతున్న అశేష పీడిత జనాంగం ప్రధాన జీవన స్రవంతిలో భాగం కావడానికి పెనుగులాడుతున్నారు. భారత రాజ్యాంగం తమకు వాగ్దానం చేసిన అంశాలను సాధించుకోవడంలో వారు విజయం సాధించలేక పోయారు. భారత దేశంలో పరయ్యలుగా, మ్లేచ్ఛులుగా, అంత్యజులుగా ఇంకా అనేక పేర్లను మోస్తున్నవారికి సామాజిక ఆర్థిక న్యాయం కలిగించాలనీ, సమాజంలో మిగతావారితో సమానమైన సామాజిక హోదా కల్పించాలనీ, మానవగౌరవం, సౌభ్రాతృత్వం తదితర స్వతంత్ర ఫలాలను వారికి అందించాలనీ రాజ్యాంగంలో రాసిన అంశాలన్నీ రాష్ట్ర సచివాలయాల్లోనూ, ప్రణాళికా సంఘాల్లోను కాగితాలకే పరిమితమైన భ్రమల వలయాలుగా మిగిలిపోయాయి. ఎంతో కాలంగా రకరకాల రంగుల రాజకీయ శ్రేణులన్నీ సామాజిక న్యాయానికి సంబంధించిన వాస్తవాలను మరుగునపర్చారు. అయితే అంబేద్కర్ శత జయంతి సంవత్సరంలో సమాజంలో అణగారిన వర్గాలు న్యాయం కోసం, హక్కుల కోసం వేస్తున్న పెను కేకల్లో తీవ్రత పెరిగింది. ఇన్ని దశాబ్దాలూ సామాజిక న్యాయం అన్నమాట ఒక మంత్రంలాగా పనిచేసి అణగారిన వర్గాల వారిని జోకొట్టి నిద్రపుచ్చే మత్తు మందయ్యింది. అయితే గతం శైథిల్యాల నుండి ఒక కొత్త ఆశ చిగురిస్తుంది. పోగొట్టుకున్న హక్కుల్ని సాధించడానికి అవి వర్గాలకు ఒక కొత్త శక్తి ఉద్భవిస్తుంది. ఒక గిరిజన మేధావి చెప్పు కవితా పదాలను ఈ మధ్యనే విన్నాను.

ఏదో ఒక రోజు
ఈ పొలాలు పచ్చపచ్చగా చిగురిస్తాయి.
భూమి నల్లగా.. సారభూత క్షేత్రమై వర్ధిల్లుతుంది.
ఆ భూమిపైన మాపిల్లలు.. మాపిల్లల పిల్లలు
ఎత్తుగా ఎదుగుతారు
కొండ మీద పెరిగే చెట్లుల్లాగా
ఎగురుతున్న పిట్టల్లాగా
వాళ్ళు స్వేచ్ఛగా వుంటారు.
ఏదో ఒక రోజు...
ఆ భూమి మరొక్కసారి తమ కోసం
జయించబడుతుందన్న విశ్వాసంతో
సజీవ ఆనంద డోలికల్లో మునిగేందుకు
ప్రతిరోజూ వాళ్ళు నిద్రలేస్తారు.
అందుకోసం
ఇప్పుడు మేమీ బీడు భూముల్ని దున్నుతున్నాం
ప్రతి నాగేటి చాలునూ నెత్తుటితో తడుపుతున్నాం. – జమోరా

బాబాసాహెబ్ అని పిలిచే ఒక మనిషి రూపంలో ఉన్న చిచ్చర పిడుగును ఇప్పుడు మళ్ళీ మనం సంస్మరించుకుంటున్నాం. ఆ సంస్మరణా విద్యుత్తులో ఇప్పటిదాకా అన్ని బాధల్నీ మౌనంగా భరించిన పీడిత జనాంగం ఒక్కసారిగా అపరకాళీలురయ్యాయి. తరాలుగా వెట్టి చాకిరీ చేస్తున్న వాళ్ళు ఇంకే మాత్రమూ వెట్టి

వారుగా కొనసాగడానికి సిద్ధంగా లేరు. ఇప్పుడు ఈ అణగారిన వర్గాల వినిపించని ఏడుపులు కనిపించని కన్నీళ్ళు బిగిసిన పిడికిళ్ళుగా ఎర్రబారిన నేత్రాలుగా రూపొందుతున్నాయి. నిజం... ఈ రోజు కూడా వాళ్ళ గొంతులు అణగారిపోతున్నాయి. వాళ్ళ జీవితాలు నిద్రలేని నిశిరాత్రులుగా మిగిలిపోతున్నాయి.

ఈ బడుగు బతుకుల్ని విముక్తి చేయడానికి అధికార వర్గాలు ముందుకు వస్తే భారత సమాజంలో అత్యద్భుతమైన సమతా కుసుమాలు వెల్లివిరుస్తాయి. మానవ గౌరవానికి సంబంధించి సరికొత్త చైతన్యం రెక్కలిప్పుతుంది. సరికొత్త మానవ శక్తులు వికసించే దేశం సుసంపన్నమవుతుంది. అప్పుడు మాత్రమే అసలైన సౌభ్రాతృత్వం వర్ధిల్లి దళిత జనాంగం అగ్ర వర్గాల వారితో కలగలిసి పోయే సమతా వాతావరణం నెలకొంటుంది.. అయితే కేవలం చట్టాలు చేసినంత మాత్రాన అంతరాంతరాల్లో పాతుకుపోయిన సామాజిక అసమానతలు, ఆర్థిక బంధనాలు తొలగిపోవు. ఉన్న పరిస్థితిని సమూలంగా మార్చుకొనేందుకు బాధిత వర్గాలు సంసిద్ధం కావాలి. వారికి తగిన చేయూతనివ్వాలి ఇది దళిత కార్మిక వర్గం సాగించే మరో స్వతంత్ర పోరాటం.

మన భారత రాజ్యాంగంలో దళితుల అభ్యున్నతి కోసం, అసమానతలను నిర్మూలించి వారికి విద్యా ఉద్యోగవకాశాలు కల్పించడం కోసం అనేక చట్టాలున్నాయి. వెట్టి చాకిరీ చట్టప్రకారం రద్దయ్యింది. రాజ్యాంగం ప్రకారం అస్పృశ్యత నిర్మూలన మయ్యింది. దళితులకు జరిగే అన్యాయాలను సవరించడానికి, నిందితులను శిక్షించడానికి పౌర హక్కుల చట్టం సంసిద్ధంగా వుంటుంది. కానీ ఎందుకో మరి ఈ అత్యద్భుత పరిష్కార మార్గాలన్నీ కాగితపు పులుల్లాగా నిద్రపోతున్నాయి. ఆర్థిక అరాచకత్వం, అవినీతి నిరాఘాటంగా చలామణీ అయిపోతుంది. చట్టాలు మృతప్రాయాలుగా పడివున్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికలు, ఉప ప్రణాళికలు, పథకాలు రూపొందిస్తూనే వున్నాయి. కానీ అసలు నిజాలేమిటి?

ఈ సందర్భంలో టాల్‌స్టాయ్ ఏమంటాడంటే "బానిసత్వం నిర్మూలన ఎప్పుడో జరిగిపోయింది. రోమ్ బానిసత్వాన్ని నిర్మూలించింది. అమెరికా కూడా నిషేధించింది. మేం కూడా నిర్మూలించాం. అయితే కేవలం మాటలు మాత్రమే నిషిద్ధ మయ్యాయి బానిసత్వం అలాగే వుంది.." - లియో. ఎన్.టాల్ స్టాయ్

ఈనాటికీ దళితుల పైన వివక్ష కొనసాగుతూనే వుంది. దేశంలో కొన్ని ప్రాంతాల్లోనైనా అస్పృశ్యతా నేరం సాగుతూనే వుంది. ఈనాటికీ దళిత బతుకుల మీద వెట్టి చాకిరీ, బానిసత్వాలను రుద్దుతూనే వున్నారు. దళిత విముక్తి చట్టాలన్నీ వైఫల్యాలుగా., బూటకపు చట్టాలుగా మిగిలిపోయాయి. దళితుల మీద జరిగే అత్యాచారాల కేసుల్ని సాధారణంగా స్థానిక పోలీసులే పరిశోధిస్తారు. దళిత స్త్రీలపై సామూహిక అత్యాచార జరిగితే ఆ కేసు కోర్టు ముఖమైనా చూడదు. చూసినా తీర్పు దాకా నిలబడదు. ఆ పోలీసులకు గానీ, కోర్టులకు గానీ, 'దళిత స్త్రీలకు అన్యాయం జరిగిందే వారికి న్యాయం చేద్దాం' అన్న మానవస్పృహ గానీ, సామాజిక బాధ్యత గానీ లేకపోవడం ఒక కారణమైతే ఇలాంటి కేసుల్లో ఒక వైపున అగ్రవర్ణ భూస్వామ్య వర్గాలుంటాయి. అవతలి వైపున దళిత సోదరుడో.... సోదరో వుంటుంది. ఇంకేం న్యాయం జరుగుతుంది?

విద్యా ఉద్యోగ విషయాల్లో కూడా పరిస్థితి అంతే వుంది. కేవలం కొద్ది మంది మాత్రమే రిజర్వేషన్ల ఫలితాలను అనుభవిస్తున్నారు. ఐ.ఎ.ఎస్.లో గానీ, ఐ.పి.ఎస్.లో గానీ ఎంత మంది దళితులున్నారు? దళితుల నుండి ఎంత మంది విద్యా మంత్రులు, ఎంత మంది ప్రధాన న్యాయమూర్తులయ్యారు? ఎంత మంది న్యాయశాఖ శ్రేణుల్లో అధికారులయ్యారు? దేశంలోని వివిధ ఉన్నత ఉద్యోగాల్లో ఎంత మంది దళితులున్నారు? దళితులకు కల్పించామని చెప్తున్న ప్రత్యేక సదుపాయాలన్నీ బూటకమే.. అతిశయోక్తి. మీకు విషయం అర్థం కావడానికి రెండు ఉదాహరణ లిస్తాను. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకంలో 75శాతం దళితుల కోసం కేటాయించారు. సాధారణంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తులను హైకోర్టు న్యాయమూర్తులనుండే ఎంపిక చేస్తారనే విషయం అందరికీ తెలిసిందే. మరి హైకోర్టులో ఒక్క దళిత న్యాయమూర్తి కూడా లేకపోతే అంతెక్కువ శాతం రిజర్వేషన్ వల్ల కూడా సుప్రీంకోర్టు బెంచీలోకి ఒక్క దళిత న్యాయమూర్తి కూడా రాదు కదా ! ఇలాంటిదే మరొక ఉదాహరణ. ఇది కేరళలో జరిగింది. ప్రభుత్వం నడిపే కేంద్రంలో ఏనుగుల్ని మచ్చిక చేసి, వాటికి శిక్షణనిచ్చే 'మావటీ' ఉద్యోగాలను గిరిజనులకు రిజర్వు చేశారు. అయితే అందుకు కనీస విద్యార్హత మెట్రిక్యులేషన్ అని ప్రకటించంతో ఒక్క గిరిజనుడూ ఉద్యోగం సంపాదించలేక పోయాడు. నిజానికి వాళ్ళందరూ ఏనుగులు క్రూరంగా, సంచరించే అడవుల్లో బతుకుతున్న వారే. వాళ్ళకి ఏనుగుల్ని మచ్చిక చేయడం బాగా తెలుసు. ఇట్లా ఎన్నైనా ఉదాహరణలు చెప్పుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీలు 22.5 శాతం ఉన్నారు. వారు ఆ దామాషా ప్రకారం ఉన్నత పదవుల్లో సైతం 22.5 శాతం రిజర్వేషన్ పొందుతున్నారని ప్రచారముంది. నిజానికి 1979లో ఎస్సీలు 4.75 శాతం, ఎస్టీలు 0.94 శాతం, 1981లో ఎస్సీలు 4.62 శాతం, ఎస్టీలు 0.97 శాతం మాత్రమే. క్లాస్ 1 ఉద్యోగాల్లో రిజర్వేషన్ పొందారు. 1982 మార్చి 16వ తేదీ నాటికి 370 మంది ఉన్న హైకోర్టు న్యాయ మూర్తుల్లో కేవలం నలుగురు మాత్రమే ఎస్సీ, న్యాయమూర్తులు కాగా ఒక్క ఎస్టీ న్యాయమూర్తి

**అంబేద్కర్ 63వ వర్ధంతి ప్రత్యేక వ్యాసాలు**

కూడా లేదు. న్యాయశాఖలోనూ, మిగతా ఉద్యోగాల్లోనూ దళితులు వివక్షకు గురవుతూనే వున్నారు. ఇంకా అస్పృశ్యత కొనసాగుతూనే ఉంది. ఉన్నత విద్యారంగంలో సైతం రిజర్వేషన్లు సరిగా అమలు కావడం లేదన్నది స్పష్టం. అంబేద్కర్ అమితంగా అభిమానించే మహాత్మాపూలే "విద్య లేకనే అతిశూద్రులు బాధితులయ్యారు" అని పేర్కొన్నారు. బాబాసాహెబ్ అంబేద్కర్ కూడా "విద్యలో నైపుణ్యత సాధించడమనేది సామాజిక దురాచారాలను రూపుమాపడానికి సాధనంగా ఉపయోగపడు తుందని నా నమ్మకం. దేశంలోని అణగారిన జనం సమస్య కేవలం ఆర్థికమే కాదు సాంస్కృతికం కూడా. కేవలం కూడు, గుడ్డ, ఆర్థికమే నీడ కల్పించి ఉన్నత వర్గాల వారికి సేవచేసే వారుగా తయారు చేయడం నాకిష్టం లేదు. తరతరాలుగా నా జనంలో జీర్ణించుకు పోయిన న్యూనతా భావాన్నీ, ఇతరులకు దాస్యం చేసే స్వభావాన్ని తొలగించి ఈ దేశంలోని ప్రస్తుత సామాజిక నిర్మాణంలో క్రూర దోపిడీకి గురవుతున్న వారిని విముక్తి చేయాలని నేననుకుంటాను. ఉన్నత స్థాయిలో విద్యావంతులు కావడం ద్వారానే అది సాధ్యమవుతుందని నా నమ్మకం" అంటారు. కాబట్టి దళితుల్ని పైకి తీసుకురావాలంటే విద్యలో రిజర్వేషన్లును నిజాయితీకి అమలు చేయాలి. దళితుల్ని అక్షరాస్యుల్ని చేయడానికి ఆకర్షణీయమైన చర్యల్ని చేపట్టారు. అవసరమైతే ఇంగ్లీషు మీడియం, కాన్వెంట్ స్కూల్లో రాయితీలిచ్చి చదివించాలి. ఈ విధంగా జరగనంత కాలం రాజ్యాంగంలో చాతుర్వర్ణం కొనసాగుతూనే వుంటుంది. ప్రస్తుతం సామాజిక విప్లవం అవసరం. విద్యా విప్లవం అవసరం. ఉన్నత ఉద్యోగాల్లో పెను విప్లవం అవసరం. ఈ మాటలు చర్చకు వచ్చినప్పుడల్లా "ప్రతిభ" ప్రసక్తి వస్తుంది. నిజానికి దళితులకు సరైన వాతావరణం ఏర్పర్చి, సరైన అవకాశాలు సమకూర్చి, సరైన శిక్షణనిస్తే అగ్ర వర్ణాలుగా కొనసాగే వారికి ధీటుగా తయారవుతారు. వాళ్ళు ఉత్తమోత్తమ ప్రతిభాశీలురుగా వన్నెకెక్కుతారు. ప్రాచీన భారతంలో అత్యంత మేధా సంపన్నుడుగా ప్రసిద్ధి చెందిన తిరువళ్ళువార్ దళితుడేనని మీకు తెలుసా? తమిళ భక్తి గీతాలు కూర్చిన అళ్వారులు దళితులే. ఈ సందర్భంగా డాక్టర్ బాబాసాహెబ్ చెప్పిన విషయాన్ని ఇక్కడ క్రోడీకరించాలి.

***" హిందువులు వేదాలు కావాలనుకున్నారు. అందుకే వ్యాసుణ్ణి పిలిచారు... వ్యాసుడు సవర్ణ హిందువు కాదు హిందువులు ఒక పురాణం కావాలనుకున్నారు. అందుకే వాల్మీకిని పిలిచారు. వాల్మీకి అస్పృశ్యుడు. హిందువులు ఒక రాజ్యాంగం కావాలనుకున్నారు. అందుకు నన్ను పిలిచారు" – డా॥ అంబేద్కర్***

దళితులకు ఏ దేవుడో ఇచ్చిన శాపమేమీ లేదు. సమాజమే వారిని జ్ఞానానికి, హక్కులకూ, సామాజిక హోదాకు దూరం చేసి పశుప్రాయపు బానిసల్ని చేసి చీకటిలోకి నెట్టివేసింది. ఇప్పుడు వారికేవో రిజర్వేషన్లు వస్తున్నాయని వారిని నిందితుల్ని చూసినట్లు చూడడం, విచిత్రమైన విషయం, మండల్ మంటల్లో, వీధుల్లో రక్తపాతం జరుగుతోంది. అసలు విషయం తెలియక అనవసరపు పోరాటం కొనసాగుతోంది. రిజర్వేషన్ లెక్కల ముసుగులు తొలగించి చూస్తే సామాజిక అణచివేతకు గురవతున్న వారికి సమాన న్యాయం కల్పించడానికి మనం ఇంకా ఎన్నిమైళ్ళ దూరం ప్రయాణించాలో తెలుస్తుంది. దళితుల్లో ఏ కొద్దిమందో కాస్తో కూస్తో చదువుకొని అప్పటిదాకా తాము జీవించిన అట్టడుగు పొరల్ని మర్చిపోతున్నారు. తమ కుటుంబాల్ని చూసుకోడానికి పరిమితమై పోతున్నారు. 1956లో బాబాసాహెబ్ చదువుకున్న దళితుల గురించి ఈ విధంగా అంటారు.

దళితుల్లో ఉన్నత విద్య సభ్యసించిన వర్గం నాకు ద్రోహం చేసింది. వాళ్ళు బాగా విద్యావంతులైన తర్వాత సమాజానికి సేవ చేస్తారని నేను భావించాను. కానీ నేనిప్పుడు తమ పొట్టల్ని నింపుకోడంలో నిమగ్నమయిన గుమస్తాల గుంపును చూస్తున్నాను" (1956 మార్చి 18న ఆగ్రాలోని రామ్ లీలా మైదానంలో ఉపన్యాసం

అవకాశాలు వచ్చినవారు కుటుంబాల వరకే చూసుకుంటు న్నారు. మిగతా దళితులు దళితులుగానే మిగిలిపోతున్నారు. భూమిలేని నిరుపేద దళితులకు భూమి ఇవ్వకపోతే, చిల్లిగవ్వ లేని అస్పృశ్యునికి కుటీర పరిశ్రమలు కల్పించుకొనే అవకాశం కల్పించకపోతే బానిసత్వంలో మగ్గిపోతున్న స్త్రీ బంధనాలను తెగ తెంచకపోతే.. సౌభ్రాతృత్వం, సమానత్వం అన్న మాటలు అందని ఆకాశ కుసుమాలే అవుతాయి.

దళితులకు రాజ్యాధికారం కావాలి. చట్టసభల్లో దళితులకు, రిజర్వేషన్లున్నాయి. కాబట్టి వాళ్ళు రాజ్యాధికారం సాధిస్తారన్నది వట్టి భ్రమ. అవి రాజకీయ పార్టీల మధ్యన విభజితమై ఉన్నాయి. – అవి కూడా ఆధిపత్య వర్గాల చెప్పుచేతల్లో ఉన్నాయి. దాని వలన రాజకీయ చర్యలో అనైక్యత పెరుగుతుంది. ఈ పరిస్థితికి అంబేద్కర్ చెప్పినదొకటే మందు. ఆయన "అన్ని సమస్యలకూ పరిష్కారం రాజకీయాధికారం ఒక్కటే" అంటారు. అందుకోసం ఆయన దళితులకు ఇచ్చిన "బోధించు, సమీకరించు, పోరాడు" సందేశంతో ముందుకు నడవాలి.

ఆఖరి దళిత పల్లె కూడా స్వేచ్ఛా స్వతంత్రాలను పొంది సమానతను సాధించినప్పుడే భారతదేశానికి నిజమైన స్వతంత్ర్యం సిద్ధించినట్లు, దళిత పల్లెలేవీ ఈనాడు స్వేచ్ఛగా లేవన్న సత్యాన్ని ముందు మనం గుర్తిద్దాం. ❑

**"సత్యాన్ని తెలుసుకో, సత్యం నిన్ను విముక్తి చేస్తుంది" - యోహాను *8.32***

**అనుసృజన కలేకూరి ప్రసాద్ ("దళిత రాజ్యం" నుండి)**

# హిందూ రాజ్యాన్ని అంబేడ్కర్ అతి పెద్ద ప్రమాదంగా ఎందుకు భావించారు?

- డాక్టర్ సిద్ధార్థ
సామాజికవేత్త

అంబేద్కర్ 63వ వర్ధంతి ప్రత్యేక వ్యాసాలు

భారతదేశాన్ని హిందూ రాజ్యంగా మార్చాలనే కల ఇటీవలి కాలానిదేమీ కాదు. కాకపోతే అది ఈ మధ్య కాలంలో ఎక్కువ ప్రాచుర్యం పొందింది.

సంఘ్ (ఆర్ఎస్ఎస్) అనుబంధ సంఘాలు జాతీయగీతం, బీఫ్, గోరక్షణ, రామమందిరం వంటి వాటిపై చూపుతున్న దూకుడు ధోరణి దానికే ముందస్తు సంకేతాలు.

గోహత్యను నిషేధించే చట్టాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ వాదిస్తున్నారు. రిజర్వేషన్లపై పునస్సమీక్ష చేయాలనే ప్రకటన కూడా ఆయన గతంలో చేసి ఉన్నారు.

హిందూ సంస్కృతిని భారతదేశమంతటా ఆదర్శ జీవన నియమావళిగా మార్చాలనేది సంఘ్ ప్రకటిత లక్ష్యం. మహిళలకు డ్రెస్ కోడ్, లవ్ జిహాద్కు వ్యతిరేకంగా క్యాంపెయిన్ వంటి వాటిని వారు నడిపిస్తూనే ఉన్నారు.

నిజానికి ఇస్లామ్ ఆధారిత ప్రత్యేక దేశం, హిందూ దేశం రెండు డిమాండ్లూ కవల పిల్లల్లాగే పుట్టాయి. ఇవి రెండూ పరస్పరం మద్దతు ఇచ్చుకున్నాయి.

### మత ఆధారిత దేశం

వాస్తవం ఏంటంటే హిందూ మెజారిటీ పాలనా భయం నీడలోనే పాకిస్తాన్ కావాలనే డిమాండ్ పుట్టి, పెరిగి పెద్దదైంది.

డాక్టర్ అంబేద్కర్ 1940లో మత ఆధారిత పాకిస్తాన్ దేశం కోసం చేస్తున్న డిమాండ్ సందర్భంగా హెచ్చరిక చేస్తూ ఇలా అన్నారు – "ఒకవేళ హిందూ దేశం ఏర్పడినట్టయితే అది దేశానికి భారీ ప్రమాదం అవుతుందనడంలో అనుమానం లేదు. హిందువులు చెప్పేది ఏమైనా కావొచ్చు కానీ, హిందుత్వ అనేది స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం అన్న భావనలకు ప్రమాదకరం. అలా చూసినపుడు ఇది ప్రజాస్వామ్యానికి ఏ మాత్రం అనుగుణమైంది కాదు. ఎట్టి పరిస్థితిలోనైనా సరే హిందూ రాజ్యం ఏర్పాటును వ్యతిరేకించాలి."

నేటికి 77 ఏళ్ల క్రితం అంబేద్కర్ ఏ ప్రమాదం గురించి హెచ్చరించారో, అది నేడు భారతదేశం ముంగిట్లోకి శక్తిమంతంగా వచ్చి నిలుచుంది.

రాజ్యాంగంలో మార్పేమీ జరగనప్పటికీ, లాంఛనంగా మనది ఇంకా లౌకికవాద దేశమే అయినప్పటికీ, వాస్తవిక జీవితంలో మాత్రం హిందుత్వవాద శక్తులు సమాజం, సంస్కృతులతో పాటు అధికార పీఠంపైనా బలమైన పట్టు సాధించాయి.

### బీజేపీ విజయం

ఇటీవలి విధానసభ ఎన్నికల్లో – ముఖ్యంగా ఉత్తర్ ప్రదేశ్‌లో బీజేపీ భారీ విజయం సాధించిన తర్వాత, పాలనా తీరుతెన్నులు, ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలు, సంఘ్ పెద్దలు చేస్తున్న ప్రకటనలను బట్టి చూస్తే ఇందులో ఇక అనుమానానికి తావేలేదు.

ఎట్టి పరిస్థితుల్లోనైనా సరే, భారత్‌ను హిందూ దేశంగా మారిపోకుండా అడ్డుకోవాలని అంబేద్కర్ భావించారు. ఎందుకంటే హిందూ జీవన నియమావళి స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి విలువలకు పూర్తిగా విరుద్ధమైందని ఆయన భావించేవారు.

హిందూ రాజ్యాన్ని ఆయన వ్యతిరేకించడానికి కారణం ముస్లింల పట్ల హిందువులు కలిగి ఉన్న ద్వేషానికే పరిమితం కాదు.

వాస్తవం ఏంటంటే, ఆయన 'హిందూ రాజ్యం ముస్లింలకన్నా, హిందువులకే ఎక్కువ ప్రమాదకరం' అని ఆయన భావించేవారు.

ఆయన హిందూ రాజ్యం దళితులకూ, మహిళలకూ వ్యతిరేకమైందని భావించారు. కుల వ్యవస్థను నిలబెట్టి ఉంచడానికి అనివార్యమైన షరతు మహిళలు కులాంతర వివాహాలు చేసుకోకుండా వారిని అడ్డుకోవడమే అని ఆయన స్పష్టంగా చెప్పారు.

### హిందుత్వ, ప్రజాస్వామ్యం

ఈ పరిస్థితిని అడ్డుకునేందుకే ఆయన హిందూ కోడ్ బిల్లును ప్రవేశపెట్టారు. హిందూ రాజ్యాన్ని ఆయన పెను ప్రమాదంగా భావించడం వెనుక కుల వ్యవస్థ నుంచి తలెత్తిన అసమానత్వం ఒక పెద్ద కారణం. అది స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం, ప్రజాస్వామ్యం వంటి విలువకు గొడ్డలిపెట్టు అని ఆయన అభిప్రాయపడ్డారు.

☞ మిగతా 22వ పేజీలో

అంబేద్కర్
63వ వర్ధంతి
ప్రత్యేక వ్యాసాలు

# అధోజగత్ సహోదరుడు - అంబేద్కర్



- నేతల ప్రతాప్‌కుమార్

అది 1916లో అమెరికాలోని కొలంబియా యూనివర్శిటీలో జరిగిన సంఘటన. ఆ యూనివర్శిటీలోని విద్యార్థులు, ప్రొఫెసర్లు కలిసి ఒక విద్యార్థికి అభినందన సభ ఏర్పాటు చేశారు. ఆ విద్యార్థి వయస్సు 24 సం॥లు మాత్రమే. యూనివర్శిటీలో జరిగిన ఆంత్రపాలజీ సెమినార్‌కు ఆ విద్యార్థి "Castes in India their mecharnism, genesis and development" అనే పరిశోధక వ్యాసాన్ని సమర్పించి, ఆంగ్లంలో ఉపన్యసించాడు. ఆ విద్యార్థి విషయ పరిజ్ఞానానికి, పరిశోధనాసక్తికి, భాషా పటిమకు లభించిన అపూర్వ గౌరవం అది. ఆ విద్యార్థి తన స్వంతదేశంలో చదువు నిరాకరించబడ్డ కులంలో పుట్టాడంటే నమ్మబుద్ధి కాదు. ఆ విద్యార్థి చదువుకోవడమే ఒక ధిక్కారం. ఇలాంటి ధిక్కారాలు ఆ విద్యార్థి ఎన్నో చేసి, చరిత్ర సృష్టించాడు. ఆ విద్యార్థి బాబాసాహెబ్ అంబేద్కర్. ఆ దేశం పేరు ఈ మాత్రం కథ విన్నాక ఎవరైనా చెప్పగలరు.

అమెరికాలోని కొలంబియా యూనివర్శిటీ ఒక్కటే కాదు, బ్రిటన్‌లోని లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్, గ్రేస్-ఇన్‌లా, జర్మనీలోని బాన్ విశ్వవిద్యాలయం లాంటి ప్రపంచ ప్రసిద్ధ విద్యాలయాల్లో పదేళ్ళ పాటు జ్ఞానయజ్ఞం చేశాడు అంబేద్కర్. బ్రిటీష్ మ్యూజియం లైబ్రరీలో గంటల కొద్దీ గడిపేవాడు. ఇలా సంపాదించిన జ్ఞానాన్ని తన ఉపాధి కోసం కాకుండా అజ్ఞానం, మూఢనమ్మకాలు, అసమానతలతో ప్రాభవం కోల్పోయిన తన దేశానికి తిరిగి వైభవం తీసుకురావడానికి వెచ్చించాడు. జీవితంలోని ఏ క్షణమూ తన కోసం వినియోగించకుండా, సమాజ పునఃనిర్మాణం కోసం ఉపయోగించిన ధన్యజీవి బాబా సాహెబ్.

పండితుడిగా నిరూపించుకోవాలని ఏ తాపత్రయమూ లేని బాబాసాహెబ్ తన పోరాట క్షేత్రాన్ని స్పష్టంగా గుర్తించాడు. అణచివేయబడ్డ ప్రతీ పీడిత వర్గం వైపు ఆయన గళం విప్పాడు. ఏయే పీడిత వర్గాల గురించి తను పోరాడదలచుకున్నాడో ఆయా పీడిత వర్గాల చరిత్రను తవ్వి తీసాడు. ఆ పరిశోధనా నేపథ్యంతోనే ప్రత్యర్థులను నిరుత్తరులను చేసాడు.

దళితుల పక్షాన నిలబడి పోరాడాలనుకున్నప్పుడు ఆయన 'who are untouchbles', శూద్రుల కోసం 'Who were shudras', మహిళల కోసం 'Raise and fall of Hindu Women', బౌద్ధం కోసం 'Buddha and His Dhamma', ముస్లిం సమస్య కోసం 'Thoughts on Pakistan" లాంటి పరిశోధనాస్త్రాలతో యుద్ధంలోకి దిగేవాడు. సాహితీ, చారిత్రక ఆధారాలు లేకుండా ఆయన ఒక్క మాట కూడా మాట్లాడలేదు. లక్ష పేజీల సాహిత్యాన్ని ఆయన సృష్టించినట్లు పరిశోధకులు చెబుతారు. అందులోని ప్రతీ అక్షరం పీడితుల కోసం తప్ప కాల్పనిక సాహిత్యం ఒక్కటీ లేదు.

దళితులను మాత్రమే ఆయన పీడిత వర్గంగా గుర్తించలేదు. అయితే 'నా దేశమా, నేనా' అనే ప్రశ్న వచ్చినప్పుడు నా దేశానికి, 'నా దేశమా నా జాతా' అనే ప్రశ్న వచ్చినపుడు నా జాతికి ప్రాధాన్యం ఇస్తాననేంత స్పష్టంగా దళితుల వైపు నిలబడ్డాడనేది నిజం. అలా చేయకపోతే ఆయన నేరస్తుడిగా మిగిలిపోయేవాడు. ఎందుకంటే ఈ దేశం యొక్క ప్రథమ సమస్యే దళిత సమస్య. అలా అని దోపిడీ కాబడుతున్న ఏ వర్గాన్ని నిర్లక్ష్యం చేయలేదు సరికదా, వారి కోసం పోరాడిన ఇతర సంస్కర్తల కంటే ఎక్కువే చేశాడు.

అస్వతంత్ర భారతంలోనే ఆయన స్త్రీల కోసం ఎవరూ చేయనన్ని చట్టాలు చేశాడు. ఎనభై సంవత్సరాల క్రితమే (1938) బొంబాయి శాసనసభలో కుటుంబనియంత్రణ బిల్లు ప్రవేశ పెట్టినప్పుడు దేశంలో ఎవరికీ ఈ విషయం పట్ల ఊహ కూడా లేదు. జనాభా వల్ల దేశానికి వచ్చే నష్టం కంటే, అధిక సంతానం వలన స్త్రీ పడే ఇబ్బందులనే దృష్టిలో ఉంచుకునే అంబేద్కర్ ఈ బిల్లును ప్రవేశపెట్టించాడు. 1942లోనే మహిళల కోసం ప్రసూతి సెలవుల చట్టం (Meternity Benefits Bill) చేయించాడు. రాజ్యాంగంలో ఆర్టికల్ 15 ద్వారా లింగ వివక్షను నిషేధించి మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలకు కారకుడయ్యాడు. స్వతంత్ర భారత తొలి న్యాయశాఖా మంత్రిగా ఆయన రూపొందించిన హిందూ కోడ్‌బిల్ స్త్రీ జీవితంలో విప్లవాత్మక మార్పులకు ఉద్దేశించింది కాబట్టి ఆ బిల్లు ఆమోదించబడలేదని జగమెరిగిన సత్యం. ఆ కారణంతో తన పదవికి రాజీనామా చేసి తను ఎంత స్త్రీ పక్షపాతో నిరూపించుకున్నాడు.

కార్మికుల సంక్షేమం కోసం కూడా బొంబాయి శాసనసభలో కార్మికమంత్రిగా చేసినపుడు అనేక చట్టాలు చేయించాడు. దేన్నీ ప్రతిపాదించి, ప్రస్తావించి వదిలేయకుండా చట్టం చేసే వరకు

☞ మిగతా 17వ పేజీలో



# డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ దృక్పథంలో 'స్త్రీ'

అంబేద్కర్ 63వ వర్ధంతి ప్రత్యేక వ్యాసాలు

- ప్రొ॥ జి. హరగోపాల్
పూర్వ ఆచార్యులు, రాజనీతిశాస్త్ర విభాగం, హైదరాబాద్ విశ్వవిద్యాలయం

నన్ను ఈ ఉపన్యాసం కోసం సంప్రదించినందుకు ముందుగా డాక్టర్ అంబేద్కర్ మెమోరియల్ ట్రస్ట్ వారికి నా కృతజ్ఞతలు. నిజానికి నేను అంబేద్కర్ జీవిత విషయాల మీద కానీ ఆయన ఆలోచనల గురించి కానీ ఎటువంటి పరిశోధనలు చెయ్యలేదు. ఆయన అభిప్రాయాల గురించి మాట్లాడడానికి నాకు ప్రత్యేక అర్హతలేవీ లేవు. అయినప్పటికీ నేను ఇంత ధైర్యం చెయ్యడానికి డాక్టర్ అంబేద్కర్ మహోన్నత వ్యక్తిత్వమే కారణం. ఆయన జీవన పయనం రాజకీయంగా, సామాజికంగా భారతదేశ చరిత్రలో వైలురాయిగా మిగిలిపోయింది. ఆయనపట్ల నాకున్న ఈ ఆరాధనా భావమే నన్ను ఈ సాహసానికి పురిగొల్పింది. ఈ విధి నిర్వహణలో నేను విజయం సాధించలేకపోయినట్లయితే అది నా అవగాహనా రాహిత్యమే అవుతుంది. ఒకవేళ నేను విజయం సాధిస్తే అది కచ్చితంగా అంబేద్కర్ ఆలోచనలలోని గొప్పతనం వల్ల మాత్రమే.

డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ భారతదేశం గర్వించదగ్గ, ప్రఖ్యాతి గాంచిన సామాజికవేత్త. ఆయన తన ఆలోచనల ద్వారా ప్రపంచాన్ని ఒక విభిన్న కోణంలో చూశారు. ఆయన అప్పుడు వెలిబుచ్చిన అభిప్రాయాలు, సమస్యలు అర్థం చేసుకోవడం వల్ల ఏర్పడినవి కాదు. జీవితానుభవాల నుంచి ఏర్పరచుకున్నది. ఆయన స్వయంగా అణగారిన వర్గానికి చెందినవారు కావటం వల్ల ఆయన ప్రతి అభిప్రాయం వెనుక ఆయన స్వీయానుభవం ఉంది. సమాజంలోని అసమానతలకు, అన్యాయాలకు ఆయన ప్రత్యక్ష సాక్షి. ఆయన తన ప్రతి చేదు అనుభవం నుంచి ఎంతో కొంత నేర్చుకున్నారు. అణచివేయబడిన ప్రతిసారి ఆయనలోని మానవత్వం సమాజాన్ని పునర్నిర్మించాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తూ వచ్చింది. ఆయనలోని ఈ లక్షణాలే ఆయనను సమాజ సంస్కరణ కోసం ఉద్యమించడంలో స్థిర చిత్తంతో ఉండేలా చేశాయి. ఆ లక్షణాలే ఆయనను ఆధునిక భారతదేశ అత్యంత ప్రముఖుల్లో ఒకరిగా నిలబెట్టాయి.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సత్యశోధనలో ఏ కోణాన్ని కూడా నిర్లక్ష్యం చెయ్యలేదు. ఆయన రచనలు, ఉపన్యాసాలు ఇప్పటికే 10 సంపుటాలను మించి ముద్రితమయ్యాయి సమాజానికి ఇవి ఆయన అందించిన ఆణిముత్యాలు, ముఖ్యంగా కుల వ్యవస్థ మన దేశంలో ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ఎంత ప్రభావాన్ని చూపుతుందో ఆయన వివరించిన తీరు మరువలేనిది. సమాజం కుల వ్యవస్థను కొనసాగించడం కాదు, కుల వ్యవస్థ సమాజాన్ని ఏ విధంగా నడిపిస్తుందో ఆయన చాలా చక్కగా వివరించారు. ఆయన ఈ ఆలోచనా ధోరణి ఆయనను స్త్రీ సమస్యల గురించి కూడా ఆలోచించేలా చేసింది. మన సమాజంలో స్త్రీ సమస్యలు కూడా కుల సమస్యలో అంతర్భాగమే అనేది ఆయన అభిప్రాయం. డా.అంబేద్కర్ అభిప్రాయాలు, ఆలోచనలను చాలా లోతుగా తెలుసుకుని ఆచరించాల్సిన అవసరం మన సమాజ శ్రేయస్సుకు ఎంతో అవసరం.

భారతీయ మహిళా సమస్యల గురించి అధ్యయనం కేవలం అంబేద్కర్ దృక్కోణంలో మాత్రమే కాదు, లింగ వివక్ష రోజురోజుకు పెరుగుతున్న ఈ రోజుల్లో అనేక కోణాల్లో ఈ సమస్యను అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. నలభై సంవత్సరాల స్వతంత్ర్య భారతదేశంలో మహిళాభివృద్ధి నామమాత్రంగానే జరిగిందని చెప్పాలి. తొంభైయ్యో దశకంలో మహిళల పరిస్థితి చాలా దారుణంగా దిగజారుతోంది. స్థూలంగా – పెరుగుతున్న వరకట్న మరణాలు, అత్యాచారాలు, సామూహిక అత్యాచారాలు ఈ విషయాన్ని ధృవపరుస్తున్నాయి. చీఫ్ జస్టిస్ ఆఫ్ హైకోర్ట్స్ ఆఫ్ ఇండియా మహిళలు కేవలం ఇంటి పనులకే పరిమితమవుతున్నట్లు అభిప్రాయపడ్డారు. రాజస్థాన్ వంటి రాష్ట్రాలలో సతి వంటి దురాచారాలు తిరిగి ఆచరణలోకి రావడం చాలా ఆందోళనకరమైన విషయం. మధ్యతరగతి కుటుంబం చాలా సంక్షోభాన్నే ఎదుర్కొంటోంది. ఇప్పుడిప్పుడే మహిళల ఆలోచనా విధానంలో మార్పులు వస్తున్న ఈ పరిస్థితుల్లో పురుషుల కంటే స్త్రీలే ఎక్కువగా ఇబ్బంది పడాల్సి ఉంటుంది. నరనరాలలో జీర్ణించుకుపోయిన పితృస్వామ్య వ్యవస్థను ప్రశ్నించడం అంత సులభమైన విషయమేమీ కాదు. ఈ క్రమంలో కొంతమంది గృహిణులు హింసను ఎదుర్కోవాల్సి వస్తే, మరికొంతమంది తమ ప్రాణాలనే పోగొట్టుకున్నారు. వసంత కన్నాభిరన్ మహిళల సమకాలీన సమస్యల గురించి తీసిన 'కఠోర షడ్జమాలు' ఎన్నో విషయాలను వివరించింది. – జమీందారులు, పట్టణాల్లో చదువుకున్న వారి కొడుకులు, వారి బంధువర్గం, హరిత విప్లవ ఫలాలను అత్యధిక స్థాయిలో అనుభవిస్తున్న కుటుంబాలు, సమాజంలోని దాదాపు అన్ని ఉన్నత వర్గాల వారు స్త్రీని కేవలం విలాస వస్తువుగా మాత్రమే భావిస్తున్నారు. ఉన్నత వర్గాల వారు మాత్రమే కాదు, చదువుకున్న మధ్యతరగతి యువత కూడా

అంబేద్కర్
63వ వర్ధంతి
ప్రత్యేక వ్యాసాలు

ఇందుకు మినహాయింపేమీ కాదు. ఇది దిగజారుతున్న మానవతా విలువలకు పరాకాష్ట. ఈ పరిస్థితి పేద మహిళల్లో చాలా అభద్రతను పెంచుతోంది. ఆర్థిక విషయాల పరంగా చూసినప్పుడు రాజ్యాంగం లింగ వివక్షకు తావులేదని చెప్పినప్పటికీ వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్న స్త్రీలకు ఇచ్చే వేతనం పురుషుల కంటే తక్కువగా ఉంటుంది.

ఉన్నత తరగతులకు చెందిన వారైనా, నిమ్న వర్గాలకు చెందిన వారైనా మహిళలను వివక్షను ఎదుర్కొంటున్న కోణంలో చూసినప్పుడు దళితులతో పోల్చవచ్చు. దళితుల మీద జరుగుతున్న అత్యాచారాలు పెరిగాయనడం కంటే రెట్టింపయ్యాయని అనడమే సబబేమో, ఈ మధ్య కాలంలో ఆంధ్రప్రదేశ్ లో జరిగిన కారంచేడు, చుండూరు ఘటనలు ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. ఇటువంటి సంఘటనలు దేశం నలుమూలలా జరుగుతూనే ఉన్నాయి. దేశంలోని చాలా చోట్ల దళితులు భూమి, భుక్తి వంటి ఆర్థిక విషయాల కంటే కూడా తమని కూడా మనుష్యులుగా గుర్తించాలని కోరుతున్నారు. సమానత్వం కావాలన్నదే ప్రధాన డిమాండ్, అగ్రవర్ణాల వారు పెంచుకున్న తమ సంపదను, తద్వారా లభించే టెక్నాలజీని, అధికారాన్ని ఉపయోగించి దళితుల మీద వారి ఆధిపత్యాన్ని మరింత పెంచుతున్నారు. ఈ పరిస్థితులకు మహిళలు మినహాయింపు కాదు. దళితులు, మహిళల్లో మూడు సారూప్యాలు మనం గమనించవచ్చు. ఒకటి శ్రమదోపిడీ, రెండు పేదరికం, మూడు అంటరానితనం. శ్రమ దోపిడీ విషయంలో అగ్రవర్ణాల మహిళలు కూడా మినహాయింపు కాదు, ఉత్పత్తి జరిగే చోట అయినా, ఇంటి పని విషయంలోనైనా సరే వారు చేసే పనికి గుర్తింపు కానీ, గౌరవం కానీ ఉండదు. ఈ విషయంలో దళితులు, మహిళలు ఒకే విధంగా వివక్షకు గురవుతున్నారు. ఆస్తి సంక్రమణ, విద్య నేర్పే తీరులో కూడా దళితులకు, మహిళలకు ఒకే విధంగా ఉంటుంది. ఇక అంటరానితనం విషయానికి వస్తే చాలా అగ్ర వర్ణాల కుటుంబాల్లో స్త్రీలకు అంటరానితనాన్ని నెలలో మూడు నాలుగు రోజుల వారి నెలసరి సమయంలో చాలా కఠినంగా పాటిస్తారు.

దళితులు, స్త్రీలపై వివక్ష రోజురోజుకు పెరుగుతోంది. రాజ్యం మరియు రక్షణ వ్యవస్థ పీడితుల పక్షాన నిలబడి వారికి న్యాయం జరిగేలా చూడాల్సి ఉంది. కానీ నిజానికి దీనికి వ్యతిరేకంగా జరుగుతోంది. పోనుపోను దేశం వివక్షకు నిలయంగా మారుతోంది. ఎన్నో లాకప్ మరణాలు జరుగుతున్నాయి. ఎన్నో అత్యాచారాలు జరుగుతున్నాయి. ఈ నేరాలు నిరూపించబడి శిక్షలు పడుతున్నవి నామమాత్రమే. దీన్ని బట్టి దళితులు, స్త్రీలకు రాజ్యాంగం కల్పించిన ఏ హక్కులు, భద్రతలు చేరడం లేదని నిరూపితమవుతోంది. పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేర్పులు చేస్తూ వస్తున్న రక్షణ చట్టాల ఫలితం అటు దళితులకు కానీ ఇటు మహిళలకు కానీ అందటం లేదనేది ఎవరూ కాదనలేని సత్యం. ఈ పరిస్థితి దాపురించడానికి ఒక రకంగా రాజకీయ వ్యవస్థ కారణం. అందుకే డాక్టర్ అంబేద్కర్ ప్రతిపాదించిన మానవతా విలువల గురించిన చర్చ జరగాల్సిన ఆవశ్యకత ఎంతో ఉంది.

డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ మన దేశ సంఘ సంస్కర్తల్లో మొదటి వరుసలో నిలుస్తారు. ఆయన స్త్రీ సమస్యలను తన ఉద్యమంలో ప్రధానాంశంగా తీసుకున్నారు. అంతే కాదు దళితులు, మహిళల సమస్యలలోని సారూప్యతను గుర్తించిన రాజకీయ నాయకులలో ఆద్యులు. ఆయన దళిత సమస్యలతో పాటు మహిళా సమస్యలను గురించి ఎక్కువగా ఆలోచించారు. ఆయన సమస్య మూలాలను అన్వేషించారు. లింగ వివక్షలోని ఎన్నో చీకటి కోణాలను ఆయన ఆవిష్కరించారు.

అగ్రవర్ణాల మహిళల సమస్యలను, కుల వ్యవస్థకు విడదీయరాని సంబంధాన్ని డాక్టర్ అంబేద్కర్ గుర్తించారు. అసలు ఈ కుల వ్యవస్థ ఇన్ని శతాబ్దాలుగా కొనసాగింపబడడానికి కారణం వివాహ వ్యవస్థ. మన భారతీయ వివాహాలు చాలా వరకు ఒకే కులంలో జరుగుతాయి. ఇలా ఒకే కులంలో వివాహాలు చేసుకోవడం వల్ల వారికి సామాజిక భద్రత దొరుకుతుంది. ఇలా ఒకే సమూహంలోని వ్యక్తుల మధ్య వివాహాలు జరగాలంటే ఆ సమూహాల్లో స్త్రీ పురుషుల నిష్పత్తి సమానంగా ఉండాలి. అలా జరగడం దాదాపు అసాధ్యం. స్త్రీల సంఖ్య పెరిగినా, తగ్గినా సమస్యలు అధికమవుతాయి. దంపతుల్లో ఒకరు మరణించినప్పుడు కూడా మళ్ళీ సమస్య ఏర్పడుతుంది. ఇలా స్త్రీ పురుష నిష్పత్తిని సమం చేయడానికి సమాజం అనుసరిస్తున్న దారులను అంబేద్కర్ ప్రస్తావించారు. అందులో ముఖ్యంగా 'సతీసహగమనం' అంటే మరణించిన భర్త చితి మీదే భార్యను కూడా కాల్చేయటం. దీని వల్ల సమస్య ఏముంటుంది. భర్త చనిపోయినప్పుడు ఇక భార్య బతికే అవకాశమే లేదు. ఇక లెక్క తప్పే సమస్య ఉండనే ఉండదు. లేదంటే భర్త చనిపోయిన స్త్రీకి తప్పనిసరి వైధవ్యాన్ని పాటించాల్సి ఉంటుంది. ఇది మరింత దారుణంగా ఉంటుంది. లేదంటే ఆమె మరో కులంలోని వ్యక్తిని పెళ్ళి చేసుకోవడం వంటివి జరిగితే కుల వ్యవస్థ భ్రష్టు పడుతుందన్న భయం వారికి. ఒకవేళ వారి కులం వారిలోని మరో వ్యక్తిని పెళ్ళి చేసుకుంటే ఇతర పెళ్ళీడు అమ్మాయిలకు ఇబ్బంది ఏర్పడవచ్చు. అందుకని విధవా వివాహాన్ని పాపంగా అభివర్ణించారు. అందుకే ఒక పెళ్ళయిన అమ్మాయి

భర్త ఎంత చిన్న వయసులో చనిపోయినప్పటికీ ఆమె ఇక జీవితాంతం విధవగా బ్రతకవల్సిందే. ఇలా విధవగా బ్రతికే వారికి జీవితంలో ఎటువంటి మాధుర్యమూ మిగలదు. ప్రతి వారు ఒక అనుమానపు చూపుతో చూస్తుంటారు. వైధవ్యంలో ఉన్న మహిళలకు అందంగా కనిపించే అర్హత లేదు. వారు తప్పనిసరిగా అందవిహీనం చేసుకొని ఉండాల్సిందే.

ఇటువంటి పరిస్థితి పురుషులకు ఎదురైనప్పుడు మాత్రం ఇందుకు విరుద్ధంగా జరుగుతుంది. పితృస్వామ్య వ్యవస్థ పురుషుడికి ఇచ్చిన సౌకర్యాలు అన్నీ ఇన్నీ కాదు. మతంలోని ప్రతి నిషేధాజ్ఞ మహిళల కోసం ఏర్పాటు చేసిందే. అది మతపరమైనదైనా, సామాజికమైనదైనా, ఆర్థికపరమైనదైనా, వైధవ్యం ప్రాప్తించిన మహిళల కోసం నియమాలు, నిబంధనలు ఏర్పాటు చేసిన పురుషుడు, భార్య మరణించిన పురుషుడి కోసం మాత్రం కనీసం ఒక్కటంటే ఒక్క నిబంధన కానీ నిషేధం కానీ చేయలేదు. ఏ ధర్మశాస్త్రాలు కూడా చెప్పలేదు. అందుకు అంబేద్కర్ ఏమంటారంటే ఒక వేళ స్త్రీ పురుష సంఖ్యను సమం చెయ్యడం కోసమే ఈ ఏర్పాటు కనుక చేసి ఉంటే భార్య మరణించిన పురుషుడికి కూడా తప్పనిసరి బ్రహ్మచర్యాన్ని ఆపాదించి ఉంటే సమాజం అనుకున్న ఫలితాన్ని రాబట్టి ఉండేదేమో అని, కనీసం భార్య మరణించిన పురుషుడు పెళ్ళి కావాల్సిన అమ్మాయికి బదులుగా భర్త మరణించిన స్త్రీని మాత్రమే పెళ్ళి చేసుకోవాలన్న నియమాన్నైనా పెట్టి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. ఈ అభిప్రాయాలతో ఆయన స్త్రీల పట్ల జరుగుతున్న అన్యాయాలకు పితృస్వామ్య వ్యవస్థకు ఎంత వ్యతిరేకంగా ఉన్నారన్న విషయం తేటతెల్లం అవుతోంది.

అంబేద్కర్ ఈ సమాజంలో గమనించినదేమిటంటే కుల వ్యవస్థ సమాజంలో స్త్రీ పురుష నిష్పత్తిని క్రమం చేయడానికి చాలా జాగ్రత్తగా అనుసరించిన విధానం నాలుగు మార్గాలు 1. సతీసహగమనం – మరణించిన భర్తతో పాటు భార్యను కూడా చితిలో తగలబెట్టడం, 2. తప్పనిసరి వైధవ్యం – ఇది కొద్ది కొద్దిగా ఆ స్త్రీని చంపేయటం, 3. వైధవ్యం ప్రాప్తించిన స్త్రీ తప్పనిసరిగా బ్రహ్మచర్యం పాటించడం, 4. పెళ్ళీడులో ఉన్నప్పటికీ భర్త చనిపోయిన స్త్రీ వివాహం చేసుకోకూడదు. ఈ నాలుగు దురాచారాలు భారతీయ సమాజంలో భాగంగా మారిపోయాయి. ఇప్పటికీ అలా కొనసాగుతూనే ఉన్నాయి. ఈ సంప్రదాయాలన్ని ఎలా పాటించాలో తెలపడానికి మనకు చాలా ధర్మశాస్త్రాలు ఉన్నాయి. కానీ వాటి ఉనికి ఏమిటి? అవి ఎందుకు పాటించాలో మాత్రం ఎవరూ చెప్పరు. వీటిని గౌరవించమన్నారు. కానీ ఎందుకు గౌరవించాలో మాత్రం చెప్పలేదు. నేను గమనించినంత వరకు మనం పాటిస్తూ వస్తున్నాం కాబట్టి అవి గౌరవించబడుతున్నాయి తప్ప మరే కారణం లేదు' అని డాక్టర్ అంబేద్కర్ తన అభిప్రాయాన్ని నిక్కచ్చిగా తెలిపారు.

అంబేద్కర్
63వ వర్ధంతి
ప్రత్యేక వ్యాసాలు

మహిళా సమస్యలను ఆయన సహానుభూతించారు. సతీ సహగమనం, బలవంతపు వైధవ్యం, బాల్య వివాహాలు వంటి ఆధారాలన్నీ కేవలం ఒంటరి స్త్రీ పురుషుల సంఖ్యను సమం చేయడం కోసం, కులవ్యవస్థను కాపాడడం కోసమే. వివాహాల విషయంలో కుల ప్రసక్తి లేకపోతే కుల వ్యవస్థ కొనసాగదు అని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈ విధంగా ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలలో మనం మూడు విషయాలను ప్రస్ఫుటంగా అర్థం చేసుకోవచ్చు. కులానికి వివాహ వ్యవస్థకు స్త్రీ పురుషుల మధ్య ఉన్న నియమాలు, సంబంధాలను పునర్నిర్మించడానికి కావాల్సిన అర్హతలు ఆయనకు ఉన్నాయి. రెండోది ఇలాంటి దురాచారాలను నమ్మడం, సమర్థించడం, పాటించడం అనేది కేవలం కుల వ్యవస్థను సంరక్షించేందుకు మాత్రమే పనికి వస్తాయి. మూడోది అత్యంత ముఖ్యమైనది ఏమిటంటే ఈ పితృస్వామ్య వ్యవస్థ, నియమాలన్నీ కూడా పురుషులు ఏర్పాటు చేసినవి, పూర్తిగా పక్షపాతపూరితమైనవి.

భారత స్త్రీ చరిత్రను డాక్టర్ అంబేద్కర్ మౌర్యులకు ముందు, మౌర్యుల కాలంలో, మౌర్యుల తర్వాత అని విభజించారు. ఇలా చరిత్రను అధ్యయనం చేసి చూసినప్పుడు భారత సమాజంలో స్త్రీ జీవితం ఎలా దిగజారుతూ వచ్చిందో తెలుసుకోవచ్చు. మౌర్యులకు పూర్వం, మౌర్యుల కాలంలో కూడా మహిళలు సమాజంలో పురుషులతో సమాన స్థాయిలో ఉన్నారు. ఆ కాలంలో స్త్రీలకు కూడా ఉపనయనానికి, మంత్రం చెప్పడానికి, వేదం చదువు కోవడానికి అర్హత ఉండేది. ఆ కాలంలో స్త్రీలు ఇప్పటి కంటే మంచి స్థాయిలో ఉన్నారనడానికి ఈ ఒక్క రుజువు చాలంటారు. ఆయన కేవలం వేదం నేర్చుకోవడమే కాదు, గురుకులంలోకి వారికి అనుమతి ఉండేది. బాలికలకు వేదం నేర్పేందుకు కూడా వారికి అనుమతి ఉండేది. మతం, వేదాంతం, అధిభౌతిక శాస్త్రం వంటి అనేక విషయ చర్చలలో పాల్గొనే అవకాశం కూడా ఉండేది. జనకుడు, సులభల మధ్య, యజ్ఞవల్క్యుడు గార్గిల మధ్య, యాజ్ఞవల్కుడు మైత్రిల మధ్య, శంకరాచార్య విద్యాధరి మధ్య జరిగిన వాదోపవాదాలను అంబేద్కర్ ఉదహరిస్తారు. ఈ సందర్భాలను ఆయన అధర్వణ వేదం, అష్టాధ్యాయి మొదలైన నాటి నుంచి గ్రహించారు. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని ఆ రోజుల్లో స్త్రీలు శిఖరాలను అధిరోహించారని అంబేద్కర్ అభివర్ణించారు. పట్టాభిషేక

**అంబేద్కర్ 63వ వర్ధంతి ప్రత్యేక వ్యాసాలు**

సమయంలో యువరాజుతో పాటు అతని భార్యకు కూడా సమాన స్థాయి దక్కేది. రాజు సైతం రాణికి గౌరవాన్నిచ్చే వారు. ఆ రోజుల్లో మహిళలు చదువు సంధ్యల విషయంలో కానీ, పాలనపరమైన విషయంలో కానీ, సామాజిక అంశాల్లో కానీ ఎటువంటి వివక్షను ఎదుర్కోలేదు.

"రామ గోవిందా" 1950లో గౌతమ బుద్ధుడి మీద జరిపిన పరిశోధనల తర్వాత బుద్ధుడు స్త్రీలను గురించి ఉన్నతమైన భావనలు చేయలేదని, 'మహాపరిణిబాణసుత'లో బుద్ధుడు, ఆనందంగా ఉండాలంటే స్త్రీ విషయంలో జాగ్రత్తగా ఉండాలని సలహా ఇచ్చారని వ్యాఖ్యానించారు. అంబేద్కర్ ఆయన వాదనను నిర్ద్వంద్వంగా అందించారు. ఆయన బ్రహ్మచర్యం గురించి మాత్రమే మాట్లాడారు. లైంగిక సంబంధాలు పురుషుడిని స్త్రీ బంధనంలో, స్త్రీని పురుషుడి బంధనంలో ఇరుక్కునేలా చేస్తాయని మాత్రమే గౌతమ బుద్ధుడు భావించాడని అంబేద్కర్ వివరించారు. గౌతమబుద్ధుడికి స్త్రీ పట్ల అచంచలమైన విశ్వాసం ఉండేది. కేవలం స్త్రీలకు మాత్రమే ఆయన బోధలను పూర్తిగా పాటించగలిగే నిబద్ధత, క్రమశిక్షణ ఉన్నాయని నమ్ముతారని డాక్టర్ అంబేద్కర్ అన్నారు. అమ్మాయి పుట్టిందని తన శిష్యులలో ఒకరు బాధ పడుతున్నప్పుడు గౌతమ బుద్ధుడు, బాధ దేనికి? ఆమె చాలా తెలివైనది, ధైర్యవంతురాలు అవుతుందేమో భవిష్యత్తులో, కేవలం ఆడపిల్ల అని బాధ పడొద్దు" అని చెప్పిన సందర్భాన్ని ఆయన గుర్తుచేశారు. ఆయనకు స్త్రీలపట్ల గౌరవమే కనుక లేకపోయి ఉంటే ఆ రోజుల్లో అత్యంత సౌందర్యవతైన ఆమ్రపాలి సేవలను ఆయన స్వీకరించేవారు కాదు కదా అని అంబేద్కర్ గుర్తు చేస్తారు. ఆయన శిష్యులలో స్త్రీలు కూడా ఉన్నారు. బౌద్ధ ధర్మాన్ని సరిగ్గా అర్థం చేసుకోని కొంతమంది భిక్షువులు స్త్రీ వ్యతిరేకులుగా మారారు. ఇటువంటి కొంతమంది ఆలోచనలను వారి అపరిపక్వతను బుద్ధుడికి ఆపాదించి – ప్రచారం చేశారనేది డాక్టర్ అంబేద్కర్ అభిప్రాయం. ఆయన ఈ అభిప్రాయం ఆయనకు బుద్ధుడి పట్ల, మహిళల పట్ల ఉన్న గౌరవాన్ని తెలుపుతోంది. బుద్ధుని కాలంలో మహిళలు అనుభవిస్తున్న సమానత్వాన్ని 'మను' ఏర్పరచిన ధర్మశాస్త్రాలు పాడు చేశాయి. ఆయన కౌటిల్యుడు, మనువుల ఉద్దేశ్యాలలోని తేడాలను చాలా దగ్గరగా అధ్యయనం చేశారు. మనువు అభిప్రాయాలు, నియమాలు సమాజంలో స్త్రీలను ఎంత క్రూరంగా వెనక్కినెట్టాయో తెలుసుకోవడానికి ఇది ఆయనకు ఎంతో ఉపయోగపడింది. కౌటిల్యుడి కాలంలో 12 సంవత్సరాల వయసు అమ్మాయిలు, 16 సంవత్సరాలు అబ్బాయిలకు పెళ్ళి వయసుగా నిర్ణయించారు. ఇవన్నీ కచ్చితంగా బాల్య వివాహాలేననేది బౌద్ధయానుల గృహ్య సూత్రాల ద్వారా తేటతెల్లమైంది.

పెళ్ళికి సంబంధించిన చాలా నియమాలను కౌటిల్యుడు ప్రతిపాదించాడు. పురుషుడు ఒకరి కంటే ఎక్కువ మహిళలను పెళ్ళి చేసుకునే అవకాశం ఉంటుంది. కానీ దానికి కొన్ని నిబంధనలు ఉన్నాయి. పెళ్ళి చేసుకున్న స్త్రీల వల్ల అతనికి సంతానం కలుగకపోయినట్టయితే అతడు ఏడు సంవత్సరాల వరకు వేచి చూసి మరో వివాహం చేసుకోవచ్చు. ప్రతిసారీ మృతశిశువుకు జన్మనిస్తున్నట్టయితే 12 సంవత్సరాల వరకు వేచి చూడాలి. అతడికి సంతాన సౌఖ్యం కావాలన్న కోరిక ఉన్నట్లయితే అతడు మరో వివాహం చేసుకోవచ్చు. ఇష్టం లేనప్పుడు, శతృత్వం ఉన్నప్పుడు, విడాకులు కూడా తీసుకోవచ్చని కౌటిల్యుడు – చెప్పారు. భార్యభర్తలిద్దరు ఏ ఒక్కరి ఇష్టానికి వ్యతిరేకంగా విడాకులు తీసుకునే అవకాశం కల్పించలేదు. కానీ ఇద్దరికి ఇష్టం లేదని అనుకున్నప్పుడు వారు చట్టబద్ధంగా విడిపోవచ్చునని చెప్పారు. పురుషుడు కానీ, స్త్రీ కానీ తన భాగస్వామి నుంచి ప్రాణ హాని ఉందన్న కారణంతో విడాకులు అడిగే అవకాశం ఉంటుంది. అటువంటి సందర్భాల్లో స్త్రీకి తన స్త్రీ ధనం, శుల్కం తిరిగి అడిగే హక్కు ఉంటుంది. భర్త మంచివాడు కాని పక్షంలో విడాకులు కావాలని అడిగే హక్కు స్త్రీకి కౌటిల్యుడి అర్థశాస్త్రం కలిగించింది. అంతే కాదు విడాకుల సమయంలో తన జీవితకాలం మొత్తం తిండి, గుడ్డకు లోటు లేకుండా భరణం ఆశించే హక్కు కూడా ఆమెకు ఉంటుంది. ఈ నియమాలన్నీ ఉల్లంఘించిన వారు శిక్షార్హులు మాత్రమే కాదు, ప్రభుత్వానికి కూడా వారు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.

మౌర్యుల కాలంలో అమలులో ఉన్న కౌటిల్యుడి అర్థశాస్త్రంలో అంబేద్కర్‌కు మరింత నచ్చిన విషయం విధవా పునర్వివాహాన్ని సమర్థించడం. భర్త మరణానంతరం కూడా స్త్రీ గౌరవప్రదమైన జీవితాన్ని గడిపే అవకాశం ఉంది. ఇందుకు గాను ఆమె తన అత్తవారింటి నుంచి స్త్రీ ధనం, శుల్కాన్ని తిరిగి తీసుకోవచ్చు. ఆమె పునర్వివాహం కూడా చేసుకోవచ్చు. పునర్వివాహం చేసుకున్నప్పటికీ మొదటి భర్త ద్వారా కలిగిన సంతానాన్ని పోషించుకోవడానికి దానిని వాడుకునే అధికారం ఆమెకు ఉంటుంది. ఆ ఆస్తిని ఆమె వారికి రాసిచ్చే అధికారం కూడా ఉంటుంది. డాక్టర్ అంబేద్కర్ స్త్రీల సామాజిక, ఆర్థిక స్థితిగతులను మౌర్యులకు ముందు, మౌర్యుల తర్వాత అని చాలా కచ్చితంగా విభజించారు. మౌర్యుల కాలంలో స్త్రీలు చాలా మెరుగైన జీవితాన్ని గడిపారని చెప్పవచ్చు అని అంటారాయన. వర్తమాన కాలంలో స్త్రీల స్థితిగతులు, ఆయనను మూలాల్లోకి వెళ్ళి సమస్య పరిష్కారాన్వేషణ చేసేందుకు ప్రేరేపించాయి.

ఒకప్పుడు భారత సమాజంలో స్త్రీలు చాలా గౌరవంగా జీవించారని ఆయన అధ్యయనం చెబుతున్నది.

మనుస్మృతి మన స్త్రీలను అత్యంత దయనీయ పరిస్థితుల్లోకి తోసివదేసిందనేది అంబేద్కర్ అభిప్రాయం. స్త్రీల పట్ల లేశమాత్రమైన గౌరవం లేకుండా మనువు తన ధర్మ శాస్త్రాలను నిర్మించాడు. ఆయన ఉద్దేశ్యంలో స్త్రీలు పుట్టిందే పురుషులను మోహింపజేయ డానికి. కాబట్టి, వారు తప్పకుండా పురుషుల అధీనంలోనే ఉండాలి. వారు మూర్ఖులైన పురుషులను మాత్రమే కాదు, అత్యంత మేధావులను కూడా తప్పుదారి పట్టించగలరు. స్త్రీ ఎంత గొప్ప పురుషుడినైనా మోహానికి, కోపానికి దాసులను చెయ్యగలదు. మనుధర్మ శాస్త్రం ప్రకారం ఏ వ్యక్తి తల్లి, సోదరి, కుమార్తెతో ఒంటరిగా ఉండకూడదు. ఇంద్రియాలు ఎంతటి తెలివైన వారినైనా లోబరుచుకుంటాయనేది మనువు వాదన. పురుషుల పట్ల స్త్రీలకు కలిగే అత్యంత మోహం వల్ల, చిత్త చాంచల్యం వల్ల వారు వారి భర్తలకు ద్రోహం చేసే అవకాశం ఉంటుంది. అందువల్ల వారిని అనునిత్యం తమ పురుషుల అధీనంలో ఉంచుకోవాలి.'' అని మను ధర్మసూత్రాలు చెబుతున్నాయి. దేవుడు స్త్రీలను బలహీనులుగా సృష్టించాడు కాబట్టి వారు పురుషుల అధికారానికి లోబడి ఉండాలని కూడా నిర్ణయించాడు మనువు. మనుస్మృతిలో పైన ఉదహరించిన అంశాలను గమనిస్తే మనువుకు స్త్రీల పట్ల ఎంతటి చులకన భావం ఉందో అర్థం అవుతుందని అంబేద్కర్ అంటారు.

మనువు ఇంకా ఏమంటాడంటే స్త్రీలు తప్పనిసరిగా ఎవరో ఒక పురుషుడి అధీనంలో ఉండాలి. బాల్యంలో తండ్రి అధీనంలో, యవ్వనంలో భర్త అధీనంలో, వృద్ధాప్యంలో కుమారుని అధీనంలో ఉండాలి. 'న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి' స్త్రీలు స్వాతంత్ర్యానికి అర్హులు కాదు, తన స్వంత ఇంట్లో సైతం స్త్రీలు ఏ వయసు వారైనా సరే పురుషుల అనుమతి లేనిదే ఏ పని చెయ్యడానికి వీలులేదు. ఆమె దారి తప్పితే అనగా తండ్రిని లేదా భర్తను లేదా కుమారుడిని వదిలేసినట్టయితే అటు పుట్టింటికి, ఇటు అత్తవారింటికి రెండు కుటుంబాలకు నష్టం జరుగుతుంది. ఒకసారి పెళ్ళైందంటే ఆమె చచ్చేంత వరకు భర్తతో కలిసి ఉండాల్సిందే. ఎట్టి పరిస్థితులలోను, విడాకులకు ఆస్కారమే లేదు. దీని గురించి అంబేద్కర్ ఏమంటారంటే ఈ నియమం పురుషుడిని ఒక అనుబంధంలో కట్టేయడం కోసం కాదు, ఎంతటి దుర్మార్గుడైనా సరే ఆమెను అతనికి కట్టిపడేసి ఉంచడానికి మాత్రమే. ఎందుకంటే "మనువు" పురుషుడు భార్యను వదిలేయకుండా కట్టడి చెయ్యలేదు మరి. అంతే కాదు భార్యను వదిలేయడం మాత్రమే కాదు. ఆమెను అమ్ముకునే హక్కు కూడా మనుధర్మ శాస్త్రం ప్రకారం భర్తకు ఉంటుంది. మను నిర్మిత ధర్మశాస్త్రం మొత్తం కూడా స్త్రీని ఎన్ని రకాలుగా బానిసగా ఉంచాలో చెప్తుంది. కేవలం అమ్మకానికి వెళ్ళడం వల్లనో లేదా అతడు ఆమెను తిరస్కరించడం వల్లనో మాత్రమే స్త్రీకి భర్త నుంచి విముక్తి లభించే అవకాశం ఉంటుంది. ఒకసారి అమ్మకానికి లేదా తిరస్కారానికి గురైన స్త్రీ ఇక ఎప్పుడూ ఎవరికీ చట్టబద్ధమైన భార్యగా ఉండే అవకాశమే లేదు. మను ధర్మశాస్త్రం ప్రతిపాదించిన ఇంతటి వివక్ష గురించి డాక్టర్ అంబేద్కర్ చాలా ఆగ్రహంతో 'ఇంతకంటే వికృతమైన విషయం ప్రపంచంలో మరొకటి ఉండదు. ఇంతటి అన్యాయం కూడా మరోటి ఉండదు. ఆయన తన నియమాలతో స్త్రీలను స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలకు దూరం చేయడం మినహా ఒరిగిందేమి లేదు' అన్నారు.

ఈ మొత్తం వ్యవస్థ ఎందుకు ఏర్పాటు చేశారని అంబేద్కర్ భావిస్తారంటే తనకున్న స్వేచ్ఛతో అగ్రవర్ణ స్త్రీలు శూద్రులను వివాహం చేసుకుంటే వర్ణవ్యవస్థ కుప్పకూలుతుంది. ఇలా జరగకుండా ఆపడానికి మాత్రమే మనువు ఏర్పర్చిన నియమాలు ఉపకరిస్తాయి. మనువు నియమాలు ఇంటి ఇల్లాలిని బానిస స్థాయికి దిగజార్చాయి. ఆమె ఆస్తిని కబళించడానికి మనువు చెప్పిన మాట ఇది. భార్యా, కొడుకు, బానిసలకు ఆస్తి ఉండే అవకాశమే లేదు. వాళ్ళు సంపాదించిన డబ్బు కచ్చితంగా వారి యజమానికే చెందుతుంది. ఉమ్మడి కుటుంబంలో ఉన్నప్పుడు భర్త మరణించి నట్టయితే భార్యకు అతని వాటా అనుభవించే అధికారం ఉంటుంది. కానీ దాని మీద ఆమెకు ఎటువంటి హక్కు ఉండదు. అంబేద్కర్ దృష్టిలో మనువు చెప్పిన ప్రకారం స్త్రీల స్థాయి శూద్రులతో సమానం. ఎలాగంటే... శూద్రులకు, స్త్రీలకు వేదం నేర్చుకోవడం నిషిద్ధం, స్త్రీలకు మతానికి సంబంధించిన ఎటువంటి నియమ నిబంధనలు తెలియవు. ఎందుకంటే వారు వేదం నేర్చుకోలేదు కాబట్టి స్త్రీ వేదం వల్లె వేయడం వల్ల పాపాలు సంక్రమిస్తాయని హిందువులు నమ్ముతారు. స్త్రీలను వాటికి దూరంగా ఉంచారు. కాబట్టి వారు అపవిత్రులనేది వారి భావన. వేదాల్లో చెప్పిన కర్మలేవీ స్త్రీలు చెయ్యడానికి వీలులేదు. ఒకవేళ చేసినట్లయితే వాడు నరకానికి పోతారు. అటువంటి స్త్రీ చేతి నుంచి ఇచ్చే భిక్ష బ్రాహ్మలు స్వీకరించరాదు. ఇటువంటి నియమాల వల్ల బ్రాహ్మలెవరూ స్త్రీలకు సాయం చెయ్యకుండా మనువు అనగలిగారు. కర్మ చెయ్యడానికి స్త్రీలకు ఎటువంటి అధికారం లేదు. ఒకవేళ స్త్రీ కర్మలు ఆచరించినా అది దేవుడిని చేరవు వంటి మాటల వల్ల స్త్రీలను కర్మలకు దూరంగా ఉంచడం మినహా మనువుకు ఇంకెటువంటి లక్ష్యం లేదు. డాక్టర్ అంబేద్కర్ ఉద్దేశ్యం ప్రకారం స్త్రీలకు ఎటువంటి తెలివితేటలు ఉండడానికి కానీ, భావస్వేచ్ఛ ఉండడానికి కానీ మనువుకు ఇష్టం లేదు. చచ్చే వరకు హిందువుగా మిగిలినా స్త్రీలకు తులసి తీర్థం కూడా

**అంబేద్కర్ 63వ వర్ధంతి ప్రత్యేక వ్యాసాలు**

దక్కదు. స్త్రీలు తమ తండ్రి ఎవరికి తమను అప్పగించినా లేదా తండ్రి అనుమతితో సోదరుడు ఎవరికి అప్పగించినా వారితో జీవితాంతం ఉండాల్సిందే. అతడు మరణిస్తే అతని జ్ఞాపకాలతో బ్రతకాల్సిందే. భార్య భర్తను ఆరాధ్య దైవంగా భావించాలి. అలా భావించిన స్త్రీ తప్పకుండా స్వర్గానికి వెళుతుంది. ఇలాంటి మనువు ప్రతిపాదనలను డాక్టర్ అంబేద్కర్ ప్రశ్నించారు. వేద మంత్రాల సాక్షిగా వివాహం జరుగుతుంది. కట్టుకున్న భార్యను ప్రతిక్షణం సంతోషంగా ఉంచాలన్నదే ఆ వేద మంత్రాల అర్థం. అంతేకాదు. భార్య ఇంటికి లక్ష్మి లాంటిది. ఆమె ఎప్పుడూ చిరునవ్వుతో ఉండాలి. ఇంటి పనులను చాలా తెలివిగా, శుభ్రంగా చెయ్యాలి, ఖర్చు తగ్గించే విషయంలో చాలా చాకచక్యంగా వ్యవహరించాలి అనీ మంత్రాలు చెబుతాయి. ఇవన్నీ చాలా ఉన్నతమైన విషయాలుగా హిందువులు ఎలా భావిస్తారని అంబేద్కర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

మనువు ప్రకారం కేవలం స్త్రీ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను, ఆస్తిపాస్తులను హరించడం మాత్రమే కాదు. ఈ నియమాలను ఉల్లంఘించే స్త్రీలను దండించే హక్కు ఆమె భర్తకు ఉంటుంది. భార్య కుమారుడు, తమ్ముడు, బానిసలలో ఎవరు తప్పు చేసినా వెదురుబద్ద లేదా కొరడాతో కొట్టే హక్కు యజమానులుగా, భర్త, తండ్రి, అన్నలకు ఉంటుంది. మనుస్మృతి శూద్రులను, బానిసలను, స్త్రీలను ఒకే గాటన కట్టిందనేది అంబేద్కర్ వాదన. మనుస్మృతి స్త్రీ స్థితిగతులను గురించి చెప్పిన వాటిని అధ్యయనం చేసిన తర్వాతే ఆయన ఈనాటి స్త్రీల పరిస్థితిని మెరుగుపరచడానికి ఎటువంటి సంస్కరణలు చెయ్యాలో తెలియజేశారు. మౌర్యులకు పూర్వపు సమాజంలోను, మౌర్యుల కాలంలోను జీవించిన మహిళలు గౌరవప్రదంగా ఉండేవారు. తర్వాత కాలంలో సామాజికంగా, మానవ సంబంధాల రీత్యా ముందుకు నడపాల్సింది పోయి, మనుధర్మ శాస్త్రం సమాజాన్ని వెనక్కి నడిపిందనేది అంబేద్కర్ వాదన. శూద్రుల పట్ల, మహిళల పట్ల మనుస్మృతి చూపిన వివక్షకు గాను దాన్ని తగలబెట్టాలంటారు. అంబేద్కర్, ఆయన ఈ ప్రతిపాదన కొత్త విప్లవానికి నాంది.

స్త్రీల స్థితిగతుల పట్ల అంబేద్కర్ చేసిన ఈ అధ్యయనం చరిత్ర మూలాల్లోకి వెళ్ళి అసలు సమస్య ఎక్కడుందో కనుక్కొని వాటిని బాగుచెయ్యాలన్న ఒక తాపత్రయంతో చేసిందే తప్ప ఎవరి మెప్పు కోసమూ కాదు. అయితే అదృష్టవశాత్తు ఆయన, ఆ తర్వాత రాజ్యాంగ నిర్మాణ బాధ్యతలు చేపట్టారు. రాజ్యాంగ బద్ధంగా భారత పౌరులందరికి సమాన హక్కులకు ఆయన రూపకల్పన చేశారు. తర్వాత కాలంలో ఆయన న్యాయశాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్నాక ఆయన మొదటి అవకాశాన్ని హిందూ కోడ్ బిల్లు ప్రవేశపెట్టడానికి వాడుకున్నారు. ఈ బిల్లు ద్వారా ఆయన స్త్రీలకు వివాహం, విడాకులు, ఆస్తి వంటి అన్ని విషయాల్లో సమాన హోదాను కల్పించారు. సమాజాన్ని తిరోగమనంలో నడిపి స్త్రీల జీవితాలను అత్యంత దీన స్థితిలోకి నెట్టిన పరిస్థితులను ఈ విధంగా రూపుమాపి వారి జీవితాల్లో విప్లవాత్మక మార్పులను తెచ్చేందుకు ప్రయత్నించారు. కానీ ఈ బిల్లు పార్లమెంటులో వీగిపోయింది. జవహర్‌లాల్ నెహ్రూ వంటి ఆధునిక భావాలు కలిగిన, ధైర్యసాహసాలు కలిగినవారు కూడా మనుధర్మానికి వ్యతిరేకంగా వెళ్ళేందుకు వెనుకాడారు. మన సమాజంలో తరతరాలుగా పాతుకుపోయిన తిరోగమన విప్లవానికి ప్రభుత్వం కూడా ఎదురెళ్ళేందుకు జంకింది. అంబేద్కర్‌కి అప్పటికి సమస్య అధికారంతో తీర్చుగలిగేది కాదని అర్థం అయ్యింది. అందువల్ల ఆయన క్యాబినెట్ నుంచి బయటికి వచ్చేశారు.

రాజకీయ పరిస్థితులతో ఆయన ఏనాడూ రాజీపడలేదు. ఆయన రాజీనామా మనకు చాలా విషయాలు తెలుపుతుంది. ఆయనకు అధికారం ఒక లెక్కలోనిది కాదు. రెండోది అణచివేతకు గురైనవారి పక్షాన ఆయన పోరాట పటిమను తెలుపుతుంది. అన్నింటికంటే ముఖ్యమైన విషయం ఏమిటంటే ఆయన అధికారాన్ని వదులుకుంది అందరూ అనుకుంటున్నట్లు దళితుల కొరకు కాదు, మహిళల కోసం అనేది. అంటే ప్రత్యేకంగా ఆయన ఏదో ఒక వర్గం బాగోగుల కోసం కాదు, సమాజంలో వివక్షను, అణచివేతను ఎదుర్కొంటున్న అన్ని వర్గాల పక్షాన నిలిచారని అర్థం అవుతోంది.

సమకాలీన భారత సమాజం రకరకాల స్థాయిల్లో చరిత్రను పునరావృతం చేస్తుంది. బౌద్ధమతాన్ని ఆ రోజుల్లో అత్యంత మార్పులు తెచ్చిన ఉద్యమంగా తీసుకున్నట్టయితే అది సమాజాన్ని సంస్కరించడంలో తన ముందున్న సవాళ్ళను దీటుగా ఎదుర్కొలేకపోయింది. చారిత్రాత్మకమైన సంస్కరణలు అమలు కాలేక పోయాయి. బౌద్ధమతం కనుక భారత దేశంలో విజయవంతమై ఉండి ఉంటే భారతదేశం ఈ రోజున మరోలా ఉండేది. ఇలా లింగ వివక్ష, కుల వివక్ష ఇంతకాలం కొనసాగి ఉండేవి కాదు. సామాజికంగా మరింత అభివృద్ధి జరిగి ఉండేది.

ఈ నలభై సంవత్సరాల్లో అనేక ఉద్యమాలు వచ్చాయి. మహిళలు తాము పురుషుల కంటే ఏ విషయంలోనూ తీసిపోమనే విషయాన్ని రుజువు చేస్తూనే ఉన్నారు. "గౌరవప్రదమైన జీవితం మా హక్కు" అని ఎన్నో వేదికల మీద నొక్కి చెప్తున్నారు. ఈ చైతన్యం అన్ని వర్గాల స్త్రీలలోనూ కనిపిస్తోంది. ఈ రకమైన చైతన్యం ఒక స్థాయిలో సమాజాన్ని ప్రజాస్వామ్య బద్ధం చేస్తే మరొక స్థాయిలో అణచివేస్తుంది. స్త్రీల మీద జరుగుతున్న అకృత్యాలు సమాజంలోని అమానుషత్వాన్ని మాత్రమే తెలపడం లేదు. వీటివల్ల వారిలోని చైతన్యాన్ని సమాజం అంగీకరించడానికి

సిద్ధంగా లేదనేది కూడా తేటతెల్లం అవుతోంది. భూపోరాట ఉద్యమంలో అత్యంత ధైర్యసాహసాలతో పోరాడిన గిరిజన మహిళలు, మద్యనిషేధ ఉద్యమాన్ని లేవనెత్తిన దళిత మహిళలు, కుటుంబంలో సమాన హోదా కోసం పోరాడుతున్న ఉన్నత వర్గాల స్త్రీలు, పౌరహక్కుల సాధనలో పాలు పంచుకుంటున్న స్త్రీ వాద ఉద్యమాలు భారత సమాజ పునర్నిర్మాణ ఆవశ్యకతను తెలుపుతున్నాయి. ఇది బుద్ధుడు, ఇతర సంస్కర్తలు సమాజంలో ఆశించిన మార్పు ఇప్పుడు మనం ఒక నవతక ప్రారంభంలో ఉన్నామని అనుకోవచ్చు.

ఇప్పటికీ సమాజంలో సింహ భాగం మనుధర్మాలనే ఆదర్శాలుగా భావిస్తున్నారు. హిందూ కోడ్ బిల్లును అడ్డుకుని వారు ఇంకా తమ యుద్ధాన్ని చేస్తూనే ఉన్నారు. సాధ్యమైనంత వరకు వారి ఆధిపత్యాన్ని కాపాడుకునేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నారు. బౌద్ధమతాన్ని, హిందూకోడ్ బిల్లును మరుగున పడేయడానికి వారు నిత్యం శ్రమిస్తూనే ఉన్నారు. మార్పులు జరుగుతున్న ఈ సందర్భంలో ఎటువైపు వెళ్ళాలన్న నాలుగురోడ్ల కూడలిలో ఉన్న వారికి అంబేద్కర్ తన రాజీనామాతో మార్గదర్శనం చేశారు. తన రచనలు ద్వారా అణచివేతకు గురౌతున్న వారిని చైతన్యపరిచారు.

**అంబేద్కర్**
**63వ వర్ధంతి**
**ప్రత్యేక వ్యాసాలు**

బ్రాహ్మణ వాదం తిరోగమన విప్లవాన్ని ఇలాగే సమాజంలో కొనసాగించే ప్రయత్నం చేస్తోంది. స్త్రీల పట్ల, దళితుల పట్ల ఎటువంటి వివక్షను కొనసాగించాలని సమాజం కుట్ర చేస్తున్నదో ఆయన తన రచనలలో తేటతెల్లం చేశారు. శూద్రులు, స్త్రీలకు సంఘీభావం తెలిపి వారి బలాన్ని పెంచాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఉన్నతవర్గ స్త్రీలు కూడా అణగారిన వర్గాలేనన్న విషయాన్ని ఒప్పుకుని ఇతర అణగారిన వర్గాలతో కలిసి ఉద్యమించినప్పుడు మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చునేది ఆయన అభిప్రాయం. అంబేద్కర్ శతజయంతి ఉత్సవాలు జరుపుకుంటున్న ఈ సంవత్సరం మనమంతా అణగారిన వర్గాలైన దళితులు, స్త్రీల అభివృద్ధికి, వారి పైన జరుగుతున్న అకృత్యాలకు వ్యతిరేకంగా పోరాడటమే మనం ఆయనకు ఇవ్వగలిగిన ఘన నివాళి. ❏

(1990లో హైదరాబాద్‌లో డా॥బి.ఆర్. అంబేద్కర్ మెమోరియల్ ట్రస్ట్ కోసం చేసిన స్మారకోపన్యాసం)

**అనువాదం : భవాని దేవినేని**

---

## అంబేద్కర్

**(10వ పేజీ తరువాయి)**

విశ్రమించేవాడు కాదు. ఈ దేశంలో కార్మికులు 8 గంటలు పని విధానం, వేతనంతో కూడిన సెలవులు మంజూరుచట్టం (1944), గనుల్లో పనిచేసే కార్మికుల భద్రత కోసం రూపొందించిన బిల్లు లాంటివి ఆయన కార్మికుల కోసం పడ్డ తపనను తెలియచేస్తాయి.

ఊరు, వాడ భేదం తప్ప, ఒకప్పుడు వివక్షకు, అంటరానితనానికి గురి అవ్వడంలో శూద్రులకూ, దళితులకు చెప్పుకోదగ్గ తేడా ఏదీ ఉండేది కాదు. శూద్రులు ఈ హిందూ సామాజిక వ్యవస్థలో ఎలా అణచివేయబడ్డారో, ఎంత క్రూరమైన శిక్షలకు గురి అయ్యారో చరిత్ర సాక్షిగా, వేద ప్రమాణముగా వివరిస్తూ, 'శూద్రులెవరు' అనే గ్రంథాన్ని రచించారు. ఈ గ్రంథాన్ని పూలేకు అంకితమిస్తూ ఆయనను Great Shudra అన్నారు. పూలేను తన గురువుగా (నిజానికి కాదు) అంబేద్కర్ ప్రకటించు కున్నాకే మహారాష్ట్రలోని ఒక ప్రాంతానికి పరిమితమైన పూలే దేశవ్యాప్తమయ్యాడు. శూద్రులు బానిస సంకెళ్ళు తెంచుకుని అగ్రకులాలతో సమానంగా ఆత్మగౌరవంతో జీవించాలని అంబేద్కర్ పోరాడాడు. అయితే శూద్రులు ఇప్పుడు భూస్వామ్యకులాలుగా ఎదిగి, ఏ బ్రాహ్మణత్వం వలన తరతరాలుగా నలిగిపోయారో, ఆ బ్రాహ్మణత్వాన్నే బలంగా సంతరించుకుని, దళితులను అణచివేయడం దుర్మార్గం.

శూద్రుల కోసం, మహిళల కోసం, కార్మికుల కోసం, బి.సి.ల కోసం – ఇలా దగాపడ్డ ప్రతీ అధో జగత్ సహోదరుని కోసం అంబేద్కర్ శిలువనెక్కాడు. వారి కోసం ఎన్నోసాధించాడు. ఇప్పుడంతా ఆ ఫలాలు అనుభవిస్తున్నారు. కానీ బాబాసాహెబ్ డా॥బి.ఆర్. అంబేద్కర్ ఒక్క క్రైస్తవేతర దళితులకు మాత్రమే ఆరాధ్యనీయుడిగా మిగిలిపోవడం పెద్ద విషాదం. ఈ దేశానికి శాపం. ఈ శాపం ప్రపంచ దేశాలకు తగలలేదు. అవి ఆయనను ప్రపంచ మేధావిగా గుర్తించి ఆ జ్ఞానం నుండి లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నాయి. ప్రపంచ ప్రసిద్ధి విశ్వవిద్యాలయాలు అంబేద్కర్ పీఠాలు పెడుతున్నాయి. వంద మంది ప్రపంచ మేధావుల్లో ప్రథముడు అంటున్నాయి. ఐక్యరాజ్యసమితి ఆయన జన్మదినాన్ని ఏకంగా ప్రపంచ జ్ఞానదినోత్సవం (World knowledge day)గా ప్రకటించింది. కానీ భారతీయుడు ఇంకా ఆ మహనీయుని కులదృక్పథంతోనే చూసి, ఆయన అనుగ్రహించిన మహాజ్ఞానాన్ని స్వీకరించినా, ప్రపంచ దేశాల్లో అవమానకర పౌరుడిగానే అనాగరిక మానవుడిగానే మిగిలిపోతున్నాడు. అతడు శాపవిముక్తుడు అగు గాక. ❏

అంబేద్కర్
63వ వర్ధంతి
ప్రత్యేక వ్యాసాలు

# అంబేద్కర్ - అంబేద్కరిజం

**అవిజిత్ పాఠక్**
సామాజిక శాస్త్ర ఆచార్యులు
జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, న్యూఢిల్లీ



డా॥ బి.ఆర్. అంబేద్కర్ జయంతి రోజున ఆయనకు అంజలి ఘటిస్తున్న ఈ తరుణంలో ఆయనతో నిమగ్నం కావడం నా జీవితంలో ఆలస్యంగా జరిగిందని నేనంగీకరించక తప్పదు. మహాత్మాగాంధీ, రవీంద్రనాథ్ ఠాగూర్, కార్ల్‌మార్క్స్‌లు నా రాజకీయ చేతనా ప్రపంచాన్ని ఆక్రమించుకున్న కొంతకాలం వరకు అంబేద్కర్ నన్ను ఆకర్షించలేదు.

ఇప్పుడు సమీక్షించుకుంటే అందుకు ప్రాథమికంగా రెండు కారణాలు కనిపిస్తున్నాయి. మొదటిది, యాదృచ్ఛికంగా బ్రాహ్మణ కుటుంబంలో పుట్టడం వల్ల కులస్వామ్యపు వికృతాన్నీ దాని అనుబంధ హింసనీ నేను అనుభవించకపోవడం, పర్యవసానంగా ఈ రోజుల్లో అంటున్నట్టుగా ఆధిక్య వర్గాలకు చెందిన వ్యక్తిగా నాకు కులం కనిపించకపోవడం. అందువల్లనే కుల వ్యవస్థను ఘాటుగా విమర్శించిన అంబేద్కర్‌ను నేను ఉపేక్షించగలిగాను. రెండవది, 'ప్రాతినిధ్యం' గురించి యూనివర్సిటీ సంస్కృతి కలిగించిన ఒకానొక తాత్విక ఆందోళన. అది అణచివేసిన వర్గానికి చెందినవాడిగా, బయటి వ్యక్తిగా నేనెప్పటికీ దళితుడి స్వానుభవాన్ని అనుభవించలేనందువల్ల అంబేద్కర్‌తో నా అనుబంధం వ్యూహాత్మకంగా తెలివిగా బలవంతంగా ఏర్పరచుకున్నదే అవుతుందనే వాదనల వల్ల కలిగిన ఆందోళన.

కానీ మానవ చరిత్ర మనం పరిణామం చెందుతామని చెబుతుంది. మనం నేర్చుకుంటామనీ నేర్చుకున్న దాన్నే ఖండించు కుంటామనీ, మన ఆకాశాల్ని విస్తరించుకోవడానికి అన్ని అడ్డంకుల్ని తొలగించుకుంటామనీ చెబుతుంది. అవును ఒక అన్వేషిగా నేను అంబేద్కర్‌ను చదివాను. ఆయనను ఉత్సవీకరించడం ప్రారంభించాను. అయితే బలవంతపు అంబేద్కరిజమ్‌తో నాకు అసౌకర్యం కలుగుతోంది. రాజకీయ పోటీతత్వమూ, ఆచరణ లేని రాడికలిజమూ అంబేద్కర్‌ను తిరుగులేని దేవుడిగా తర్కీకరిస్తున్న సమయంలో, నా ప్రయాణం వేరుగా సాగుతోంది. నేను అంబేద్కర్‌ని అభిమానిస్తాను. కానీ ఆయనలో పరిమితులు గుర్తిస్తాను.

సామాజిక కార్యకర్త, తాత్వికుడూ అయిన అంబేద్కర్ దుడ్డుకర్రతో కుల వ్యవస్థ నడ్డి విరిచాడు. ఆ విభ్రమ మనల్ని ఒక అవసరమైన అశాంతికి గురి చేసి మౌలికమైన సాంస్కృతిక అస్తిత్వ పరిణామానికి దారి చూపింది. అయితే అంబేద్కర్‌ని ప్రశంసించడానికి నాకు నేను పరిమితులు విధించుకుని గాంధీని, మార్క్స్‌ను చిన్నబుచ్చనవసరం లేదు. ఇంకో విధంగా చెప్పాలంటే అంబేద్కర్‌కు అంబేద్కరిజమ్‌కు మధ్య ఉన్న రేఖను గుర్తిస్తున్నాను నేను.

"గతాన్ని గుర్తుంచుకోలేకపోవడం అనే మత్తులోకి జారిపోయాం మనం. ఆ స్థితి చరిత్రను తిరస్కరించి నూతన సంస్కృతిని నిర్మించుకునే బాధాపూరిత ప్రయత్నాన్ని నిలిపివేసింది. డా॥ అంబేద్కర్ ఈ సాంస్కృతిక జడత్వాన్ని సహించలేకపోయాడు. ఆయన జీవితం మొత్తాన్ని ఈ మానసిక దుస్థితికి వ్యతిరేకంగా సాగించిన అవిశ్రాంత పోరాటంగా సంక్షిప్తీకరించవచ్చు"

– డి.ఆర్. నాగరాజ్

వైవాహిక సంబంధాల నుంచి రాజకీయ సమీకరణల దాకా, అధికారిక వర్గీకరణల నుంచి మత కర్మకాండల దాకా, సామాజిక కథనాల నుంచి అస్తిత్వ రాజకీయాల దాకా వ్యవస్థీకరింపబడిన నిచ్చెనల మెట్ల కుల స్పృహ అసమానతను, స్వచ్ఛా స్వచ్ఛతల ద్వంద్వాన్ని నెలకొల్పింది. ఈ బహిష్కరణలో అంతర్గతంగా హింసా ప్రవృత్తి ఉంది. దాన్ని నిర్మూలించవలసి వుంది. అవును, ఈ సంక్లిష్ట మత వ్యవస్థలోని బహుళ స్వరాల్లో కుల వ్యతిరేక చైతన్య బీజాలు కూడా నిక్షిప్తమై ఉన్నాయి. ఆధ్యాత్మిక ప్రేమ తత్వంలో, అద్వంద్వంలో, ఏకతావాదంలో వాటి మూలాల్ని చూడవచ్చు. స్వామి వివేకానంద వంటి అగ్రవర్ణ సాంఘిక సంస్కర్తలు కులదౌష్ట్యం పట్ల పూర్తి ఉపేక్షను ప్రదర్శించలేదు. అయితే అంబేద్కర్ గాఢమైన అనురక్తితో సాధికారంగా కుల నిర్మూలనను ప్రతిపాదించాడు. అట్టడుగున ఉన్న ఆత్మవిశ్వాసం లేచి నిలబడాలనే అంబేద్కర్ ప్రతిపాదనను అర్థం చేసుకోవాలంటే మూడు రకాల వాదనల్ని అంగీకరించాల్సి వుంది.

మొదటిది, ఆయన కులాన్ని లేదా కులాన్ని న్యాయ సమ్మతం చేసిన మనుస్మృతిని ఆధునిక దృష్టాంతం నుంచి ఖండించాడు. దానికి ప్రాతిపదిక సాంఘిక రాజకీయ విప్లవ సూత్రాలైన స్వేచ్ఛ, సమానత్వం, సోదర భావం. అంబేద్కర్ వెలిబుచ్చినట్లు మనువు ప్రణాళికలో ప్రతి వ్యక్తికీ అతని వృత్తి, అతని శక్తి సామర్థ్యాలతో కానీ, అభీష్టంతో కానీ నిమిత్తం లేకుండా ముందుగానే నిర్దేశింపబడి ఉంటుంది. పైగా శూద్రుడు, ఈ ధర్మశాస్త్రం చెప్పినట్లు, ఇతరులకు సేవ చేయడానికే ఉద్దేశించబడ్డాడు.

అంబేద్కర్ వాదించినట్టు శూద్రుడు ప్లేటో నిర్వచనంలోని బానిస మాదిరిగా పరాధీనతను అంగీకరించే వ్యక్తిగా మాత్రమే మిగిలిపోతాడు. సందేహం లేదు. కులం స్వేచ్ఛ అనే భావనకు ఎదురొడ్డుతుంది. కులం సమానత్వం అనే భావనకూ వ్యతిరేకమే! ఎందుకంటే మనువు నిచ్చెన మెట్ల కుల వ్యవస్థను నిర్మిస్తూ అసమానతనే వివిధ కులాలను నిలబెట్టే మహాశక్తిగా పొందుపరిచాడు. ఇక సౌభ్రాతృత్వం అనే భావన తలెత్తడానికే ఆస్కారం లేదు. ఎందుకంటే కుల వ్యవస్థలో 'సహచర భావనే' ఉండదు కనుక. 'ఒక కులం సుఖదుఃఖాలు మరొక కులపు సుఖదుఃఖాలు కావు' కనుక.

రెండవది, అంబేద్కర్ కులానికి వ్యతిరేకంగా ఆర్థికపరమైన లేదా ఉపయోగితా వాదనలు చేశాడు. సాంకేతిక అభివృద్ధిని అందుకోగలిగి తమ వృత్తుల్ని మార్చుకోగలిగిన సృజనశీలురైన వ్యక్తుల్ని కోరుకుంటుంది ఆధునిక పరిశ్రమ. కాబట్టి శ్రమ విభజనని స్థిరపరచే కుల వ్యవస్థ ఆధునిక పారిశ్రామిక, ఆర్థిక వ్యవస్థకు ప్రమాదకరం అవుతుంది. ఎందుకంటే శ్రమ విభజన లేదా శ్రామికుల విభజన ఇష్టం వల్లనో, ఆసక్తి వల్లనో జరిగేది కాదు. కుల వ్యవస్థలో నాటుకుపోయి సంక్రమించిన స్థాయి సృజనాత్మకనూ, సామర్థ్యాన్ని నిర్వీర్యం చేస్తుంది. పనిలో మనిషి తన మేధను కానీ, హృదయాన్ని కానీ మగ్నం చెయ్యనివ్వని వ్యవస్థలో ఏ సామర్థ్యం బయట వస్తుందని ప్రశ్నించాడు అంబేద్కర్.

చివరిగా, అంబేద్కర్ కుల వ్యవస్థకు వ్యతిరేకంగా చేసిన మనో వైజ్ఞానిక వాదనల్ని అర్థం చేసుకోవాలి. ఆయన హిందువులను బలహీనులైన సాధుతత్వం కలిగిన వ్యక్తులుగానూ, శిక్కులను మహమ్మదీయులను శక్తివంతమైన సామూహిక శక్తిగానూ వర్గీకరిస్తూ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశాడు. సోదరభావం లేదా సహచర భావం లేని హిందువుల్లో సమూహ భావన, అందునుంచి ఉద్భవించే దృఢత్వము మృగ్యమై పోతాయంటాడు. అంబేద్కర్ మాటల్లో చెప్పాలంటే "ఒకడై ఉండి, ఒకడిగానే ఉండేలా నిర్దేశించబడిన హిందువు పిరికితనం ఆవహించి, కుంచించుకుపోయి, నిర్వీర్యుడై పోరాటంలో లొంగిపోవడమో లేదా పారిపోవడమో చేస్తాడు".

మహద్ సత్యాగ్రహం నుంచి బౌద్ధమత స్వీకారం వరకూ, అఖిల భారత చరిష్మా కలిగిన గాంధీని మినహాయిస్తే జాతిలో బీటలెత్తిన శకలాల్ని పరిగణనలోనికి తీసుకోవలసిన అవసరాన్ని పదే పదే ఉల్లేఖించడం నుంచి రాజ్యాంగ నిర్మాణం దాకా అంబేద్కర్ నిర్మాణాత్మకమైన పాత్రను నిర్వర్తించాడు. అంచులకు నెట్టివేయబడిన వారికి రాజకీయ ప్రాతినిధ్యం కలిగించడం కోసం వారిలో విశ్వాసమూ ఉత్తేజమూ కలిగించడం దగ్గర నుంచి ప్రత్యామ్నాయ ఆధిపత్య పోరాటానికి పునాదులు నిర్మించే వరకూ – అంబేద్కర్ ఎంతో అర్థవంతమైన జీవితాన్ని నిర్వహించాడు. సమదృష్టి ఉన్న బౌద్ధాన్ని ఎంచుకునే క్రమంలో నియమపూరితమైన బ్రాహ్మణీయ హైందవాన్ని తిరస్కరించడం విప్లవాత్మకం. హిందూ తత్వంలో మనుస్మృతి ఒక చిన్న శకలం మాత్రమేననీ, హైందవంలోని సంభాషణాత్మకమైన సంప్రదాయ పరంపరని అర్థం చేసుకోవడంలో అంబేద్కర్ శక్తియుక్తులు పూర్తిగా వినియోగంలోకి రాలేదని వాదించడానికి అవకాశం ఉన్నప్పటికీ ఆయన బ్రాహ్మణిజమ్ మీద చేసిన విమర్శ మార్క్స్ పెట్టుబడిదారీ వ్యవస్థ మీద, గాంధీ వలసవాదం మీద చేసిన విమర్శలతో సమానమని అంగీకరిస్తాను.

అంబేద్కర్ 63వ వర్ధంతి ప్రత్యేక వ్యాసాలు

## అంబేద్కరిజమ్ పరిమితులు

"గాంధీ మరణించిన రెండు నెలల తర్వాత బ్రాహ్మణ వైద్యురాలు శారదా కబీర్‌ని అంబేద్కర్ వివాహం (ఆయన మొదటి భార్య రమాబాయి 1935లో మరణించారు) చేసుకున్న సందర్భంలో వల్లభాయ్‌పటేల్ 'బాపూ జీవించి ఉంటే మిమ్మల్ని తప్పక ఆశీర్వదించి ఉండేవారు' అని వ్రాసినప్పుడు అంబేద్కర్ 'నేను అంగీకరిస్తాను బాపు జీవించి ఉంటే మమ్మల్ని ఆశీర్వదించేవారు' అని జవాబిచ్చారు". – రాజ్‌మోహన్ గాంధీ

అంబేద్కర్ పాండిత్యం, అబ్బురపరిచే ఆయన ప్రతిపాదనలు తిరస్కరించ వీలు లేనివి అయినప్పటికీ అంబేద్కరిజమ్ మాత్రం మూసుకుపోయి దిగజార్చబడినదై విముక్త భావన నివ్వడం లేదు. ఈ సందర్భంగా నేను మూడు వాదనలు చేయదలిచాను.

నా మొదటి వాదన గాంధీకి సంబంధించింది. సాధారణంగా అంబేద్కరిజమ్ గాంధీని కులవాదిగా, కుట్రదారునిగా దిగజారుస్తుంది. వాస్తవమేమిటంటే గాంధీ నిరంతర పరిణామ శీలి. అంటరానితనాన్ని ఒక 'పాపం'గా నిర్వచించినప్పటికీ, ఒకానొక దశలో (1920లో ఆయన రాసిన వ్యాసం ఒకటి గుర్తుకు వస్తోంది) కులవ్యవస్థని దాని అన్ని అసమానతలతో యధాతథంగా మౌలికమైన, సహజమైన, అవసరమైన చాతుర్వర్ణ వ్యవస్థగా అంగీకరించాడు. ఆ దశలో సహపంక్తి భోజనాలు, సహపంక్తి పానాలు, కులాంతర వివాహాల్ని కూడా వ్యతిరేకించాడు.

అయితే ప్రయోగశీలి అయిన గాంధీ కులవ్యవస్థ గురించి నిశ్చలంగా ఉండిపోలేదు. 1930ల్లో ఆయనలో కులం మీద ఒక పదునైన మౌలికమైన విమర్శకుణ్ణి చూశాం. 1935లో హరిజన్‌లో రాసిన వ్యాసంలో కుల నిర్మూలన జరిగి తీరాలనే భావన స్పష్టంగా కనిపిస్తుంది. కులాంతర వివాహాలకు సహపంక్తి భోజనాలకు తన అంగీకారాన్ని బాహాటంగానే ప్రకటించాడు. నిజానికి, స్వాతంత్ర్యానికి కొద్ది కాలం ముందు దళిత, దళితేతరుల

**అంబేద్కర్ 63వ వర్ధంతి ప్రత్యేక వ్యాసాలు**

మధ్య వివాహాలకు కూడా తన ఆశీస్సులు లభిస్తాయని ప్రకటించాడు.

పైగా, గాంధీ ఆచరణ ఆయన మాటల కంటే విప్లవాత్మకమైనది. తన ఆశ్రమాల్లో మురికిని తొలగించడంలో, శ్రమకు గౌరవం కల్పించడంలో గాంధీ స్వీయపాత్ర, స్వచ్ఛత కల్మషాల బ్రాహ్మణీయ ద్వైదీ భావజాలం మీద విచారణ, అస్పృశ్యతా పాపం నుంచి సవర్ణ హిందువుల చేసుకోవలసిన ప్రాయశ్చిత్తం గురించి నిరంతర పునశ్చరణ, సంక్షోభపూరితమైన నవఖాలీ రోజుల్లో రజకులతో, బెస్తవారితో, చెప్పులు కుట్టేవారితో, నేత పని వారితో ఆయన అసాధారణమైన సాన్నిహిత్యం అందుకు దృష్టాంతాలు. ఆయన జీవితంలోని లయ, తాను ఆత్మ శుద్ధత కోసం చేసిన సాధనను సూచిస్తుంది. అందువల్ల అంబేద్కర్ గాంధీ గురించి చేసిన కఠినమైన వ్యాఖ్యలు (గాంధీ తత్వంలో ఉన్నది అనుగ్రహం కాదు శాపం. దాన్లోని అస్పృశ్య వ్యతిరేకత ఒక భ్రమ. అది సారరహితమైంది) అన్యాయమైనవిగా, అబౌద్ధికమైనవిగా భావిస్తాను.

అందుకు అంబేద్కరిజమ్‌లోని కాఠిన్యతకు భిన్నంగా భూమ్యాకాశాల మేళవింపును కోరుకుంటాను. గాంధీ మనస్సాక్షి సిద్ధాంతమూ, అంబేద్కర్ విమర్శనా దృక్పథమూ, సవర్ణ హిందువుల మానవీకరించే గాంధీ ప్రయత్నమూ దళితులతో అంబేద్కర్ మమేకత్వమూ, గాంధీ భగవద్గీత అంబేద్కర్ బౌద్ధం, అంబేద్కర్ ఆధునిక గ్రహణశక్తీ గాంధీ సర్వోదయ – వీటి మధ్య అంతరాలు కరిగిపోవడాన్ని కోరుకుంటాను. గాంధీ లేకపోతే అంబేద్కర్ బహిష్కృత నేలకు పరిమితమై దళిత విగ్రహంగా మాత్రమే నిలిచిపోతాడని భయపడుతున్నాను. అంబేద్కర్ అనుయాయులు గుర్తించవలసినదేమంటే వారాయనకు కల్పిస్తున్న స్థానం కంటే ఉన్నత స్థానానికి ఆయన అర్హుడని.

నా రెండవ వాదన, దళితేతరులెవరైనా సరే దళితుల వేదనను అర్థం చేసుకోగలగడాన్ని శంకించడం గురించి. అది దళిత సాహిత్యమూ, దళిత కళాశాస్త్రాలు – ఆధిక్య వర్గాలు ప్రపంచాన్ని చూసే విధానం కన్నా భిన్నంగా చూస్తాయనే భావనకు దారి తీస్తుంది. నిజంగానే ఆధిక్య వర్గాలు, కులాలు కళ మీద, కళా సౌందర్య శాస్త్రాల మీద గుత్తాధిపత్యం చలాయిస్తాయి. కాబట్టి దళితులు తమకొక స్థానం కోసం, శైలి కోసం, వ్యక్తీకరణ కోసం ఆరాటపడడం సహేతుకమే. అయితే ఈ ప్రయత్నం అతిగా జరిగితే అది మొత్తం ఆశయాన్నే క్షీణింపచేస్తుంది. మనిషి సృజనాత్మక ఆవరణకు సామాజిక అస్తిత్వ పరిమితుల్ని అధిగమించగల శక్తి ఉన్నదని మనం విస్మరించరాదు.

అందువల్ల కళని దాని సౌందర్యాన్ని సృజనకారుడి కులాన్నో వర్గాన్నో బట్టి స్థాయి నిర్ణయం చేయడాన్ని వ్యతిరేకిస్తాను. అందువల్ల నేను శక్తివంతమైన దళిత ఆత్మకథ ఓంప్రకాశ్ వాల్మీకి 'జూతన్' నుంచీ, సవర్ణహిందూ బిమల్‌రాయ్ అంటరాని మహిళకు అగ్రవర్ణ భర్తతో ఏర్పడిన దాంపత్యంలోని ఆంతరిక కల్లోలాన్ని చిత్రీకరించిన సినిమా 'సుజాత' నుంచీ సమానంగా స్వీకరించడానికి సందేహించను.

నా మూడవదీ ఆఖరుదీ అయిన వాదన సంక్లిష్టమైన వర్గ, కుల అంతస్సంఘర్షణ గురించి. అవును, మనకు తెలుసు అంబేద్కర్ మార్క్స్‌ని కాక బుద్ధుణ్ణి ఎంపిక చేసుకున్నాడు. అంతే కాదు మార్క్స్ ప్రవచించిన శ్రామిక విప్లవాత్మకతను నిరాకరించాడు. ఎందుకంటే శ్రామికులు కూడా కులం ప్రాతిపదికను విభజింపబడి ఉన్నారు కాబట్టి. భారతదేశంలో శ్రామిక జనం, కులం జాతి ప్రాతిపదికలుగా హెచ్చుతగ్గుల విభేదాలను పాటించడం లేదా అని ప్రశ్నించాడు అంబేద్కర్.

కులంతో కునారిల్లే వ్యవస్థలో సంక్రమించిన స్థాయి పేదవారిని కూడా ప్రభావితం చేస్తుంది. కానీ అంబేద్కర్ ధనవంతులైన దళితులు (వారి సంఖ్య స్వల్పమైనప్పటికీ) పేద దళితులతో కలిసి పోరాడడానికి ముందుకు వస్తారా అనే ఎదురు ప్రశ్నను వెయ్యలేదు. అయితే అటువంటి ప్రశ్నను వెయ్యాల్సిన అవసరం ఉందని భావిస్తున్నాను. దాని ద్వారా కులానికి, వర్గానికి మధ్య జరిగే గతి తార్కిక అంతర్నాటకం అనుభవంలోకి వస్తుంది. దళిత సమాజం మీద వర్గంలో జెండర్‌లో ఏర్పడిన చీలికలు ప్రభావం చూపవని భావించడం స్వాభావికమే అవుతుంది.

అంతే కాదు ఆస్థి, భూసంబంధాలు, ఆర్థిక స్థితిగతుల మీద పని చెయ్యకుండా కులస్వామ్యం నెలకొల్పిన మానసిక ఆవరణాన్ని మార్చడం సాధ్యపడుతుందా? ఇది ఇదా లేక అదా అనే రకమైన ప్రశ్నకాదు. ఇది నిస్సందేహంగా ఇదీ, అదీ కూడా. అంటే కుల, వర్గ అసమానతల రెండిటి మీద ఏకకాలంలో పోరాడవలసిందే. కమ్యూనిస్టులను కేవలం బ్రాహ్మణ శ్రేణిగా చూడవలసిన అవసరం కూడా లేదు. ఇటువంటి నియతివాదం వల్ల చూపు మందగించి భిన్నమైన వ్యక్తీకరణలు విలువ లేనివిగా భావించబడతాయి.

అంబేద్కర్‌ను ఒక అసాధారణ విముక్తిప్రదాతగా ఆరాధించే నేను ఆయన మొండి అనుచరులకు ఈ విన్నపం చేయదలిచాను. అనేక మంది గాంధేయులు గాంధీని చేసినట్టుగా మీరు కూడా అంబేద్కర్‌ను తిరుగులేని దేవుణ్ణి చేయకండి. దాని బదులు మీ రెండు చేతులూ సాచి గాంధీని, మార్క్స్‌నీ ఆలింగనం చేసుకోండి. స్వల్ప వైరుధ్యాలతో కూడినప్పటికీ సామాజిక న్యాయాన్ని, పర్యావరణ ఆధునికతను, ఆధ్యాత్మిక చైతన్యాన్ని, ఆర్థిక సమానతను సాధించగల సమగ్ర తత్వాన్ని ఆవిష్కరించండి. ❏



# అంబేద్కర్‌పై "పరివార్" అభూతకల్పనలు

-ఆర్వీ రామారావ్

**అంబేద్కర్ 63వ వర్ధంతి ప్రత్యేక వ్యాసాలు**

హఠాత్తుగా డా.బాబా సాహెబ్ అంబేద్కర్ అందరికీ ప్రీతిపాత్రుడు అయిపోయాడు. జనతా దళ్ కేంద్రంలో అధికారంలోకి వచ్చి మండల్ కమిషన్ సిఫార్సుల బూజు దులిపి ఆ సిఫార్సులను అమలు చేయాలని అప్పటి ప్రధాన మంత్రి విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్ నిర్ణయించే దాకా ప్రధాన రాజకీయ స్రవంతిలోని రాజకీయ పార్టీలు, నాయకులు అంబేద్కర్‌ను పెద్దగా పట్టించుకోలేదు. విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ హయాంలోనే అంబేద్కర్ కు భారత రత్న దక్కిందన్న వాస్తవం విస్మరించలేం. రాజ్యాంగ రచన సమయంలోనూ, స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన తొలి మంత్రివర్గ సభ్యునిగా అంబేద్కర్ కాంగ్రెస్‌తో కలిసి పని చేసినా ఆయనకు భారత రత్న ఇవ్వాలన్న ధ్యాసే కాంగ్రెస్‌కు రాలేదు. నిజానికి భారత రత్న వల్ల అంబేద్కర్ కు కొత్తగా ఒరిగిందీ ఏమీ లేదు. అది ఆయన కీర్తి కిరీటంలో మరణానంతరం అదనంగా చేరిన తురాయి మాత్రమే.

అంబేద్కర్ మరణించిన 60 ఏళ్లకు ఆ పేరుకు విపరీతమైన ఆకర్షణ అబ్బింది. అంబేద్కర్ 125వ జయంతి సందర్భంగా ఆయన ఉత్తరదాయిత్వం కోసం ప్రధానమైన రాజకీయ పార్టీలు పోటీ పడుతున్నాయి. గత సంవత్సరం ఏప్రిల్ 14 నుంచే కాంగ్రెస్, బీజేపీ అంబేద్కర్ వారసత్వంలో వాటా కోసం అనేక కార్యక్రమాలు నిర్వహించే హడావుడిలో ఉన్నాయి. ఈ పని చేయడానికి కాంగ్రెస్‌కు లేశమాత్రమైన అర్హత అయినా ఉండవచ్చునేమో కాని బీజేపీకి బొత్తిగా ఆ అధికారం లేదు. కాని అంబేద్కర్ 125వ జయంతిని బీజేపీతో పాటు సంఘ్ పరివార్ మహదవకాశంగా భావించి చిన్న అవకాశం కూడా వదలకుండా వినియోగించు కుంటోంది.

జాతీయోద్యమంతో చెప్పుకోదగ్గ సంబంధం లేని పక్షం ప్రస్తుతం అధికారంలో ఉంది. ఆ పక్షానికి ఇప్పుడు జరూరుగా జాతీయోద్యమంలో గత కీర్తిలో వాటా అవసరమైంది. ఒకరో ఇద్దరో ఉత్సవ విగ్రహాలు కావాల్సి వచ్చింది. దీనికోసం సంఘ్ పరివార్ రెండు పద్ధతులు అనుసరిస్తోంది. అందులో ప్రధానమైంది నవభారత నిర్మాత నెహ్రూను అపఖ్యాతి పాలు చేయడం. నెహ్రూ విరాణ్మూర్తిని కురచన చేయడం కోసం నెహ్రూ బదులు సర్దార్ పటేల్ మొదటి ప్రధాన మంత్రి అయి ఉంటే ఎంత బాగుండేది అన్న వాదన లేవదీశారు. గాంధీజీని సంఘ్ పరివార్‌కు చెందిన నథూరాం గాడ్సే హతమార్చిన తర్వాత ఆర్.ఎస్.ఎస్. మీద నిషేధం విధించడంలో సర్దార్ పటేల్ కీలక పాత్ర నిర్వహించడం కూడా సంఘ్ పరివార్ కు అభ్యంతరకరం కాలేదు. దీనికీ కారణం లేకపోలేదు. నెహ్రూ లాగా పటేల్ మతాతీత భావాలున్న వారు కాదు. పైగా అంతో ఇంతో హిందూ మతానికి అనుకూలంగా వ్యవహరించినవారే. పెద్ద గీతను చిన్న గీత చేయాలంటే మరింత పెద్ద గీత గీయడమే సంఘ్ పరివార్ పటేల్‌ను కీర్తించడంలో ఆంతర్యం.

తర్వాత అంబేద్కర్ మీద సంఘ్ పరివార్ దృష్టి పడింది. రాజ్యాంగ రచనలో అంబేద్కర్ కీలక పాత్ర పోషించారు. కాని ఆ రాజ్యాంగాన్ని ఆర్.ఎస్.ఎస్. తూలనాడిన వాస్తవాన్ని చరిత్ర తెలిసిన వారు విస్మరించలేరు. మనుస్మృతి దేశ రాజ్యాంగంగా ఉండాలని ఆర్.ఎస్.ఎస్. కోరుకున్న వాస్తవాన్నీ తోసిపుచ్చలేం. మనుస్మృతి మహిళల విషయంలో వ్యక్త చేసిన అభిప్రాయాల గురించి పట్టించుకుంటే ఎంతమంది ఆ స్మృతిని నెత్తిన పెట్టుకుంటారో అనుమానమే. మహిళల చైతన్య స్థాయి గణనీయంగా పెరిగిన ఈ దశలో అసలే మనుస్మృతిని శిరసున ధరించడం అసాధ్యం.

అంబేద్కర్ మీద టన్నులకొద్దీ ప్రేమ ఒలకబోస్తున్న వారికి రాజ్యాంగ రూపకల్పనలో ఆయన పాత్ర, ఆయన దార్శనికత, సైద్ధాంతికత కారణం కాదు. ఆయన దళితుడు కావడం ఇలాంటి వారికి బాగా కలిసొచ్చింది. అందుకే బ్రాహ్మణీకానికి కట్టుబడిన వర్గాలు అంబేద్కర్ మీద ఎన్నడూ లేని అభిమానం చూపడం ఆశ్చర్యమే కాదు జుగుప్స కలిగిస్తోంది. వారికి కావాల్సింది నిజానికి అంబేద్కర్ కాదు. ఆయన అనుచరులైన దళితులు. బహుజనులు అన్న భావన చెలామణిలోకి వచ్చినప్పటి నుంది కేవలం దళితులే కాకుండా అనేకానేక వెనుకబడిన కులాల వార్కి అంబేద్కర్ మార్గదర్శి అయ్యారు. అంబేద్కర్ ను తమ వాడని చెప్పుకుంటే బహుజనుల మద్దతు సమకూరుతుందన్న దురాశ సంఘ్ పరివార్‌లో బలంగా ఉంది. నిర్దిష్ట సామాజిక వర్గాలు, మతాలు ఓటు బ్యాంకులుగా మారడం మన రాజకీయ, సామాజిక వ్యవస్థలో పాతుకుపోయిన స్వార్థ చింతనకు పరాకాష్ఠ.

అంబేద్కర్ ప్రారంభించిన పార్టీ ఇప్పుడు లేదు. రూపాంతరం చెంది, అంబేద్కర్ సిద్ధాంతాలను అనుసరించడానికి ప్రయత్నిస్తున్న పార్టీ సైతం చీలికలు వాలికలైంది.

అంబేద్కర్ నిజానికి దళితులకు మాత్రమే నాయకుడు కాదు. అలా ప్రచారం చేయడం ఆయన వ్యక్తిత్వ హననానికి మాత్రమే

**అంబేద్కర్ 63వ వర్ధంతి ప్రత్యేక వ్యాసాలు**

ఉపకరిస్తుంది. ఆయన రాజకీయ సిద్ధాంతం ప్రస్తుతం ప్రధానంగా కనిపిస్తూ, వినిపిస్తూ ఉన్న కాంగ్రెస్ సిద్ధాంతానికి, బీజేపీ సిద్ధాంతానికి ఏ మాత్రం పొసగదు. ఒక రకంగా ఆయన రాజకీయ సిద్ధాంతం వామపక్ష ధోరణి ఒరలోనే ఒదుగుతుంది. కాని సకల అవకాశాలను జారవిడుచుకోవడంలో అపారమైన కళాకుశలతను ప్రదర్శించడంలో ఆరి తేరిన వామపక్షాలు అంబేద్కర్‌ను పట్టించుకున్న దాఖలాలు లేవు.

అంబేద్కర్ వారసత్వాన్ని సొంతం చేసుకోవడానికి బీజేపీ రాజ్యాంగ దినోత్సవం అన్న కొత్త పండగ సృష్టించింది. దానితో కూడా పెద్ద ఫలితం దక్కలేదు. రోహిత్ వేముల ఆత్మ హత్య లాంటివి అంబేద్కర్ మీద సంఘ్ పరివార్ ఒలకబోసే అభిమానంలోని డొల్ల తనాన్ని ఎండగట్టాయి. అయితే ఈ వాస్తవాన్ని అంగీకరించడానికి సంఘ్ పరివార్ సిద్ధంగా లేదు. ఎలాగైనా అంబేద్కర్ ఉత్తరదాయిత్వం తమదేనని చెప్పుకోవడానికి నానా అగచాట్లు పడుతోంది. నిజంగా అంబేద్కర్‌ను సంఘ్ పరివార్ అభిమానించేటట్టయితే నాగపూర్ లో ఆర్.ఎస్.ఎస్. సమావేశంలో చెప్పినట్టు "అందరికీ ఒకే బావి, ఒకే అంతిమ సంస్కారం, ఒకే దేవాలయం" అన్న ప్రవచనాన్ని ఆచరణ సాధ్యం చేయడానికి కృషి చేయాలి. ఆ ఛాయలే కనిపించడం లేదు. ఈ మాట గాంధీజీ 1924లోనే చెప్పినా ఇప్పటికీ అంటరానితనం, దళితుల మీద వ్యతిరేకత బుసలు కొడుతూనే ఉంది.

చరిత్రలో తమ వాటా కోసం ఆపసోపాలు పడుతున్న సంఘ్ పరివార్ అంబేద్కర్ కీర్తి కిరీటాన్ని కబళించాలన్న ఆతృతలో చరిత్రను వక్రీకరిస్తోంది. తమకు అనుకూలమైన చరిత్రను కృత్రిమంగా సృష్టించడానికి బాహాటంగా ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగానే ఆర్.ఎస్.ఎస్. వ్యవస్థాపకుడు కేశవ్ బలీరాం హెగ్డేవర్, అంబేద్కర్ మంచి మిత్రులని అంబేద్కర్ హిందూత్వను సమర్థించారని ప్రచారం చేస్తోంది. ఈ ప్రచారం కొత్తగా మొదలైంది ఏమీ కాదు. బజ్రంగ్ దళ్ అధిపతిగా పని చేసిన వినయ్ కత్యార్ 2003లోనే ఈ వాదన లేవదీశారు. హెగ్డెవర్, గోల్వాల్కర్ లాగే అంబేద్కర్ హిందురాష్ట్ర భావనను సమర్థించారని సంఘ్ పరివార్ పెద్దలు బుకాయిస్తున్నారు. అంబేద్కర్‌ను హిందుత్వ వాద సమర్థకుడిగా చిత్రించడంలో ఉన్న కుట్ర సామాన్యమైంది కాదు. "హిందూ మతం సామాజిక ఐక్యతకు పొసగదు. హిందువులు ఐక్యంగా ఉండదలచుకుంటే వారు హిందూ మతాన్ని విడనాడాలి. హిందూ మతాన్ని ఉల్లంఘించకుండా హిందువులు ఐక్యంగా ఉండడం సాధ్యం కాదు. హిందువుల ఐక్యతకు హిందూ మతమే ప్రధాన అవరోధం" అన్న వాడు అంబేద్కర్. జీవితాంతం అంబేద్కర్ హిందూత్వాన్ని, ముస్లిం లీగ్ మతతత్వ భావాలను గట్టిగా వ్యతిరేకించారు. "పాకిస్తాన్ ఆర్ ది పార్టీషన్ ఆఫ్ ఇండియా" అన్న గ్రంథంలో ఆయన మతతత్వ రాజకీయాలను తూలనాడారు.

"హిందూ రాజ్యం ఏర్పడడమే గనక వాస్తవరూపంలోకి వస్తే ఈ దేశానికి అంతకన్నా పెద్ద విపత్తు ఉండదు. స్వేచ్ఛకు, సమానత్వానికి, సౌభ్రాతృత్వానికి హిందూత్వ పెద్ద అవరోధం" అన్నది అంబేద్కర్ అభిప్రాయం. నిజానికి ఏ మతానికి చెందిన మతపరమైన పిడివాదమైనా ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అన్న భావనలతో పొసగేవి కావు. ఘర్ వాపసీని అంబేద్కర్ సమర్థించారు అన్నది కూడా కూడా నిఖార్సైన అసత్యమే.

హిందూ మతం మీద విరక్తి చెందినందువల్లనే చివరి రోజుల్లో అంబేద్కర్ బౌద్ధ మతాన్ని స్వీకరించారు. సామాజిక సమానత్వం మీద ఆశతోనే హిందువులు, ముఖ్యంగా అట్టడుగు వర్గాల వారు క్రైస్తవమతాన్నో, ఇస్లాం మతాన్నో స్వీకరించారు, స్వీకరిస్తున్నారు. ఈ క్రమం కొనసాగితే దళితులలో అధిక సంఖ్యాకులు క్రైస్తవం స్వీకరిస్తారన్నది పరివార్ ఆందోళన. అందుకే జాతీయత మీద రాద్ధాంతం సృష్టిస్తున్నారు. అంబేద్కర్ ను హిందూ మతం గాట కట్టాలని ప్రయత్నిస్తున్నారు. ❑

---

## హిందూ రాజ్యాన్ని అంబేద్కర్ అతి పెద్ద ప్రమాదంగా ఎందుకు భావించారు?

**(9వ పేజీ తరువాయి)**

ఈ అసమానత్వం ఇలా ఉండడం వల్ల వాస్తవిక స్వాతంత్ర్యం మనుగడలో ఉండలేదు. సమానత్వం, స్వాతంత్ర్యం వంటివి లేనప్పుడు సామాజిక సౌభ్రాతృత్వాన్ని ఊహించనే లేం.

కులవాద అసమానత్వం హిందుత్వకు ప్రాణం వంటిది. ఈ అంశం ఆధారంగానే ఆయన "హిందుత్వ, ప్రజాస్వామ్యం రెండు పరస్పర విరుద్ధమైన అంశాలు" అనే నిర్ధారణకు వచ్చారు.

కులపరమైన అసమానత్వం విషయంలోనైనా, దీనిని నిలిపి ఉంచడం కోసం మహిళలు వర్ణానికీ, కులానికీ ఆవల జీవిత భాగస్వామిని ఎంచుకోకుండా వారిని నియంత్రించే విషయంలో నైనా హిందువుల్లో మౌలికమైన మార్పేమీ రాలేదు.

మొత్తంగా చూస్తే, హిందువులు దేన్నైనా వదులుకుంటారు కానీ తమ మూలాధారమైన కులాన్ని మాత్రం వదులుకోరు. దీనిని నిర్మూలించకుండా ప్రజాస్వామిక సమాజాన్ని ఊహించను కూడా ఊహించలేమని అంబేద్కర్ ఆనాడే భావించారు. ❑

**బీబీసీ కోసం, 14 ఏప్రిల్ 2018**

# 2019 - అంతానికి ఆరంభం!



మందలపర్తి కిషోర్

ఈ రోజు డిసెంబర్ ఒకటో తేదీ. ఇవేళ్టితో 2019 సంవత్సరం అంతానికి తెరతీయడం మొదలవుతుంది. ఈ నెల పొడుగునా ఇంగ్లీష్ పత్రికలు "ఇయర్ ఎండర్స్" ప్రచురించడం ఓ ఆనవాయితీ. అదృష్టవశాత్తూ మనకి ఆ ఆచారం లేదు. లేనట్లయితే, ఈ పాటికి మన ప్రసార మాధ్యమాలు ఊదరగొట్టేయడం మొదలైపోయేది.

ఈ ఏడాది పొడుగునా, మహా ఘనత వహించిన మన ప్రధాన మంత్రి ఎన్నెన్ని దేశాలు తిరిగి వచ్చారో, ఎన్నెన్ని వందల కోట్ల డాలర్ల విదేశీ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుని వచ్చారో ఏకరువు పెట్టి మన ప్రాణాలు తోడేసి ఉండేవారు.

హోమ్ మంత్రి చాణక్య నీతి ప్రదర్శించి ఎందరు విద్యార్థుల మీద "రాజద్రోహం" కేసులు పెట్టించారో చాటిచెప్పి, మనల్ని చావగొట్టడం మొదలైపోయి ఉండేది!

ఇక, దేశంలో బుద్ధి మాంద్యం ఉంటే ఉండేమో కానీ, ఆర్థిక మాంద్యం మాత్రం కలికానికి కూడా లేదనీ- ఆర్థిక రంగం వాయువేగ మనోవేగాల మీద పురోభివృద్ధి సాధిస్తోందని మన తెలుగింటి కోడలమ్మ -అదేనండీ, శ్రీమతి నిర్మలా సీతారామన్- చేసే గర్జనలతో గుండెలు బేజారైపోతూ ఉండేవి.

అయినా మనకి ఉన్న ఆచారాలతోనే పళ్ళేక చస్తూ ఉంటే లేనివాటి గురించి తల్చుకుని కుంగి పోవడం ఎందుకు చెప్పండి? కాకపోతే, ఈ "ఇయర్ ఎండర్స్" గురించి ఓ చిత్రమైన విషయం చెప్పనా?

ఈ ఏడాది కాలంలో ఎందరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారో మన "ఇయర్ ఎండర్స్"లో ఎవరూ ఎప్పుడూ ప్రస్తావించరు!

ఈ ఏడాది కాలంలో బలవంతపు బ్రాహ్మణార్థం లాంటి "చై.నా" విద్యావిధానం పుణ్యమా అని ఎన్ని పసిమొగ్గలు రాలిపోయాయో "ఇయర్ ఎండర్స్" లో ఎవరూ ఎప్పుడూ చెప్పరు!

ఈ ఏడాది కాలంలో, ఎందరు ఆడపడుచులు అత్తింటి ఆరళ్లకు బలైపోయారో "ఇయర్ ఎండర్స్"లో ఎవరూ ఎప్పుడూ చెప్పరు!

ఈ ఏడాది కాలంలో, ఎందరు పారిశ్రామిక వేత్తలు ప్రభుత్వ ఆర్థిక సంస్థలకూ, బ్యాంకులకూ కుచ్చుల టోపీలు పెట్టి రెక్కలు విప్పి తుర్రుమన్నారో "ఇయర్ ఎండర్స్" లో ఎవరూ ఎప్పుడూ చెప్పరు!

ఈ ఏడాది కాలంలో, ఎన్ని పరిశ్రమలు మూతపడ్డాయో, ఎన్ని లక్షలమంది కూలిజనం పూటకూటికి కూడా నోచుకోకుండా పోయారో "ఇయర్ ఎండర్స్" లో ఎవరూ ఎప్పుడూ చెప్పరు!

ఈ ఏడాది కాలంలో, ఎన్ని విశ్వవిద్యాలయాల్లో హాస్టళ్లు మూతపడ్డాయో, ఎన్ని లక్షలమంది పేద విద్యార్థులు ముద్దకు దూరమైపోయారో "ఇయర్ ఎండర్స్" లో ఎవరూ ఎప్పుడూ చెప్పరు!

అంతెందుకు, నిన్నకాక మొన్న, నానా పాట్లూపడి సమ్మె విరమించిన ఆర్టీసీ కార్మికుల్లో ఎందరు వత్తిడికి తట్టుకోలేక- అవమానభారం దిగమింగలేక ఆహుతైపోయారో ఆ లెక్కలేవీ "ఇయర్ ఎండర్స్" లో ఎవరూ ఎప్పుడూ చెప్పరు!

నిజానికి 2019 గురించి అంతగా "ఊదరగొట్టేయ"డానికి ఏముందని అడిగేవాళ్ళు ఉంటారని నాకు తెలుసు! అడగాలి కూడాను! అలా నిలదీసి అడగడం మర్చిపోయినందువల్లనే మనమిప్పుడు ఇలా ఉన్నామని నా నమ్మకం. అంతమాత్రం చేత ఈ ఏడాది పొడుగునా మనదేశం అలలు లేని కొలనులా ప్రశాంతంగా నిద్రపోతోందని మాత్రం అనడానికి లేదు కదా!

ఏడాదంతా అలా ఉంచండి- గడిచిన నెల రోజులే తీసుకోండి!

గాంధీజీ ప్రమాదవశాత్తూ "మరణించారని" ఒడిశా ప్రభుత్వం ఒక అధికార పత్రంలో ప్రకటించిన సంగతి రచ్చకెక్కింది -నిన్నటితో ముగిసిన- నవంబర్లోనే కదా? ఎనభయ్యో పడిలో పడిన జాతిపిత గాంధీ తాతను నత్తూ రామ్ గోడ్సే అనే హిందుత్వ ఉన్మాది బాహాటంగా, బహిరంగంగా హత్యచేసిన సంగతి ఈ దేశంలో చిన్నపిల్లలకు కూడా తెలిసిపోయింది. దాన్ని జనస్మృతి లోంచి చెరిపేసే ప్రయత్నంలో భాగంగానే సదరు "అధికార ప్రచురణ" వెలువడింది. చిత్రం ఏమిటంటే ఈ ప్రచురణ జరిగిన ఒడిశాలో ఉన్నది గోడ్సే అభిమాన సంఘమైన బీజేపీ కాదు- స్వాతంత్ర్య సమరయోధుడు బిజూ పట్నాయక్ పేరిట ఏర్పరిచిన పార్టీ అక్కడ అధికారంలో ఉంది. గుడ్డి దర్బారు వెలిగించే హక్కు

☞ మిగతా 29వ పేజీలో


ఫ్రెడరిక్ ఎంగెల్స్
ద్విశత జయంతి
సందర్భంగా

# శ్రామిక వర్గ మహోపాధ్యాయుడు ఫ్రెడరిక్ ఎంగెల్స్

- వి.ఐ.లెనిన్

**ఎంతటి వివేచనా జ్యోతి అస్తమించె !**
**ఎంతటి హృదయము పరస్పందన విరమించెనహో**

1895 ఆగస్టు 5న (కొత్త కాలెండర్ ప్రకారం) ఫ్రెడరిక్ ఎంగెల్స్ లండన్‌లో మరణించాడు. తన మిత్రుడైన కార్ల్ మార్క్స్ (మరణం 1883) తరువాత ఎంగెల్సే అత్యుత్తమ పండితుడూ, నాగరిక ప్రపంచమంతటిలోని ఆధునిక శ్రామికవర్గ గురువర్యుడూ అయి వున్నాడు. విధికృతంగా కార్ల్ మార్క్సూ, ఫ్రెడరిక్ ఎంగెల్సూ పరిచయస్తులైన తరువాత యీ మిత్రులిద్దరూ తమ జీవితకాల కృషినంతనూ ఒక ఉమ్మడి ఆశయం కోసం అర్పించారు. అందుచేత శ్రామికవర్గానికి ఫ్రెడరిక్ ఎంగెల్స్ చేసిన సేవను అర్థం చేసుకోవాలంటే వర్తమాన కార్మికవర్గ ఉద్యమాభివృద్ధికి మార్క్స్ చేసిన కృషిని, ఆయన ఉపదేశాల ప్రాముఖ్యతను స్పష్టంగా తెలుసు కోవలసి వుంటుంది.


28-11-1820 05-08-1895

బూర్జువావర్గంతో పాటు అనివార్యంగా శ్రామికవర్గాన్ని కూడా సృష్టించి నిర్మాణయుతం గావించే ప్రస్తుతపు ఆర్థిక వ్యవస్థయొక్క తప్పనిసరి ఫలితమే కార్మికవర్గమూ, దాని డిమాండులూ అని నిరూపించిన ప్రప్రథమలు మార్క్సు ఎంగెల్సులే. మానవజాతిని ఇప్పుడు పీడించుతున్న చెడుగుల నుండి దానిని విముక్తి చేసేది ఎవరో కొందరు ఉదాత్త మనస్కులైన వారు సదుద్దేశంతో చేసే ప్రయత్నాలు కావనీ, సంఘటితమైన శ్రామిక వర్గపు వర్గపోరాటమేననీ వారు నిరూపించారు. సోషలిజం స్వాప్నికుల వూహాకల్పన కాదనీ, ఆధునిక సమాజంలోని ఉత్పాదక శక్తుల అభివృద్ధి యొక్క అంతిమ లక్ష్యమూ, తప్పనిసరి అయిన ఫలితమూ మాత్రమేననీ తమ శాస్త్రీయ గ్రంథాలలో ప్రప్రథమంగా వివరించి చెప్పినది మార్క్సు, ఎంగెల్సులే. ఇంతవరకు లిఖిత పూర్వకంగా నమోదు చేయబడి వున్న చరిత్ర అంతా వర్గపోరాటం యొక్క, కొన్ని సామాజిక వర్గాలు ఇతర వర్గాలపై విజయం సాధించి వారిపై సాగించిన పరిపాలనా పరంపర యొక్క చరిత్రే అయి వుంది. వర్గపోరాటానికీ, వర్గ పరిపాలనకీ పునాదులైన సొంత ఆస్తీ, అరాజక సామాజిక ఉత్పత్తీ అదృశ్యం అయేటంత వరకూ ఇది ఇలా సాగుతూనే వుంటుంది. శ్రామికవర్గ ప్రయోజనాల కోసం యీ పునాదులు నిర్మూలం అయితీరాలి. అందుచేత నిర్మాణయుతులైన కార్మికుల చైతన్యవంతమైన వర్గ పోరాటం యీ పునాదుల నిర్మూలన కోసమే సాగాలి. అంతేగాక, ప్రతి వర్గపోరాటమూ రాజకీయ పోరాటమే.

తమ విముక్తి కోసం పోరాడుతూన్న శ్రామికులందరూ మార్క్స్ ఎంగెల్స్‌ల యీ అభిప్రాయాలను నేడు అనుసరించు తున్నారు. కాని 1840 దశకంలో యీ ఇద్దరు మిత్రులూ తమ కాలపు సోషలిస్టు సాహిత్యంలోనూ, సామాజిక ఉద్యమాలలోనూ పాల్గొన్నప్పుడు వారి అభిప్రాయాలు పూర్తిగా నూతనములే. ఆ కాలంలో రాజకీయ స్వాతంత్ర్యం కోసం సాగిన పోరాటంలోనూ రాజుల, పోలీసుల, మతగురువుల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా సాగిన పోరాటంలోనూ తెలివైనవారూ, తెలివితక్కువవారూ, నిజాయితీపరులూ దగాకోరులూ, చాలామంది నిమగ్నులై వున్నప్పటికీ వారెవరూ కూడా బూర్జువావర్గ ప్రయోజనాలకూ శ్రామికవర్గ ప్రయోజనాలకూ మధ్యనున్న విరోధాన్ని తెలుసుకోలేక పోయారు. కార్మికులు ఒక స్వతంత్రమైన సామాజిక శక్తిగా ముందుకు వస్తారనే భావాన్నే వారు సహించలేకపోయేవారు. మరో వైపున, ఆ కాలపు సామాజిక వ్యవస్థ యొక్క అధర్మాన్ని గురించి రాజులకీ, పాలకవర్గాలకూ నచ్చచెప్పి ఒప్పించితే చాలుననీ, ఆపైన యీ భూగోళం మీద శాంతినీ సర్వమానవ శ్రేయస్సునూ నెలకొల్పడం తేలిక అవుతుందనీ కలలుగన్న స్వాప్నికులు అనేకులు, వారిలో కొందరు ప్రతిభావంతులు కూడా వుండేవారు. పోరాటం లేకుండానే సోషలిజాన్ని సాధించవచ్చునని వారు కలలు గన్నారు. కడపటిగా, ఆ కాలపు సోషలిస్టులూ, కార్మికవర్గ మిత్రులూ దాదాపు అందరూ కూడా మొత్తం మీద శ్రామికవర్గాన్ని కేవలం ఒక వ్రణం లాగ భావిస్తూ, పరిశ్రమాభివృద్ధినీ శ్రామికవర్గాభివృద్ధినీ నిలిపి వేయడం చరిత్ర చక్రాన్ని" ఆపివేయడం ఎలాగా అని ప్రయత్నాలు చేశారు.

శ్రామికవర్గ అభివృద్ధిని చూసి అందరిలాగ మార్క్స్, ఎంగెల్స్‌లు భయపడలేదు: తద్భిన్నంగా వారు తమ ఆశలన్నిటినీ శ్రామికవర్గ నిరంతరాభివృద్ధి మీద పెట్టుకున్నారు. శ్రామికుల సంఖ్య ఎంత ఎక్కువగా పెరిగితూ విప్లవకరవర్గంగా వారి శక్తి అంత ఎక్కువ అవుతుందనీ, సోషలిజం అంత దగ్గర పడుతుందనీ, అందుకు అంత ఎక్కువ సదవకాశం ఏర్పడుతుందనీ వారు విశ్వసించారు. కార్మికవర్గానికి మార్క్స్ ఎంగెల్స్‌లు చేసిన సేవలను కొద్ది మాటలలో చెప్పాలంటే ఇలా అనవచ్చు: కార్మికవర్గం తన్ను తాను తెలుసుకుని చైతన్యవంతం కావడం ఎలాగో వారు బోధించారు, స్వప్నాల స్థానంలో విజ్ఞానశాస్త్రాన్ని నెలకొల్పారు.

అందుకనే ప్రతి కార్మికునికీ ఎంగెల్స్ పేరూ, ఆయన జీవిత చరిత్రా తెలియాలి. అందుకనే యీ వ్యాసావళిలో, మన అన్ని యితర ప్రచురణలాగనే రష్యన్ కార్మికులలో వర్గ చైతన్యాన్ని మేల్కొల్పడమే లక్ష్యం గనుక, ఆధునిక శ్రామికవర్గం యొక్క ఇద్దరు మహోపాధ్యాయులలోనూ ఒకడైన ఫ్రెడరిక్ ఎంగెల్స్ జీవిత చరిత్రనూ, ఆయన చేసిన కృషిని తెలియజేయడం మన విధాయకం.

ఎంగెల్స్ 1820లో ప్రష్యా రాజ్యంలోని రైన్ రాష్ట్రంలో బార్మెన్ నగరంలో జన్మించాడు. ఆయన తండ్రి ఒక కార్ఖానా యజమాని. కుటుంబ పరిస్థితుల మూలంగా ఎంగెల్స్ 1838లో తన హైస్కూలు విద్యను పూర్తిచేయకుండానే బ్రేమెన్‌లో ఒక వాణిజ్య సంస్థలో గుమాస్తాగా చేరవలసి వచ్చింది. ఎంగెల్స్ విజ్ఞానశాస్త్ర, రాజకీయ అధ్యయనం కొనసాగించడానికి ఆయన వ్యాపార కార్యకలాపాలు అడ్డురాలేదు. ఆయన హైస్కూలు విద్య నభ్యసించే రోజులలోనే నిరంకుశ పరిపాలననూ, అధికారుల ప్రజా పీడనను ద్వేషించేవాడు. తత్వశాస్త్రాధ్యయనం ఆయనను మరింత ముందుకు తీసుకుపోయింది. ఆ రోజులలో హెగెల్ ఉపదేశాలకు జర్మన్ తత్వశాస్త్రంలో ఎక్కువ ప్రాబల్యం వుండేది. ఎంగెల్స్ ఆయనకు అనుచరుడయ్యాడు. హెగెల్ బెర్లిన్ విశ్వవిద్యాలయంలో ఆచార్యుడుగా ప్రష్యన్ కొలువులో పనిచేస్తూ ప్రష్యన్ నిరంకుశ రాజ్యాన్ని మెచ్చుకుంటున్నప్పటికీ ఆయన ఉపదేశాలు విప్లవాత్మకమైనవిగానే వుండేవి. మానవ హేతువాత సామర్థ్యం మీదా, దాని హక్కుల మీద హెగెల్‌కున్న విశ్వాసమూ, జగత్తు నిరంతర మార్పు క్రమానికీ, అభివృద్ధికీ గురి అవుతోందనే హెగెలియన్ తత్వశాస్త్రపు మౌలిక సూత్రమూ యీ బెర్లిన్ ఆచార్యుని శిష్యులలో కొంతమందిలో– ఆనాటి పరిస్థితికి తలఒగ్గ నిరాకరించే వారిలో – పరిస్థితికి వ్యతిరేకంగా పోరాడడం, ఆనాడు ప్రబలివున్న అన్యాయానికీ, దుర్మార్గానికీ వ్యతిరేకంగా పోరాడడం అనేది కూడా నిరంతరాభివృద్ధి అనే విశ్వవ్యాప్త నియమంలోనే వేరూని వుందనే భావం కలిగించాయి. జగత్తులో అన్నీ క్రమాభివృద్ధినే పొందవలసి వున్నప్పుడు, పాత సంస్థలు పోయి కొత్తవాటికి చోటిచ్చి తీరవలసి నప్పుడు ప్రష్యన్ రాజుయొక్క లేదా రష్యన్ జార్ యొక్క నిరంకుశ పరిపాలనా, అత్యధిక సంఖ్యాకుల పొట్టలు కొట్టి అత్యల్ప సంఖ్యాకులు ధనవంతులు కావడం, లేదా ప్రజలపై బూర్జువా వర్గపు ఆధిపత్యమూ శాశ్వతంగా ఎందుకు కొనసాగాలి? హెగెల్ తత్వశాస్త్రం మనస్సుయొక్క, భావాలయొక్క క్రమాభివృద్ధిని గురించి చెప్పింది; అది భావవాదాత్మకం. మనస్సు యొక్క క్రమాభివృద్ధిని బట్టి ప్రకృతి యొక్క, మానవునియొక్క, మానవ, సామాజిక సంబంధాల యొక్క క్రమాభివృద్ధిని హెగెల్ తత్వశాస్త్రం నిర్ధారణ చేసింది. హెగెల్ తత్వశాస్త్రంలోని నిరంతర క్రమాభివృద్ధి భావాన్ని అంగీకరించుతూ మార్క్స్ ఎంగెల్స్‌లు ఆయన ముందుగానే ఏర్పరచుకున్న భావవాద అభిప్రాయాలను తోసిపుచ్చారు; మానవ జీవిత విషయంలో ప్రకృతి యొక్క అభివృద్ధిని వివరించేది మనస్సు యొక్క అభివృద్ధి కాదనీ, తద్భిన్నంగా మనస్సుయొక్క వివరణను ప్రకృతి నుంచే, పదార్థం నుంచే పొందవలసి వుంటుందని తెలుసుకున్నారు. హెగెల్ లాగా, ఇతర హెగెలియన్ల లాగా కాకుండా మార్క్స్ ఎంగెల్స్‌లు భౌతికవాదులు, ప్రపంచాన్నీ మానవాళినీ భౌతికవాద దృష్టితో పరిశీలించి చూసి, ప్రకృతిలో జరిగే సంఘటనలన్నిటికీ భౌతిక కారణాలే మూలాధారాలనీ, అలాగే మానవ సమాజ అభివృద్ధి కూడా భౌతిక శక్తులచే, ఉత్పాదక శక్తులచే నిర్దేశింపబడుతోందనీ వారు గ్రహించారు. మానవ అవసరాలను తీర్చుకునేటందుకు కావలసిన వస్తువులను ఉత్పత్తి చేసుకోడంలో మనుషులు ఒకరితో ఒకరు ఏర్పరచుకునే సంబంధాలు ఉత్పాదక శక్తుల అభివృద్ధి మీద ఆధారపడి వుంటాయి. ఈ సంబంధాలలోనే అన్ని సామాజిక జీవిత సంఘటలనకూ ఆశయాలకూ, భావాలకూ, నియమాలకూ వివరణ ఇమిడి వుంది. ఉత్పాదక శక్తుల అభివృద్ధి సొంత ఆస్తిపై ఆధారపడిన సామాజిక సంబంధాలను సృష్టిస్తుంది, కాని యీ ఉత్పాదక శక్తుల అభివృద్ధే అధిక సంఖ్యాకులకు ఆస్తి లేకుండా చేసి, దాన్ని అత్యల్ప సంఖ్యాకుల చేతులలో సాంద్రీకరిస్తుంది. అది ఆధునిక సామాజిక వ్యవస్థకు ప్రాతిపదిక అయిన సొంత ఆస్తిని రద్దుచేసి సోషలిస్టులు పెట్టుకున్న గమ్యం దిశగానే అది కూడా పాటుపడుతుంది. సోషలిస్టులు చేయవలసినదంతా ఏమిటంటే, ఏ సామాజిక శక్తి, ఆధునిక సమాజంలో దానికున్న స్థానాన్ని బట్టి, సోషలిజాన్ని తీసుకురావడం పట్ల ఆసక్తి కలిగి

ఫ్రెడరిక్ ఎంగెల్స్
ద్విశత జయంతి
సందర్భంగా

**ఫ్రెడరిక్ ఎంగెల్స్ ద్విశత జయంతి సందర్భంగా**

వుందో గుర్తించి ఆ శక్తికి దాని ప్రయోజనాలను గురించిన, దాని చారిత్రక కర్తవ్యం గురించిన చైతన్యాన్ని కలుగజేయడం. ఈ సామాజిక శక్తి శ్రామికవర్గమే. ఇంగ్లీషు పారిశ్రామిక కేంద్రం అయిన మాంచెస్టర్‌లో తన తండ్రి భాగస్వామిగా వున్న వ్యాపార సంస్థలో 1842లో ఉద్యోగిగా చేరి స్థిరపడినప్పుడు ఇంగ్లండులో ఎంగెల్స్‌కు శ్రామికవర్గంతో పరిచయం ఏర్పడింది. ఇక్కడ ఎంగెల్స్ ఫ్యాక్టరీ ఆఫీసులో కూర్చుని పనిచేయడమే గాక కోళ్ల గూళ్లలో కోళ్లలాగా కూరబడి వుండే కార్మికుల మురికి పేటలలో తిరుగుతూ వారి దారిద్ర్యాన్నీ, దౌర్భాగ్యజీవితాన్నీ కళ్లారా చూశాడు. కాని ఆయన తన సొంత పరిశీలనలకే పరిమితపడి వుండలేదు, బ్రిటిషు కార్మికవర్గం గురించి తాను చూసినదాన్నంతటినీ గురించి పుస్తకాల్లో చదివి, తనకి దొరికిన ప్రభుత్వ ప్రచురణలనన్నిటినీ శ్రద్ధగా అధ్యయనం చేశాడు. ఆయన చేసిన అధ్యయనం, జరిపిన పరిశీలనల ఫలితమే 1845లో "ఇంగ్లండులో కార్మికవర్గ స్థితి" అనే గ్రంథం. "ఇంగ్లండులో కార్మికవర్గ స్థితి" అనే గ్రంథాన్ని రచించడంలో ఎంగెల్స్ చేసిన గొప్ప సేవ ఏమిటో ఇదివరకే పేర్కొన్నాం. ఎంగెల్స్‌కు పూర్వమే చాలామంది శ్రామికవర్గం పడుతున్న బాధలను వర్ణించి దానికి సహాయపడవలసిన అవసరాన్ని గురించి వ్రాశారు. అయితే, శ్రామికవర్గం బాధలను అనుభవించుతున్న వర్గం మాత్రమే కాదని మొట్టమొదటి సారిగా చెప్పినవాడు ఎంగెల్స్; వాస్తవంలో సిగ్గుచేటైనా యీ ఆర్థిక దుస్థితే శ్రామికవర్గాన్ని నిరాఘాటంగా ముందుకు నడిపి తన అంతిమ విముక్తి కోసం పోరాడేటట్టు చేసి తీరుతుందని చెప్పాడు. అంతేకాక పోరాడే శ్రామికవర్గం స్వయం సహాయం మీదనే ఆధార పడుతుంది. కార్మికవర్గపు రాజకీయ ఉద్యమం, ఒక్క సోషలిజం లోనే తమకు విముక్తి వుందని కార్మికులు గ్రహించేటట్లు తప్పని సరిగా చేస్తుంది. మరో వైపున ఎప్పుడైతే సోషలిజం కార్మికవర్గపు రాజకీయ పోరాట లక్ష్యం అవుతుందో అప్పుడే సోషలిజం ఒక శక్తి అవుతుంది. ఇంగ్లండులోని కార్మికవర్గపు స్థితిని గురించి ఎంగెల్స్ రచించిన గ్రంథంలో వెల్లడించబడిన ముఖ్యమైన అభిప్రాయాలు అని. యోచనాపరులైన, పోరాటం సాగించుతూన్న శ్రామికులందరూ ఇప్పుడు అనుసరించుతున్న భావాలు, కాని ఆ రోజులలో అవి పూర్తిగా నూతనమైనవి. మనస్సును ఆకర్షించే శైలిలో వ్రాయబడిన, ఇంగ్లీషు శ్రామికవర్గ దుస్థితిని అత్యంత ప్రామాణికంగానూ హృదయవిదారకంగానూ చిత్రించిన ఆ గ్రంథంలో యీ భావాలు వివరించబడ్డాయి. ఈ గ్రంథం పెట్టుబడి దారీ విధానంపైన, బూర్జువావర్గం పైన ఒక ఘోరమైన నేరారోపణ పత్రమని చెప్పాలి. అది అందరిపైన ప్రగాఢమైన ప్రభావం కలిగించింది. ఆధునిక శ్రామికవర్గ పరిస్థితిని వివరంగా చిత్రించిన పుస్తకంగా అందరూ ఎంగెల్స్ వ్రాసిన యీ గ్రంథాన్నే ఉదహరిస్తూ వుండేవారు. వాస్తవానికి 1845కు ముందుగాని ఆ తరువాత గాని కార్మికవర్గ దౌర్భాగ్యస్థితిని ఇంత అద్భుతంగానూ యథార్థం గానూ చిత్రించిన గ్రంథం మరోటి వెలువడలేదు.

ఎంగెల్స్ ఇంగ్లండుకు వచ్చిన తరువాతనే సోషలిస్టు అయ్యాడు. మాంచెస్టర్‌లో ఆ రోజులలో ఇంగ్లీషు కార్మికోద్యమంలో చురుకుగా పనిచేస్తూ వుండిన వారితో ఆయన సంబంధాలు పెట్టుకుని ఇంగ్లీషు సోషలిస్టు పత్రికలకు వ్యాసాలు వ్రాయడం మొదలుపెట్టాడు. 1844లో ఆయన జర్మనీకి తిరిగి వెడుతున్నప్పుడు పారిస్‌లో మార్క్స్‌తో పరిచయం కలిగింది, అయితే అంతకు ముందునుంచే ఆయన మార్క్స్‌తో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతూ వుండేవాడు. పారిస్‌లో వుండేటప్పుడు ఫ్రెంచి సోషలిస్టుల యొక్క, ఫ్రెంచి జీవితంయొక్క ప్రభావంతో మార్క్సు కూడా సోషలిస్టు అయ్యాడు. పారిస్‌లో యీ మిత్రులిద్దరూ కలిసి పవిత్ర కుటుంబం లేక విమర్శనాత్మక విమర్శయొక్క విమర్శ" అనే గ్రంథాన్ని రచించాడు. "ఇంగ్లండులో కార్మికవర్గ స్థితి" అనే గ్రంథం వెలువడడానికి ఒక ఏడాది ముందే వెలువడిన, అత్యధిక భాగం మార్క్సు చేతనే రచింపబడిన యీ గ్రంథంలో మేము పైన వివరించిన విప్లవాత్మక భౌతికవాద సోషలిజం యొక్క మూలాధారాలూ, ప్రధానమైన భావాలూ వున్నాయి. "పవిత్ర కుటుంబం" అనేది తత్వశాస్త్రజ్ఞులైన బౌవర్ సోదరులకూ, వారి అనుచరులకూ మార్క్సు ఎంగెల్స్‌లు పెట్టిన వేళాకోళపు పేరు వాస్తవికతకూ, పార్టీలకూ, రాజకీయాలకూ అతీతమైన, ప్రత్యక్ష కార్యాచరణను తోసిపుచ్చి, చుట్టూ వున్న ప్రపంచాన్నీ, దానిలో జరిగే ఘటనలనూ కేవలం "విమర్శనాత్మకంగా" ధ్యానిస్తూ వుండే విమర్శ పద్ధతిని యీ పెద్ద మనుషులు బోధించారు. ఈ పెద్ద మనుషులు, బౌవర్ సోదరులు, శ్రామికవర్గాన్ని విమర్శనాజ్ఞానం లేని మూక కింద జమకట్టి దానిపై చిన్న చూపు చేసేవారు. అసందర్భమైన హానికరమైన యీ పోకడను మార్క్సు ఎంగెల్స్‌లు తీవ్రంగా వ్యతిరేకించారు. వాస్తవమైన మానవ వ్యక్తి తరఫున – పాలక వర్గాలయొక్క రాజ్యాంగయంత్రం యొక్క పాదాల కింద పడి నలిగిపోతున్న కార్మికుని తరఫున చేయవలసింది ధ్యానం కాదు, ఉత్తమ సామాజిక వ్యవస్థ కోసం పోరాటం అని వారు గట్టిగా కోరారు. ఈ పోరాటాన్ని సాగించే సామర్థ్యం గలిగివున్న శక్తీ, ఆ పోరాటం పట్ల శ్రద్ధాసక్తులు కలిగివున్న శక్తీ శ్రామికవర్గమే

నని వారు పరిగణించారు. "పవిత్ర కుటుంబం" అనే గ్రంథం వెలువడడానికి ముందే మార్క్స్, రూగెల సంపాదకత్వం క్రింద ప్రచురింపబడుతుండిన "జర్మన్ ఫ్రెంచి ఐతిహాసిక వార్షిక సంచిక" అనే పత్రికలో ఎంగెల్స్ "అర్థశాస్త్రంపై విమర్శనాత్మక వ్యాసాలు" వ్రాశాడు. వాటిలో సమకాలీన ఆర్థిక వ్యవస్థలోని ప్రధాన విషయాలను సోషలిస్టు దృక్పథం నుంచి పరిశీలించి అవి సొంత ఆస్తి చలాయించే అధికారపు తప్పనిసరి పర్యవసానాలేనని చెప్పాడు. ఏ శాస్త్రంలో అయితే మార్క్స్ రచించిన గ్రంథాలు నిజంగా ఒక విప్లవాన్ని తీసుకువచ్చాయో, ఆ అర్థశాస్త్రాన్ని అధ్యయనం చేయాలనే నిర్ణయానికి మార్క్స్ రావడానికి ఎంగెల్స్‌తో ఆయనకు ఏర్పడిన పరిచయమే ఒక ప్రబలమైన కారణమని నిస్సందేహంగా చెప్పవచ్చు.

ఎంగెల్స్, 1845 నుంచి 1847 వరకూ బ్రస్సెల్స్‌లోనూ, పారిస్‌లోనూ నివసిస్తూ తన విజ్ఞానశాస్త్ర అధ్యయనాన్ని బ్రస్సెల్స్‌లోని, పారిస్‌లోని, జర్మన్ కార్మికుల మధ్య కొనసాగించే ప్రత్యక్ష కార్యకలాపాలతో మిళితం చేస్తూ జీవించాడు. అక్కడే మార్క్స్ ఎంగెల్స్‌లు రహస్యంగా పనిచేసే జర్మన్ కమ్యూనిస్టు లీగుతో సంబంధాలు ఏర్పరచుకున్నారు. అప్పటికే వారు రూపొందించిన సోషలిజం ప్రధాన సూత్రాలను వివరించ వలసిందిగా వారిని ఆ లీగు కోరింది. 1848లో ప్రచురించబడిన ఈ చిన్న పుస్తకం ఎన్నో ఉద్గ్రంథాలకు సరిసమానమైనది: ఈ నాటికీ దాని భావమే నాగరిక ప్రపంచమంతటా సంఘటితమైన పోరాటం సాగించుతూన్న శ్రామికవర్గం యావత్తునూ ఉత్తేజపరచి నడుపుతూ వుంది.

మొదట ఫ్రాన్సులో ఆరంభమై ఆ తరువాత ఇతర పశ్చిమ యూరప్ దేశాలకు వ్యాపించిన 1848 విప్లవం మూలంగా మార్క్స్ ఎంగెల్స్ తమ స్వదేశానికి తిరిగి వచ్చారు. ఇక్కడ, ప్రష్యా రాజ్యపు రైన్ రాష్ట్రంలోని కొలోన్ పట్టణంలో ప్రచురిపబడుతూండిన ప్రజాస్వామ్య పత్రిక "నోయె రైనిషె సైటుంగ్"ను నడపడానికి పూనుకున్నారు. ఆనాడు ప్రష్యా రాజ్యపు రైన్ రాష్ట్రంలో విజృంభించిన విప్లవాత్మక ప్రజాస్వామిక ఆశయాలన్నిటికీ యీ ఇద్దరు మిత్రులూ ఆయువు పట్టుగానూ గుండెకాయగానూ వుండేవారు. అభివృద్ధి నిరోధక శక్తులకు వ్యతిరేకంగా ప్రజల స్వాతంత్ర్యాన్నీ ప్రయోజనాలనూ కాపాడేందుకు వారు కడపటి వరకూ పోరాడారు. అందులో అభ్యుదయ నిరోధక శక్తులచే పైచేయి అవడం మనకు తెలిసిన సంగతే. "నోయె రైనిషె సైటుంగ్" పత్రిక అణచివేయబడింది. ప్రవాసజీవితంలో వున్నప్పుడు తన ప్రష్యన్ పౌరసత్వాన్ని కోల్పోయినందువల్ల మార్క్స్ దేశం నుంచి వెళ్లగొట్టబడ్డాడు. ఎంగెల్సు సాయుధ ప్రజా తిరుగుబాటులో పాల్గొని, స్వేచ్ఛ కోసం మూడు యుద్ధాలలో పోరాడి, తిరుగుబాటుదార్లు ఓడిపోయిన తరువాత స్విట్జర్లాండ్ మీదుగా లండన్‌కు పారిపోయాడు.

ఫ్రెడరిక్ ఎంగెల్స్
ద్విశత జయంతి
సందర్భంగా

అప్పటికి మార్క్స్ కూడా లండన్‌లో స్థిరపడ్డాడు. ఎంగెల్స్ మాంచెస్టర్‌కు వెళ్లి 1840 దశకంలో తాను పనిచేసిన వ్యాపార సంస్థలో తిరిగి గుమాస్తాగా చేరి ఆ తరువాత దానిలో భాగస్వామి అయ్యాడు. 1870 వరకూ ఆయన మాంచెస్టర్‌లో నివసించాడు, మార్క్స్ లండన్‌లో వుండేవాడు, అయినప్పటికీ వారిద్దరూ తమ తమ భావాలను పరస్పరం తెలియజేసుకుంటూ వుండడానికి ఇదేమీ ప్రతిబంధకం కాలేదు: వారు దాదాపు ప్రతిరోజూ ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుకుంటూ వుండేవారు. ఈ ఉత్తరప్రత్యుత్తరాలలో యీ పాతమిత్రులిద్దరూ తమ తమ అభిప్రాయాలనూ, కొత్తగా తెలుసుకున్న విషయాలనూ పరస్పరం తెలియజేసుకుంటూ శాస్త్రీయ సోషలిజాన్ని రూపొందించే కృషిలో సహకరించుకుంటూ వుండేవారు. 1870లో ఎంగెల్స్ లండన్‌కు మారాడు. అత్యంత శ్రమతోనూ పట్టుదలతోనూ కూడిన వారి సంయుక్త వైజ్ఞానిక కృషి 1883లో మార్క్స్ మరణించేటంతవరకూ కొనసాగింది. మార్క్స్ వంతుకు మన యుగంలో అర్థశాస్త్రంపై రచింపబడిన మహోత్కృష్టమైన గ్రంథం, "పెట్టుబడి," ఎంగెల్స్ వంతుకు ఆయన రచించిన అనేక చిన్నా, పెద్దా గ్రంథాలూ ఈ సమిష్టి కృషి ఫలితమే. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ యొక్క సంక్లిష్ట విషయాల విశ్లేషణపై మార్క్సు కృషి చేశాడు. ఎంగెల్స్ తన సులభశైలి రచనలలో తరచు వాదవివాద స్వభావం గల విషయాలను గురించీ, సర్వసాధారణ శాస్త్రీయ సమస్యల గురించి, భూత వర్తమాన కాలాలకు వివిధ సంఘటనలను చారిత్రక భౌతికవాద భావనా దృక్పథం నుంచీ మార్క్సిస్టు ఆర్థిక సిద్ధాంత దృక్పథం నుంచీ పరిశీలించుతూనూ వ్రాశాడు. ఎంగెల్స్ రచనలలో కొన్నింటిని యీ క్రింద పేర్కొంటున్నాం: డ్యూరింగును ఖండిస్తూ రచించిన వాదవివాద గ్రంథం. (ఇందులో తర్కశాస్త్ర, ప్రకృతిశాస్త్ర, సామాజిక శాస్త్ర రంగాలలో అత్యంత ప్రాముఖ్యం గల సమస్యలు పరిశీలింప బడ్డాయి) "కుటుంబం, సొంత ఆస్తి, రాజ్యాంగాల పుట్టుక" (రష్యన్ భాషలోకి అనువదింపబడి సెంట్ పీటర్స్‌బర్గ్‌లో ప్రచురింప బడింది. మూడవ కూర్పు, 1895), "లుడ్విగ్ ఫాయెర్‌బాన్" (జి. ప్లెహనొవ్‌చే వివరణ సహితమైన రష్యన్ అనువాదం, జినీవా, 1892), రష్యన్ ప్రభుత్వ విదేశాంగ విధానంపై ఒక వ్యాసం (జినీవాలో "సోత్సియాల్ డెమొక్రాట్" పత్రిక 1, 2 సంచికలలో రష్యన్ అనువాదం ప్రచురింపబడింది), గృహ వసతి సమస్యపై

**ఫ్రెడరిక్ ఎంగెల్స్ ద్విశత జయంతి సందర్భంగా**

రచించిన అద్భుతమైన వ్యాసాలు, ఇక ఆఖరున పేర్కొనబడినవి, చిన్నవైనా అత్యంత విలువైన రెండువ్యాసాలు, రష్యా ఆర్థికాభివృద్ధిని గురించి వ్రాసినవి ("రష్యాను గురించి ఫ్రెడరిక్ ఎంగెల్స్" జమాలివ్‌చే రష్యన్ భాషలోకి అనువదించ బడ్డాయి, జినీవా, 1894). పెట్టుబడిపై తాను రచించిన బృహద్గ్రంథం తుది మెరుగులు దిద్దే లోపలనే మార్క్స్ తన మిత్రుని మరణానంతరం "పెట్టుబడి" గ్రంథం రెండవ, మూడవ సంపుటాలను ముద్రణకు సిద్ధం చేసి ప్రచురించే అతిభారమైన కర్తవ్యాన్ని చేపట్టాడు. రెండవ సంపుటిని 1885లోనూ, మూడవ సంపుటిని 1894లోనూ ప్రచురించాడు. (నాల్గవ సంపుటిని24 ప్రచురణకు సిద్ధంచేసే లోపునే ఎంగెల్స్ మరణించాడు.) రెండవ, మూడవ సంపుటాలను ప్రచురించడానికి ఆయన ఎంతో శ్రమపడవలసి వచ్చింది. ఆస్ట్రియన్ సోషల్ డెమొక్రట్ అయిన ఆడ్లర్ యీ విషయాన్ని గురించి ప్రస్తావిస్తూ, ఎంగెల్స్ "పెట్టుబడి" గ్రంథం రెండవ మూడవ సంపుటాలను ప్రచురించడం ద్వారా ప్రతిభాశాలి అయిన తన మిత్రునికి ఒక మహనీయమైన జ్ఞాపకచిహ్నాన్ని నిర్మించి దానిపై అనుకోకుండానే తన పేరును చిరస్థాయిగా మలచుకున్నాడు అని ఎంతో సమంజసంగా పేర్కొన్నాడు. నిజానికి "పెట్టుబడి" గ్రంథం యొక్క యీ రెండు సంపుటాలూ ఇద్దరు వ్యక్తుల – మార్క్స్, ఎంగెల్స్‌ల – రచన. పురాతన గాథలలో స్నేహాన్ని గురించి మనస్సు కరిగించే దృష్టాంతాలు అనేకం వున్నాయి. మానవ మైత్రిని గురించిన ప్రాచీన సాహిత్యంలోని అత్యంత మనోద్వేగజనక గాథలను మించిన స్నేహబంధం గల ఇద్దరు పండితులూ, యోధులూ తన శాస్త్రాన్ని సృష్టించారని యూరపియన్ శ్రామికవర్గం సగర్వంగా చెప్పుకోవచ్చు. ఎంగెల్స్ ఎల్లప్పుడూ మొత్తం మీద ఎంతో సబబుగా –ముందు మార్క్స్ పేరు చెప్పి, తరువాత తన పేరు చెప్పుకునేవాడు. ఒక పాత స్నేహితునికి వ్రాసిన ఒక ఉత్తరంలో ఎంగెల్స్ ఇలా అన్నాడు: "మార్క్స్ జీవించి వున్న రోజులలో నేను ఆయనకు వంతగానే వుండేవాణ్ణి." మార్క్స్ బ్రతికి వున్నప్పుడు ఆయన మీద ఎంగెల్స్‌కు వున్న ప్రేమ, మార్క్స్ చనిపోయిన తరువాత ఆయన మీద ఎంగెల్స్ చూపిన భక్తిగౌరవాలూ అపారములు. నిశ్చలుడైన ఈ యోధునిలో, నిష్ఠాపరుడైన యీ తాత్వికునిలో అత్యంత ప్రేమపూరితమైన హృదయం స్పందించుతూ వుండేది.

1848–49 ఉద్యమానంతరం ప్రవాసంలో వున్న కాలంలో మార్క్స్ ఎంగెల్స్‌లు శాస్త్ర పరిశోధనకే పరిమితపడి వుండలేదు. 1864లో మార్క్స్ "అంతర్జాతీయ కార్మిక సంఘాన్ని" స్థాపించి పూర్తి దశాబ్ద కాలం దానికి నాయకత్వం వహించాడు. ఈ సంఘ కార్యకలాపాలలో ఎంగెల్స్ కూడ చురుకుగా పాల్గొన్నాడు. మార్క్స్ అభిప్రాయాన్ని అనుసరించి అన్ని దేశాల శ్రామికులను ఐక్యపరచిన యీ అంతర్జాతీయ సంఘం చేసిన కృషి కార్మికవర్గ ఉద్యమాభివృద్ధిలో బ్రహ్మాండమైన ప్రాధాన్యత వహించదు. 1870 దశకంలో యీ అంతర్జాతీయ సంఘం మూతపడినప్పటికీ కార్మికవర్గ ఐక్యతను సాధించడంలో మార్క్స్ ఎంగెల్స్‌ల పాత్ర అంతటితో ముగిసిపోలేదు. తద్భిన్నంగా, కార్మికోద్యమమే నిరాఘాటంగా అభివృద్ధి చెందడం మూలంగా, కార్మికవర్గ ఉద్యమ ఆధ్యాత్మిక నాయకులుగా వారి ప్రాముఖ్యత నిరంతరాయంగా పెరుగుతూనే వుందని చెప్పాలి. మార్క్స్ మరణానంతరం ఎంగెల్స్ ఒక్కడే యూరపియన్ సోషలిస్టులకు సలహాదారుడుగానూ, నాయకుడుగానూ కొనసాగాడు. ప్రభుత్వం క్రూర నిర్బంధ విధానాన్ని అమలు జరిపినప్పటికీ త్వరితంగానూ నిలకడగానూ మరింత పటిష్టం అవుతూ వున్న జర్మన్ సోషలిస్టులే గాక, బాగా ఆలోచించి ఆచితూచి తమ తొలి అడుగులు వేయవలసిన స్పెయిన్, రుమేనియా, రష్యాలాంటి వెనుకబడివున్న దేశాల ప్రతినిధులు కూడా సలహా కోసమూ, ఆ దేశాల కోసమూ ఆయన వద్దకు వస్తూవుండేవారు. వారందరూ వయోవృద్ధుడైన ఎంగెల్స్ యొక్క మహత్తర జ్ఞాననిధిని ధారాళంగా వినియోగించుకునేవారు.

రష్యన్ భాష తెలిసి రష్యన్ గ్రంథాలను చదవగలిగిన మార్క్స్ ఎంగెల్స్‌లు రష్యా పట్ల చురుకైన ఆసక్తిని చూపుతూ, ఆ దేశ విప్లవోద్యమాన్ని సానుభూతితో గమనిస్తూ, రష్యన్ విప్లవకారులతో సంబంధాలను నెలకొల్పుకుంటూ వుండేవారు. వారిద్దరూ ముందు ప్రజాతంత్రవాదులై ఆ తర్వాత సోషలిస్టులయారు. అందుచేత రాజకీయ నిరంకుశత్వంపై ప్రజాతంత్రవాదులకుండే ద్వేషం వారిలో అత్యంత గాఢంగా నాటుకుని వుంది. ఈ ప్రత్యక్ష రాజకీయ అనుభూతీ, దానితో పాటు రాజకీయ నిరంకుశత్వానికీ ఆర్థిక పీడనకూ గల సంబంధం గురించిన ప్రగాఢమైన సైద్ధాంతిక అవగాహనా, వారికున్న విశేష జీవితానుభవమూ వీటన్నిటి మూలంగా మార్క్స్ ఎంగెల్స్‌లు రాజకీయంగా అసాధారణమైన ప్రతిస్పందనను ప్రదర్శించారు. ఈ కారణం వల్లనే అత్యంత శక్తివంతమైన జార్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పట్టెడుమంది రష్యన్ విప్లవకారులు సాగించే వీరోచిత పోరాటం కాకలు తీరిన యీ విప్లవయోధుల హృదయాలలో అత్యంత గాఢమైన సానుభూతిని రేకెత్తించింది. మరోవైపున, భ్రమాజనితములైన ఆర్థిక లాభాల కోసం ఆశపడి అత్యంత తక్షణ కర్తవ్యమూ, ప్రధాన కర్తవ్యమూ అయిన రాజకీయ స్వాతంత్ర్య సాధన పట్ల పెడముఖం పెట్టే రష్యన్ సోషలిస్టుల వైఖరి వారికి సహజంగానే అనుమానాస్పద

వైనదిగా కనబడింది. వారు దానిని మహత్తర సామాజిక విప్లవోద్యమానికి ప్రత్యక్ష ద్రోహంగా పరిగణించారు. "కార్మిక విమోచనను కార్మికవర్గమే సాధించాలి" అని మార్క్స్ ఎంగెల్స్‌లు నిరంతరం బోధించుతూ వుండేవారు. కాని తన ఆర్థిక విమోచన కోసం పోరాడాలంటే శ్రామికవర్గం కొన్ని రాజకీయ హక్కులను తానే గెల్చుకోవలసి వుంటుంది. అంతేగాక రష్యాలో రాజకీయ విప్లవం సంభవిస్తే అది పాశ్చాత్య యూరపియన్ దేశాల కార్మికోద్యమానికి కూడా మహత్తర ప్రాముఖ్యతను కలిగి వుంటుందని మార్క్స్ ఎంగెల్స్‌లు స్పష్టంగా గ్రహించారు. నిరంకుశ పాలనను సాగిస్తున్న రష్యా మొత్తం మీద యూరపియన్ అభివృద్ధి నిరోధక శక్తులకు ఎల్లప్పుడూ ఒక రక్షణ దుర్గంగా వుంటూవుంది. దీర్ఘ కాలంగా జర్మనీ ఫ్రాన్సుల మధ్య వైషమ్య బీజాలను నాటిన 1870 యుద్ధం ఫలితంగా అంతర్జాతీయ రంగంలో రష్యా ఆక్రమించుకుని వున్న అసాధారణమైన సానుకూల స్థానం, అభివృద్ధి నిరోధక శక్తిగా నిరంకుశ రష్యా యొక్క ప్రాముఖ్యతను సహజంగానే మరింత ఇనుమడింపజేసింది. స్వేచ్ఛాయుతమైన రష్యా మాత్రమే, పోలండ్, ఫిన్లండ్, జర్మనీ, ఆర్మీనియా దేశస్తులను గాని, మరే యితర చిన్న జాతుల ప్రజలను గాని పీడించవలసిన, ఫ్రాన్సునీ జర్మనీని ఒకరి మీదకు ఒకరిని ఉసికొల్పవలసిన అవసరం లేని రష్యా మాత్రమే, ఆధునిక యూరప్‌ను యుద్ధ భారం నుంచి విముక్తి చేసి స్వేచ్ఛాయువులను పీల్చుకోగలిగేటట్లు చేస్తుంది, యూరప్‌లోని అభివృద్ధి నిరోధక శక్తులన్నిటినీ బలహీనపర్చి యూరపియన్ కార్మికవర్గాన్ని పటిష్టం చేస్తుంది. అందుకనే పశ్చిమ ఖండంలోని యూరపియన్ కార్మికవర్గాన్ని పటిష్టం చేస్తుంది. అందుకనే పశ్చిమ ఖండంలోని కార్మికవర్గ ఉద్యమ ప్రగతికోసం కూడా రష్యాలో రాజకీయ స్వాతంత్ర్యస్థాపన జరగాలని ఎంగెల్స్ ప్రగాఢంగా వాంచించాడు. ఆయన మరణంతో రష్యన్ విప్లవకారులు తమ ముఖ్యస్నేహితుని కోల్పోయారు.

ఫ్రెడరిక్ ఎంగెల్స్ ద్విశత జయంతి సందర్భంగా

మహా యోధుడూ, శ్రామికవర్గ మహోపాధ్యాయుడూ అయిన ఫ్రెడరిక్ ఎంగెల్స్ స్మృతి చిరస్మరణీయంగా వర్ధిల్లుగాక! ❑

**రచన: 1895 శరత్తు**

**తొలిసారి 1896లో "రబోత్నిక్" అనే సంకలనంలో 12వ సంచికలో ప్రచురించబడింది.**

## 2019 అంతానికి ఆరంభం

**(23వ పేజీ తరువాయి)**

కాంగ్రెస్‌కూ బీజేపీకే పరిమితం కాదని దీంతో రుజువైంది. ఏ పార్టీలోకైనా గోడ్సే అభిమానులు చెదపురుగుల్లా తొలుచుకు పోగలరని కూడా మరోసారి రుజువైంది.

కాగా సమ్మె చేసే కార్మికులకు లక్ష నీతులు బోధించే మన న్యాయ కోవిదులెవ్వరూ, ఈ జాతీయ ద్రోహానికి ఫలానా శిక్ష వేసి తీరాలని అనకపోవడం విడ్డూరమే మరి! చిన్నపిల్లలకు కూడా తెలిసిన విషయం, ఒకానొక రాష్ట్ర ప్రభుత్వ బాధ్యులకు "తెలియకపోవడం" క్షంతవ్యమేనా? నిజానికి ఇది నిజం తెలియక పోవడమా? మరెవ్వరికీ నిజం తెలియనివ్వకుండా చేసే ప్రయత్నమా? మన శిక్షా స్మృతిలో ఈ నేరానికి ఏ శిక్షా నిర్దేశించలేదా?? ఇలాంటి విషయాలేవీ మన "ఇయర్ ఎండర్స్"లో ఎవరూ ఎప్పుడూ చెప్పరు!

"జాతి జాతి నిర్ఘాత పాత సంఘాత హేతువై, కాలకేతువై" నిలిచిన సంఘటన మన పక్కనున్న మహారాష్ట్రలో జరిగింది కూడా –నిన్నటితో ముగిసిన– నవంబర్లోనే కదా? ఎన్నికల్లో బీజేపీ చేతికి అధికారం అప్పజెప్పడం – ఆ మాటకొస్తే ఏ ఒక్కపార్టీకీ అధికారం అప్పజెప్పడం– తమకు ఇష్టం లేదని మహారాష్ట్ర జనం స్పష్టంగా తీర్పు చెప్పారు. కానీ ప్రజా తీర్పును పక్కన పెట్టి, బేరసారాల రాజకీయాలు సాగించి బీజేపీ తన నిజస్వరూపం బయట పెట్టుకుంది. రాజ్యాంగబద్ధ వ్యవస్థల పట్ల ఆ పార్టీ అధినాయకులకు ఏ పాటి గౌరవం ఉందో ఈ సంఘటనతో మరోసారి రుజువయింది. పదవీ రాజకీయాల పంకంలో పుట్టిపెరిగిన శరద్ పవర్‌తో వైకుంఠపాళీ ఆడబోయి బొక్కబోర్లా పడింది బీజేపీ. చిత్రం చెప్పనా? ఈ వివరాలు కూడా మన జాతీయ ప్రసార మాధ్యమాలు ప్రచురించే "ఇయర్ ఎండర్స్" లో ఎవరూ ఎప్పుడూ చెప్పరు!

ఇక, సాక్షాత్తూ పార్లమెంటు సాక్షిగా, గాంధీజీ హంతకుడైన నత్తు రామ్ గోడ్సేని గొప్ప దేశభక్తునిగా అభివర్ణిస్తూ టెర్రర్ కేసులో ముద్దాయిగా ఏళ్ళ తరబడి జైల్లో ఉండివచ్చిన బీజేపీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ మాట్లాడింది కూడా –నిన్నటితో ముగిసిన– నవంబర్లోనే కదా? ఎక్కడో జెఎన్యూ క్యాంపస్ లో ఎవరో విద్యార్థులు ఏవో నినాదాలు ఇచ్చారని ఆరోపిస్తూ కన్నయ్యపై రాజద్రోహం కేసు పెట్టిన బిజెపి ప్రభుత్వం తమ పార్టీ టిక్కెట్ పై భోపాల్ నుంచి ఎంపీగా ఎన్నికయిన ప్రజ్ఞా ఠాకూర్ పై మాత్రం మాటవరస "క్రమశిక్షణ" చర్య తీసుకోవడం గురించి ఏ జాతీయ ప్రసార మాధ్యమమైనా తమ "ఇయర్ ఎండర్స్" లో రాస్తాయేమో చూద్దాం!! ❑

ఫ్రెడరిక్ ఎంగెల్స్ ద్విశత జయంతి సందర్భంగా

# మార్క్సిజాన్ని సుసంపన్నం చేసిన ఎంగెల్స్

డి వి వి ఎస్ వర్మ
ప్రధాన సంపాదకులు



ఫ్రెడరిక్ ఎంగెల్స్ కేవలం మార్క్సుకు సహచరుడు మాత్రమే కాదు, ఆయన చేసిన అనేక రచనలకు భాగస్వామి. అంతకు మించి ఎంగెల్స్ తన స్వీయ రచనలతో మార్క్సిజాన్ని పరిపుష్టం చేసినవాడు.

1820 నవంబరు 28న నాటి జర్మనీలోని ప్రష్యా రాష్ట్రంలో బార్మెన్ పట్టణంలో జన్మించిన ఎంగెల్స్‌కి ఇది ద్విశతజయంతి సంవత్సరం. ఎంగెల్స్ కంటే రెండేళ్లు పెద్ద అయిన మార్క్స్ ద్విశత జయంతి ఉత్సవాలు 2017 నుండి 2018 వరకు ప్రపంచమంతటా జరిగాయి. సంక్షోభంలో కూరుకుపోయిన ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థను అర్థం చేసుకోడానికి, ప్రత్యామ్నాయాలను అన్వేషించడానికి తగిన మార్గాలు మార్క్స్ రచనలతోనే ఉన్నాయని చివరకు ఉదారవాద ఆర్థికవేత్తలు కూడా ప్రకటించాల్సి వచ్చింది. ఈ వ్యవస్తను మార్చాలన్న భావనలకు, ఉద్యమాలకు మార్క్స్ ద్విశత జయంతి ఉత్సవాలు సరికొత్త ఉత్తేజాన్ని కలిగించాయి. ఇప్పుడు ప్రారంభమౌతున్న ఎంగెల్స్ ద్విశత జయంతి ఉత్సవాలు దానికి కొనసాగింపుగా జరగాలి. మార్క్సిజంలోని చారిత్రిక, ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాహిత్య, సాంస్కృతిక రంగాలలో కొన్నింటికి పునాదినీ, మరికొన్నింటికి పర పుష్టినీ కల్పించిన ఎంగెల్స్ రచనలు, సాగించిన విప్లవ కార్యకలాపాలు మరోమారు ప్రపంచాన్ని నిస్సందేహంగా ప్రభావితం చేస్తాయి.

మార్క్స్ గురించి ఏంగెల్స్ "కొన్ని ప్రత్యేక రంగాలలో నేను చేసిన కృషిని మినహాయిస్తే ఇతర రచనలలో నేను సమకూర్చిన అంశాలను నేను లేకపోయినా మార్క్స్ తనంతటతానే చేయగలిగే వాడు. కానీ మార్క్స్ సాధించిన అంశాలను నేనుగా అందుకోలేక పోయి వుండేవాడిని. ఆయన మాకంటే చాలా ఎత్తులో ఉన్నందున చాలా దూరంగా వున్న వాటిని కూడా చూడగలగడమే కాదు మరింత సమగ్రంగా అత్యంత శీఘ్రంగా వాటిపై అభిప్రాయాలను చెప్పగలిగేవాడు. మార్క్స్ గొప్ప మేధావి. మేము మహా అయితే ప్రావీణ్యం గల వ్యక్తులం మాత్రమే. ఆయనే ఉండి ఉండకపోతే ఈ సిద్ధాంతం ప్రస్తుత స్థితికి ఎంతో దూరంలో వుండివుండేది" అందుచేత మార్క్స్ పేరుతో ఈ సిద్ధాంతం ఉండడమే సరైంది" అని చెప్పిన ఈ మాటలు ఆయన నమ్రతను సూచిస్తాయే కాని అవి పూర్తి సత్యాలు కావు. ఎందుకంటే ఎంగెల్స్ చేసిన కృషి కేవలం "కొన్ని రంగాలకు" మాత్రమే పరిమితమైంది కాదు. మార్క్స్‌తో భాగస్వామ్యం వహించి చేసిన సిద్ధాంతపరమైన రచనలు ఏక పక్షంగా సాగినవి కావు. అవి ఆదాన ప్రదానాలు

ఎంగెల్స్ జీవిత చిత్రణ చేసిన చాలా మందిలో ఆయనను ఒక వ్యాపారవేత్తగా, మార్క్స్‌కు జీవిత కాల మిత్రునిగా, ఆర్థికంగా సహాయపడిన వ్యక్తిగా చూపే ప్రయత్నాలే కనిపిస్తాయి. అంతకు మించి శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతానికి ఎంగెల్స్ సమకూర్చిన భూమికను అవి తక్కువ చెయ్యడం జరిగింది. ఎంగెల్స్ కేవలం మార్క్స్ నీడతో మెరిసిన చంద్రుడు కాదు. మార్క్స్ లాగే ఆయన కూడా స్వయం ప్రకాశం గలవాడే. ఇది మార్క్స్‌ను తగ్గించి చూపడం ఎంత మాత్రమూ కాదు. వారు సమ ఉజ్జీలు అయినందునే అది వారి చిరకాల స్నేహానికి, పరస్పర పూరకమైన రచనల భాగస్వామ్యానికి, శాస్త్రీయ దృక్పథాన్ని పలు రంగాలకు అన్వయించడానికి స్థిరమైన పునాది అయ్యింది

ఎంగెల్స్ చదువు హైస్కూల్ మధ్యలోనే ఆగిపోయింది. స్వయంకృషితోనే అర్థశాస్త్రం, మానవ పరిణామ చరిత్ర అధ్యయనంతో పాటు తత్వశాస్త్రం, సైన్స్, సాహిత్యం, మిలటరీకి సంబంధించిన విషయాలతో పాటు అనేక రంగాలలో మంచి పరిజ్ఞానం పొందారు. ఇంగిలీషులో ప్రావీణ్యంతో పాటు దాదాపు 20 భాషలు నేర్చుకున్నారు.

మార్క్స్, ఎంగెల్స్‌లు మొదటసారి 1842లో కొలోన్‌లో కలుసుకున్నారు. ఈ సమావేశంలో వారు ఒకరిని గురించి మరొకరు ప్రత్యేకంగా తెలుసుకున్నది ఏమీ లేదు. 1844లో పారిస్ నుండి యంగ్ హెగెలియన్ ఆర్నాల్డ్ రూజ్ ప్రచురిస్తున్న "ది జర్మన్, ఫ్రెంచ్ ఇయర్ బుక్" రూపకల్పనలో భాగస్వామిగా మార్క్స్ అక్కడికి వెళ్లారు. దీనిలో ప్రచురణ కోసం ఎంగెల్స్ రాసిన "అవుట్ లైన్స్ ఆఫ్ పొలిటికల్ ఎకానమీ" వ్యాసం మార్క్స్‌ను విశేషంగా ఆకట్టుకుంది. ఇది ఒక పురోగామి మేధావి రచనగా పేర్కొన్నాడు. జర్మనీ వెళ్ళేటప్పుడు తనతో పారిస్‌లో కొన్ని రోజులు ఉండేలా రమ్మని ఎంగెల్స్‌ను కోరాడు. అలా వారిద్దరూ 1844 ఆగస్టులో పారిస్‌లో పది రోజుల పాటు కలిసి వున్నారు.

ఈ పది రోజులలో వారు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. చారిత్రకాభివృద్ధి క్రమంలో బూర్జువా సామాజిక వ్యవస్థ ఒక దశ మాత్రమేనని అది మారి తీరుతుందనీ కార్మిక వర్గం ఆ మార్పును సాధించే విప్లవకర వర్గమనీ అదే సోషలిజానికి లేదా కమ్యూనిజానికి మార్గం అని ఉభయులూ భావించారు. ఇవి చర్చల నుండి వచ్చిన భావ సారూప్యత కాదు. అంతకు ముందే ఎవరికి వారుగా వచ్చిన నిర్ధారణలు. పైగా వేర్వేరు మార్గాల ద్వారా పొందినవి. బ్రిటీష్ క్లాసికల్ అర్ధశాస్త్రాల, బ్రిటీష్ లేబర్ ఉద్యమాల అధ్యయనం ద్వారా ఎంగెల్స్, మరో పక్క మార్క్స ఫ్రెంచ్ విప్లవాన్ని, దాని నుండి ఉత్పన్నమైన కార్మికవర్గ రాడికలిజం, సోషలిస్టు సమానత్వ భావజాలాల అధ్యయనం నుండి పై నిర్ధారణలకు చేరుకున్నారు. ఇలా మార్క్స, ఎంగెల్స్‌లు భిన్న మార్గాలలో ఒకే లక్ష్యానికి చేరుకున్న మేధాసంపన్నులు.

ఈ దిగ్గజాల కలయికతో మార్క్సిస్టు సిద్ధాంతం రూపు దిద్దుకోడానికి మూలాధారాలైన బ్రిటీష్ క్లాసికల్ అర్ధశాస్త్రం, ఫ్రెంచ్ ఊహాజనిత సోషలిజం, జర్మన్ క్లాసికల్ ఫిలాసఫీలు ఒక్కచోటికి చేరినట్లయింది. ఒకే లక్ష్యం కోసం ఏకమైన ఈ ఇద్దరూ చివరి దాకా అదే బాటలో నడిచారు. ఒక పక్క విప్లవ సిద్ధాంతాలకు పదును పెట్టడం, మరోపక్క దానిని ఆచరణలో పెట్టగల విప్లవ కార్మికోద్యమాన్ని నిర్మించే పనిలో పూర్తిగా నిమగ్నమయ్యారు.

ఎంగెల్స్ పారిస్‌ను వదిలి వెళ్లే ముందే "ది హొలీ ఫ్యామిలీ –ఎ క్రిటిసిజం ఆఫ్ క్రిటికల్ క్రిటిసిజం" పుస్తకంలో తొలి ప్రకరణం రాసి ఇచ్చాడు. మార్క్స దానిని పూర్తి చేశారు. తర్వాత 1848లో కమ్యూనిస్టు లీగ్ కోసం ఎంగెల్స్ ముందుగా "కమ్యూనిస్టు సూత్రాలు" పేరుతో, ప్రశ్నలు జవాబుల రూపంలో ముసాయిదాను రాశారు అది మార్క్స –ఎంగెల్స్ ల ఉమ్మడి రచనగా నేటికీ ప్రపంచ ప్రసిద్ధమైన "కమ్యూనిస్టు ప్రణాళిక" కు ప్రాతిపదిక అయ్యింది. మార్క్స రచనలలో చాలా వాటికి అర్ధవంతమైన ముందు మాటలను ఎంగెల్స్ రాశారు. మార్క్సకు తీరిక దొరకనప్పుడు న్యూయార్క్ ట్రిబ్యునల్‌కు ఆయన పేరుతో ఎంగెల్స్ కొన్ని వ్యాసాలు కూడా రాశారు. అలా విడదీయరాని భావజాల అనుబంధం వారిది.

ఎంగెల్స్ స్వీయ రచనలు కూడా చాలా ప్రసిద్ధమైనవి. మార్క్సిజాన్ని పలు రంగాలకు వర్తింపజెయ్యడం ద్వారా దానిని మరింత సుసంపన్నం చేశాడు.

"యాంటీ డ్యూరింగ్" గ్రంథంలో మార్క్సిస్టు తత్వశాస్త్రపు మూల సూత్రాలు విస్పష్టంగా, హేతుబద్ధంగా విపులీకరించాడు. ఆర్థిక సిద్ధాంతానికి శాస్త్రీయమైన పునాదులు వేశాడు. తర్వాత కార్మికుల కోసం ఈ పుస్తకంలోని కొన్ని భాగాలను వేరుచేసి ''సోషలిజం : ఊహాజనితము శాస్త్రీయము'' అన్న పేరుతో ప్రచురించారు. సోషలిజానికి శాస్త్రీయ పునాదిని ఆవిష్కరిస్తూ గతి తర్కాన్ని , చారిత్రిక భౌతికవాదాన్నీ విపులీకరించాడు. ఎంగెల్స్ రచనలలో ఈ పుస్తకం ప్రపంచ వ్యాపితంగా అత్యంత ప్రాచుర్యాన్ని పొందింది.

**ఫ్రెడరిక్ ఎంగెల్స్ ద్విశత జయంతి సందర్భంగా**

ఎంగెల్స్ మరో రచన "ప్రకృతి గతితర్కం". ఇందులో ఆయన తన కాలపు ప్రకృతి విజ్ఞాన శాస్త్రాలు సాధించిన అతి ముఖ్య విజయాలన్నింటికీ తాత్విక పరమైన సాధారణీకరణలు చేశాడు

అలాగే "లుడ్విగ్ ఫ్యూయర్ బాక్ – సాంప్రదాయిక జర్మన్ తత్వశాస్త్ర పరిసమాప్తి" అనే పుస్తకంలో తత్వశాస్త్రపు మౌలిక సమస్య చైతన్యానికీ అస్తిత్వానికీ, పదార్థానికీ భావానికీ మధ్య ఉన్న సంబంధాలకు సంబంధించినదే అన్న ప్రధానాంశాన్ని ఎంగెల్స్ శాస్త్రీయంగా నిరూపించాడు.

జర్మనీలో రైతు యుద్ధం పేరుతో రాసిన పుస్తకంలో కార్మిక వర్గానికి రైతాంగంతో గల విప్లవకర భాగస్వామ్యాన్ని చరిత్ర మూలాల నుండి ఆవిష్కరించాడు. కుటుంబం, వ్యక్తిగత ఆస్తి, రాజ్యాల ఆవిర్భావం అన్న పుస్తకంలో చారిత్రకంగా సాగిన సామాజిక అభివృద్ధి క్రమాన్ని విశ్లేషించాడు.

వీటికి తోడు మార్క్స మరణానంతరం ప్రచురణకు సిద్ధంగా లేని కాపిటల్‌లోని రెండు, మూడు భాగాలను పరిష్కరించి ప్రచురించి తన చిరకాల మిత్రుని కలను సాకారం చేశాడు.

అదే కాలంలో అంతర్జాతీయ కార్మికోద్యమ నిర్మాణానికి తీవ్రంగా కృషి చేశాడు. మార్క్స మరణానంతరం తానే సారధిగా కొత్త సోషలిస్టు ఇంటర్నేషనల్ స్థాపనకు పూనుకున్నాడు. 22 దేశాలకు ప్రాతినిధ్యం వహించే 407 మంది ప్రతినిధులు 1889 జూలై 14న పారిస్‌లో మార్క్సిస్టుల మొదటి మహాసభ జరిగింది. "సకల దేశాల కార్మికులారా, ఏకంకండి!" అన్న నినాదంతో, ఎనిమిది గంటల పని దినాన్నీ, అంతర్జాతీయ కార్మికవర్గ సంఘీభావాన్ని సాధించుకొనేందు కోసం ఏటా మే 1 న ప్రదర్శనలు జరపాలని సూచించింది.

1895 మార్చిలో ఆయన అస్వస్థత తిరగబెట్టింది. 1895 ఆగస్టు 5న రాత్రి పదిన్నర గంటలకి ప్రముఖ పండిత విప్లవకారుడూ, శాస్త్రీయ కమ్యూనిజం మూల పురుషుల్లో ఒకడూ అయిన ఎంగెల్స్ హృదయ స్పందనం శాశ్వతంగా నిలిచిపోయింది

ఎంగెల్స్ ద్వి శతజయంతి ఉత్సవాలు అర్ధవంతంగా స్ఫూర్తి దాయకంగా జరుగుతాయని ఆశిద్దాం ❑

RNI Regn No. 52879/93

*With best compliments from*

☎ 0866 2436959
94919 62759

**S.R. BOOK LINKS**

31-13-18, Danaiah Street, Machavaram
**VIJAYAWADA - 520 004**

❖

D.R. Rao ✆ 98491 81712

**S.R. PUBLISHERS**

#11-8-31, Jagannadham Street
**VIJAYAWADA - 520 001**

- *Student's Manuals*
- *Question Banks*
- *Rank Gainers*
- *Work Books*
- *Dictionaries*

email : sriraghavendrapublishers@hotmail.com

Phones : 0866 2560312, 2568312, 2560542

Fax : 0866 2568612

**JAATEEYA SPURTHI,** Fortnightly Printed and **Published by N. Venkateswara Rao**
at Godavari Printers, R.R.Pet, ELURU - 534 002. ✆ 9848 234228 **Chief Editor : D V V S Varma**